RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక


Published from Hyderabad and Medchal Malkajgiri
CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 298 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: సోమవారం 01-06-2026 పేజీలు : 12 వెల: 1-00

## మంజీరా నదిలో మునిగి బావ- బావమరిది మృతి



**రుద్రూర్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు మంజీర నదిలో మునిగి బావ, మిగతా 2లో..



# పార్టీ బలోపేతానికి నేతలు కృషి చేయాలి

## కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేతో సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతల భేటీ

**హైదరాబాద్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్ మీదుగా గుల్బర్గా వెళ్లిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీహరి, టీపీసీసీ మిగతా 2లో..

# అథ్లెట్లు గుర్విందర్ సింగ్, అనిమేష్‌కు అభినందనలు

### మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, మే 31:** భారత అథ్లెట్ గుర్విందర్ సింగ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల గురించి ఆదివారం మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వందమీటర్ల పరుగులో రికార్డులు సృష్టించిన అథ్లెట్లు గుర్విందర్, అనిమేష్‌తో ఆయన నేరుగా మాట్లాడారు. కేవలం రెండు రోజుల్లోనే 100 మీటర్ల పరుగు పందెంలో జాతీయస్థాయిలో మూడు రికార్డులు సృష్టించామని మోదీ అన్నారు. ఈ అద్భుతమైన ఘనత సాధించిన ఇద్దరు అథ్లెట్లు గుర్విందర్ సింగ్, అనిమేష్‌కు అభినందనలు తెలిపారు. మోదీ పర్యటన నేపథ్యంలో 'అనైమంగళం' రాగి శాసనాలను నెదర్లాండ్స్ ప్రభుత్వం భారత్‌కు తిరిగి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇది భారతీయులు గర్వించదగిన విషయమని మోదీ అన్నారు. ఇక, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ కాలువలో మిగతా 2లో..

## నకిలీ జీవో కోసం రాధాకృష్ణకు బ్రహ్మానాయుడు రూ.4 కోట్లు ఇచ్చారు


### డీసీపీ శ్రీనివాస్



**హైదరాబాద్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భూకబ్జా వ్యవహారంలో వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడిపై ఆధారాలు లభ్యమైనట్టు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. నకిలీ జీవో కోసం రాధాకృష్ణకు బొల్లా.. రూ.4కోట్లు ఇచ్చినట్టు గుర్తించామన్నారు. భూమి క్రమబద్ధీకరించాలని కలెక్టర్, సీసీఎల్ఏకు దస్త్రాలు వెళ్లినట్టు సృష్టించారని పేర్కొన్నారు. రాధాకృష్ణ చెప్పిన విషయాలు, నిమ్మల కుటుంబం చెప్పిన విషయాలు సరిపోలాయన్నారు. రాధాకృష్ణ 9 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. అతని వద్ద కందుకూరు, అంబర్‌పేటలో స్థల పత్రాలు లభించాయని చెప్పారు. వివిధ నకిలీ సంస్థలు సృష్టించి స్టాంపులు తయారు చేశారని డీసీపీ వెల్లడించారు.

# ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు: పాక్ దుశ్చర్య

**న్యూఢిల్లీ, మే 31:** ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్‌వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా సెల్యూలర్ సంకేతాలను పంపిస్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగ పడుతోందని అధికారులు వెల్లడించారు. ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వతశ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి. ముఖ్యంగా



కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి. పాకిస్థాన్ టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఉగ్రవాదులు వాడే వైఎస్ఎంఎస్‌కు మిగతా 2లో..

## ఒక్క గురుకుల పాఠశాలకైనా శంకుస్థాపన చేశారా?

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**హైదరాబాద్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పదేళ్ల హయాంలో ఒక్క ఎస్సీ గురుకుల పాఠశాలనూ నిర్మించడం చేతగాని బీఆర్ఎస్ నేతలకు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డి పాలనను విమర్శించే నైతికత లేదని మంత్రి మిగతా 2లో..

## మేనల్లుడిపై దాడి.. ఆస్పత్రి సీఈవోకు మమత వార్నింగ్ ఆడియో లీక్..!



**కలకత్తా, మే 31:** తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై దాడి నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడిపై మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలో కోల్‌కతాలోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రి సీఈవోకు ఆమె వార్నింగ్ ఇస్తున్న ఆడియో బహిర్గతమైంది. ఇది కాస్త రాజకీయ దుమారం రేపింది. అభిషేక్ బెనర్జీపై సోనార్‌పుర్‌లో దాడి అనంతరం.. చికిత్స కోసం బెల్ వ్యూ ఆస్పత్రికి తరలించారు. అభిషేక్ పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పటికీ.. డిశ్చార్జ్ చేయాలంటూ భాజపా నాయకులు, ఓ సీనియర్ పోలీసు అధికారి ఆస్పత్రిపై ఒత్తిడి తెచ్చారని మమత ఆరోపించారు. తన మేనల్లుడికి ఏమైనా జరిగితే ఆస్పత్రిదే బాధ్యత అని మండిపడ్డారు. ఈ క్రమంలో మమతా బెనర్జీ బెల్ వ్యూ ఆస్పత్రి సీఈవో ప్రదీప్ టాండన్‌ను హెచ్చరిస్తున్న ఆడియో బయటకు వచ్చింది. 'టాండన్ మీరు తప్పుచేశారు. మేము మీకు చేసిన సాయాన్ని గుర్తుచేసుకోండి. దేవుడు మిమ్మల్ని క్షమించడు. మీ అహంకారాన్ని గుర్తుంచుకుంటాం. మీరు తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆస్పత్రిని మిగతా 2లో..

## ఫిన్‌టెక్ రంగంలోకి ఎల్ఐసీ

### సీఈఓ దొరైస్వామి




**న్యూఢిల్లీ, మే 31:** ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఫిన్‌టెక్ రంగంలోకి ప్రవేశించాలనుకుంటోంది. డిజిటల్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యూహాత్మక పెట్టుబడులు లేదా ఆర్గానిక్ మార్గంలో ఫిన్‌టెక్ విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కంపెనీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి తెలిపారు. ఆధునిక అవసరాలను తీర్చడానికి, నూతన ఆవిష్కరణల కోసం అటు ఫిన్‌టెక్, ఇటు ఇన్సురెన్స్‌టెక్ కంపెనీలతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు పీఐటీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశలపై మాట్లాడారు. కేవలం బీమా వ్యాపారమే కాకుండా దేశంలోనే అతిపెద్ద ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ ఉందని, అనేక మిగతా 2లో..

# సాయుధ దళాల వ్యవస్థీకృత సంస్కరణలపైనే దృష్టి

### కొత్త సీడీఎస్ రాజా సుబ్రమణి

**న్యూఢిల్లీ, మే 31:** భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా జనరల్ రాజా సుబ్రమణి నేడు బాధ్యతలు స్వీకరించారు. మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఆయనకు బాధ్యతలను అప్పగించారు. దీంతో మిలటరీ థియేటరైజేషన్ బాధ్యతలను ఇక నుంచి సుబ్రమణి పర్యవేక్షించనున్నారు. వీటి ద్వారానే భారత త్రివిధ దళాల్లో సమన్వయం పెరుగుతుందని అంచనావేస్తున్నారు. జనరల్ రాజా సుబ్రమణి చైనా, పాకిస్థాన్ అంశాల్లో నిపుణుడిగా సైనిక వర్గాల్లో పేరుంది. ఆయన నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు మిలిటరీ అడ్వైజర్‌గా కూడా పనిచేశారు. వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. తాజా బాధ్యతల్లో ఆయన ఇంటిగ్రేటెడ్ మిలిటరీ కమాండ్స్ ఏర్పాటుతో.. థియేటరైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. మరోవైపు సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పదవీ కాలం శనివారంతో ముగిసింది.

**పూర్తి అంకితభావంతో దేశసేవ: రాజా సుబ్రమణి**

సీడీఎస్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత



జనరల్ రాజా సుబ్రమణి మీడియాతో మాట్లాడారు. "దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి సైనిక దళాలు పూర్తిగా కట్టుబడి ఉన్నాయన్నారు. దళాలు దేశ సేవ కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తాయని తాను హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

**నేవీ చీఫ్‌గా అడ్మిరల్ స్వామినాథన్ బాధ్యతల స్వీకరణ**

నేవీ చీఫ్‌గా అడ్మిరల్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

## పార్టీ బలోపేతానికి నేతలు కృషి చేయాలి

అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు.. ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై మల్లికార్జున ఖర్గేతో చర్చించారు. పార్టీ బలోపేతానికి నేతలు కృషి చేయాలని ఈ సందర్భంగా ఖర్గే సూచించినట్టు సమాచారం.

## మంజీరా నదిలో మునిగి బావ- బావమరిది మృతి

బావమరిది ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన గంగొండ (43), ఆయన బావ, రెంజల్ మండలం బోర్గం గ్రామానికి చెందిన గంగారం (50), గంగొండ చిన్న కుమారుడు సంతోష్ కలిసి ఆదివారం ఉదయం గొర్రెలను తీసుకొని మంజీరా నదికి వెళ్లారు. అక్కడ వాటిని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు గంగారం నీట మునిగిపోయారు. గమనించిన గంగొండ.. బావను కాపాడేందుకు యత్నించి ఆయన కూడా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

## అథ్లెట్లు గుర్విందర్ సింగ్, అనిమేష్‌కు అభినందనలు

చిక్కుకుపోయిన డాల్ఫిన్‌ను కొందరు దాదాపు 13 గంటలపాటు శ్రమించి రక్షించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ప్రధాని మోదీ ఈ సంఘటనను కూడా మన్‌కీ బాత్‌లో మాట్లాడారు. గంటలపాటు శ్రమించి డాల్ఫిన్‌ను కాపాడినవారిని అభినందించారు. ఈ సహాయక చర్యల్లో కేంద్రం ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన డాల్ఫిన్ అంబుల్స్ కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. కేరళలోని ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. ఈ క్లబ్ ద్వారా ఇప్పటి వరకు 15వేల మందికి పైగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మోదీ పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎండల నుంచి రక్షణ కోసం వాడే పానీయాలు మామిడి పండ్లు, మజ్జిగ, షర్బత్, బేల్‌పనా గురించి ప్రస్తావించారు.

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు: పాక్ దుశ్చర్య

ఉపయోగపడుతుంది. సీడీఎంఏ పలు సిగ్నల్స్‌ను ఏకకాలంలో అనుమతిస్తుంది. దీంతో భద్రతా ఏజెన్సీల ఎలక్ట్రానిక్ మానిటరింగ్ సమస్యాత్మకంగా మారుతుంది. దీంతో ఉగ్రవాదులు వైఎస్ఎంఎస్ టెక్నాలజీని విరివిగా వాడుతున్నారు. దీంతో పాక్ పంపే సిగ్నల్స్‌తో పీవోకేలోని హ్యాండ్లర్లు, చొరబాటుదారులు, వారికి ఆశ్రయం ఇచ్చే వారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఈ అక్రమ విధానాలతో పాకిస్థాన్ ఐరాస అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ రాజ్యాంగంలోని 45 ఆర్టికల్‌ను ఉల్లంఘిస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒప్పందంపై సంతకాలు చేసిన మొత్తం 193 దేశాలు తమ భూభాగం నుంచి అధిక, రోగ్, తప్పుడు, తప్పుదోవ పట్టించే సంకేతాలు పక్కదేశాల్లోకి వెళ్లకుండా సహకరించుకోవాలి.

## ఒక్క గురుకుల పాఠశాలకైనా శంకుస్థాపన చేశారా?

అద్లూరి లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఒక్క గురుకుల పాఠశాలకైనా శంకుస్థాపన చేసినట్లు కేటీఆర్ నిరూపించాలని, అందుకు తానెక్కడికి రమ్మన్నా వస్తానని సవాల్ విసిరారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు టెండర్ ప్రక్రియ పూర్తి కాకముందే.. ఏదో అవినీతి జరిగింది అంటూ కేటీఆర్ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై నిత్యం బురద జల్లే ప్రయత్నం చేస్తున్న ఆయన.. ముందు నిజాలు మాట్లాడటం నేర్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులను సైతం తామే చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.

## మేనల్లుడిపై దాడి.. ఆస్పత్రి సీఈవోకు మమత వార్నింగ్ ఆడియో లీక్..!

నడుపుతున్నారు. ఇప్పుడు భాజపా అధికారంలో ఉంది. తర్వాత వాళ్లు అధికారం కోల్పోతే.. మేం చేయాల్సింది చేస్తాం' అని ఆమె పేర్కొన్నట్లు అందులో ఉంది. ప్రస్తుతం అభిషేక్ బెనర్జీకి ఇంట్లోనే చికిత్స అందిస్తున్నట్లు మమత తెలిపారు. కాగా.. ఈ దాడికి సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు.

## ఫిన్‌టెక్ రంగంలోకి ఎల్ఐసీ

పెద్ద పెద్ద కంపెనీల్లో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిందన్నారు. పాలసీదారులకు మెరుగైన ప్రతిఫలం అందించేందుకు ప్రత్యేకమైన సంస్థల్లో వ్యూహాత్మక పెట్టుబడులకూ ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ టెక్నాలజీని ఎల్ఐసీ వేగంగా అందిపుచ్చుకుంటోందని చెప్పారు. తమ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా సొంతంగానే తమ బిజినెస్ అప్లికేషన్లను తయారు చేసుకుంటున్నామని వెల్లడించారు. అదే సమయంలో కొత్త కొత్త ప్లాట్‌ఫామ్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఇతర ఐటీ సర్వీస్ ప్రొవైడర్లతోనూ కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఫిన్‌టెక్ రంగంలో పోటీలో నిలదొక్కుకోవాలంటే ఐటీ అప్లికేషన్‌లను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఐసీలో తదుపరి వాటాల విక్రయంపై ప్రశ్నించగా.. పబ్లిక్ షేర్‌హోల్డింగ్ పరిమితిని పెంచేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

## సాయుధ దళాల వ్యవస్థీకృత సంస్కరణలపైనే దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

స్వామినాథన్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్న డీకే త్రిపాఠీ పదవీకాలం శనివారంతో ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు స్వామినాథన్ వెస్ట్రన్ నేవల్ కమాండ్‌కు ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు.

దేశ ప్రయోజనాలు కాపాడేందుకు పూర్తిగా కట్టుబడి ఉంటానని ఈ సందర్భంగా కొత్త నేవీ చీఫ్ వెల్లడించారు.

## మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

- ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పుకుంటా
- లేకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీషరావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోదీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ధి కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

## మూడవ డిస్కమ్‌తో రైతులకు ఉరే

### రైతు డిస్కమ్‌ను బిఆర్ఎస్ వ్యతిరేస్తోంది... దీనికి వ్యతిరేకంగా పోరాడుతాం: బడుగుల

**సూర్యాపేట, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ రైతాంగం పాలిట ఉరితాడుగా మారనున్న మూడవ డిస్కం ఏర్పాటును బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఈ విషయంలో రైతుల పక్షాన పార్టీ ముందుండి పోరాడుతుందని బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కేసీఆర్ చేసిన రైతు అనుకూల కార్యక్రమాలు రైతుబంధు, ఉచిత విద్యుత్, ధాన్యానికి ధర ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తుందన్నారు. మూడవ డిస్కం తీసుకొస్తామని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ముందు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టక తప్పదనడం రైతులను నిలువున మోసం చేసే ప్రయత్నమే అన్నారు. రైతులు కరెంట్ ఎంత వాడుతున్నారో తెలియడం లేదని కాబట్టి రైతుల మోటార్లకు మీటర్లు పెట్టడం తప్పదు కాబట్టి మూడవ డిస్కం పెడతామనడం సిగ్గుచేటు అన్నారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కేసీఆర్ 24 గంటలు రైతుకు ఉచిత కరెంట్ అందజేశారని రైతుల మోటార్లకు మీటర్లు పెడితే నాటి బిజెపి ప్రభుత్వం 30 వేల కోట్ల సబ్సిడీ ఇస్తామన్న లొంగలేదన్నారు. తన మెడ మీద తలకాయ ఉన్నంత వరకు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేది లేదని తెలంగాణలో కేసీఆర్ తిరస్కరించాడన్నారు. మళ్లీ మీరు తెలంగాణలో రైతుల మోటార్లకు మీటర్లు పెట్టేందుకు ప్రయత్నిస్తూ 10 నుంచి 15 వేల కోట్ల రూపాయల వ్యాపారాన్ని అదానీ, అంబానీ లకు అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్లకు కక్కుర్తి పడుతూ రైతుల మెడకు ఉరితాడు బిగిస్తుందన్నారు. మూడవ డిస్కం ఏర్పాటును బీఆర్ఎస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని, రైతుల పక్షాన ముందుండి పోరాడుతుందన్నారు. నిన్న జరిగిన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదని 3 గంటలు ఉంటే చాలని మాట్లాడడం రైతులను ఆగ్రహానికి గురి చేస్తుందన్నారు. ఇప్పటికే ఉన్న రెండు డిస్కంలకు రూ.54 వేల కోట్ల రుణం ఉందని అవే కష్ట కష్టంగా నడుస్తున్నాయని అది చాలదు అన్నట్లు కొత్త డిస్కం ఏర్పాటుతో ఉచిత విద్యుత్ ను రద్దు చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయానికి వస్తే 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారంలో కొనుగోలు కేంద్రాలను మూసివేస్తామని అంటున్నారని అన్నారు. 2023లో కేసీఆర్ 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఇంటికి వెళ్లి డబ్బులు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు, సివిల్ సప్లయ్ అధికారుల అవినీతి కారణంగా మిల్లర్లు కొనలేక తాలు పేరు చెబుతూ బస్తాల సాకు చెబుతూ రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లాల వద్దనే రైతులు పడిగాపులు కాస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి ప్రతి గింజను కొనుగోలు చేయాలన్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఓటరు సవరణలో కొత్త ఓటర్లను చేర్చడంతో పాటు దొంగ ఓట్ల ఏరివేతలో ముందుండాలని, ఓటరు జాబితాలో తప్పులు లేకుండా నిజమైన ఓటర్లు ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకుడు ఉప్పల ఆనంద్ పాల్గొన్నారు.

## రైతులకు వాతావరణ సూచనలు

### తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం... ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలోని రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమంను రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా (డీఐఎల్ ఇండియా), ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా మరియు ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.



ఈ సందర్భంగా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ శ్రీ అంకుర్ గర్ న్యూఢిల్లీ నుండి జూమ్ ద్వారా పాల్గొని, తమ సంస్థ రైతుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రి గారికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది తెలంగాణ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి మరియు ప్రత్యేకంగా మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఖచ్చితమైన, సమయానుకూల వాతావరణ సమాచారం అందించడం అత్యంత అవసరమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సూచనలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక నిర్ణయాలు

### 11 ఎజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి గ్రీన్ సిగ్నల్

### సిఎంసి భవన నిర్మానానికి 161 కోట్లు మంజూరు

**హైదరాబాద్,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, నగర అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అధ్యక్షతన, సీఎంసీ కమిషనర్ సృజన ఆధ్వర్యంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మొత్తం 11 ఎజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా పలు ప్రధాన రోడ్ల అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జె.జె.నగర్ నుంచి కొంపల్లి వరకు 30 మీటర్ల రోడ్డు అభివృద్ధి పనులకు, అలాగే అమీన్‌పూర్ కమాన్ నుంచి బందం కొమ్ము చెరువు వరకు 45 మీటర్ల రోడ్డు ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. ఇక సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కు సంబంధించి ఏఎస్సీఐ సేవల ప్రతిపాదనను కమిటీ ఉపసంహరించుకుంది. ఈ సమావేశంలో అన్నిటికంటే ముఖ్యంగా సీఎంసీ శాశ్వత కార్యాలయ భవన నిర్మాణానికి కమిటీ ఆమోదం తెలిపింది. ఖానామెట్‌లో నిర్మించబోయే ఈ భవనానికి రూ. 161 కోట్లు మంజూరు చేశారు. అలాగే ఖైత్లాపూర్ లో జీ ప్లస్ 8 అంతస్తులతో అధునాతన కార్యాలయ భవనాన్ని నిర్మించనున్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా దీనిని జీ ప్లస్ 12 అంతస్తుల వరకు విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రజా సమస్యలు, దరఖాస్తుల వేగవంతమైన పరిష్కారం కోసం టౌన్ ఎ÷-లానింగ్ ,ఇంజినీరింగ్ విభాగాలను బలోపేతం చేయాలని కమిటీ నిర్ణయించింది. ఫీల్డ్ తనిఖీలను వేగవంతం చేయడానికి టౌన్ ఎ÷-లానింగ్‌లోనూ, మౌలిక సదుపాయాల పనుల పర్యవేక్షణకు ఇంజినీరింగ్ విభాగంలోనూ అదనపు సిబ్బందిని నియమించనున్నారు. పరిపాలనా సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు వీలుగా కన్సల్టెన్సీ సపోర్ట్ సర్వీసుల వినియోగానికి కూడా కమిటీ ఆమోదం తెలిపింది. కొత్తగా విలీనమైన యూఎల్బీల్లో దోమల నియంత్రణెళి లక్ష్యంగా ఎంటమాలజీ పైలట్ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నారు. దీని కోసం ఫాగింగ్ మిషన్లు, ఇతర పరికరాల కొనుగోలుతో పాటు సిబ్బంది నియామకానికి ఓకే చెప్పారు. అలాగే నగరంలో చెట్ల నిర్వహణ, ప్రజా భద్రత కోసం 14 బకెట్ ల్యాడర్లను ఏర్పాటు చేయనున్నారు. నగర పచ్చదనం, బయోడైవర్సిటీని పెంచేందుకు రూ. 5.70 కోట్లతో అర్బన్ బయోడైవర్సిటీ కార్యక్రమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.నగరంలో క్రీడా సౌకర్యాల లీజు ధరలు, వాటి కాలపరిమితి సవరణలకు కూడా స్టాండింగ్ కమిటీ ఆమోదం ముద్ర వేసింది.

## గ్రేటర్ పరిధిలో ముగిసిన సమ్మర్ ఆఫర్

### జూన్ 1 నుంచి యధావిధిగా బస్సు ఛార్జీలు

### ఆర్టీసీ నగర రీజియన్ అధికారుల ప్రకటన

**హైదరాబాద్,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ షాకింగ్ న్యూస్ చెప్పింది. వేసవి కాలంలో ప్రయాణికులకు ఉపశమనం కలిగించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రవేశపెట్టిన ప్రత్యేక సమ్మర్ డిస్కౌంట్ ఆఫర్ ముగిసిందని తెలిపింది. మూడు నెలల పాటు మార్చి, ఏప్రిల్, మేలలో ఇచ్చిన రాయితీ గడువు ముగియడంతో జూన్ 1 నుంచి మెట్రో డీలక్స్, ఏసీ బస్సుల్లో పాత చార్జీలను యథావిధిగా పునరుద్ధరిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ మార్పుపై ప్రయాణికుల్లో ఎలాంటి గందరగోళం లేకుండా ఈ మేరకు శనివారం (మే 30) క్లారిటీ ఇచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో కొత్తగా ఎలాంటి ఛార్జీలను పెంచలేదని, కేవలం వేసవి కాలం కోసం ప్రత్యేకంగా అందించిన సమ్మర్ డిస్కౌంట్ గడువు మాత్రమే ముగిసిందని పేర్కొంది. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సంస్థకు సహకరించాలని అధికారులు కోరారు. తీవ్రమైన ఎండల దృష్ట్యా సామాన్య ప్రయాణికులకు సుఖవంతమైన, ఏసీ ప్రయాణాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే ఉద్దేశ్యంతో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ సమ్మర్ ఆఫర్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి 2026, మార్చి నుంచి 2026, మే 31 2026 వరకు ఈ రాయితీలు అందుబాటులో ఉన్నాయి. మూడు నెలల పాటు కొనసాగిన సాగిన ఈ ఆఫర్ గడువు ముగియడంతో జూన్ 1వ తేదీ నుంచి రాయితీకి ముందు ఉన్న పాత టికెట్ ధరలే అమలులోకి వస్తాయి. ఈ మూడు నెలల పాటు ఆఫర్‌ను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి సహకరించిన ప్రయాణికులకు ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యం ధన్యవాదాలు తెలియజేసింది.

## సింగరేణి డిస్పెన్సరీ మూత సరికాదు

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రచార కార్యదర్శి

**ఖమ్మం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామవరం సింగరేణి డిస్పెన్సరీ మూసివేత కుట్రను యాజమాన్యం తక్షణమే విరమించుకోవాలని, ఆస్పత్రిని పునరుద్దరించాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రచార కార్యదర్శి వంగా వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం అయన మీడియాతో మాట్లాడుతూ.. రామవరం ప్రాంతంలో నివసిస్తున్న వందలాది మంది సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు, వారి కుటుంబాలతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఈ వైద్యశాల ఎంతో కాలంగా వైద్య సేవలు అందిస్తోందని, ఈ ఆస్పత్రిలో కొత్త వైద్యుల నియామకం చేపట్టకుండా, కేవలం ఇద్దరు స్టాఫ్‌తో మందులు ఇచ్చేలా యాజమాన్యం కుట్రపూరితంగా మార్చిందని మండిపడ్డారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగి పదవీ విరమణ పొందడంతో, కొత్తవారిని నియమించకుండా ఆస్పత్రిని ఏకంగా సీల్ చేయడం సరైంది కాదన్నారు. ఈ ఆస్పత్రిని మూసివేయడం వల్ల స్థానిక కార్మిక కుటుంబాలు చిన్నపాటి వైద్య సేవలకు సైతం సుదూర ప్రాంతంలోని ప్రధాన వైద్యశాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వారికి ఆర్థికంగా, శారీరకంగా తీవ్ర భారంగా మారుతుందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం మొండివైఖరి వీడి తక్షణమే ఇక్కడ వైద్యులను, సిబ్బందిని నియమించి ఆస్పత్రిని యధావిధిగా కొనసాగించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోలు పక్రియలో తీవ్ర జాప్యం

**యాదాద్రి భువనగిరి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ధాన్యం కొనుగోలు పక్రియలో తీవ్ర జాప్యంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని నమిలే గ్రామ రైతులు శనివారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండిపోవడం, తూకం పక్రియ ఆలస్యం కావడం, తరుగు పేరుతో ఇబ్బందులు పెట్టడం వంటి సమస్యలపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో రైతులు నమిలే క్రాస్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల నినాదాలతో ప్రాంతం మారుమోగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి వారాల తరబడి ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల భయంతో రాత్రింబవళ్లు ధాన్యం కుప్పల వద్దే కాపలా కాస్తున్నామని తెలిపారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# జనాభా కాదు.. మౌలిక వసతులు ఆలోచించండి

దేశంలో ప్రస్తుతం ఉన్న జనాభాకే సరైన మౌలిక సదుపయాలు లేవు. విద్య,వైద్యం అందించే స్థితిలో ప్రభుత్వాలు లేవు. అలాగే నిత్యావసరాలు అందడం లేదు. ఉండడానికి ఇల్లు లేదు. దేశంలో అత్యధిక జనాభాకు కనీస గూడు కూడా కరువే. ఘనత వహించిన పాలకుల తీరు కారణంగా ప్రజలు నానా అగచాట్లు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా, వాటిని సకాలంలో సేకరించే యంత్రాంగం లేదు. ఉన్న జనాభాను పనులకు ఉపయోగించుకునే తెలివి లేకుండా పోయింది. ఇదంతా కూడా కేవలం వ్యవస్థాగత లోపంతో పాటు, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం, పరిపాలనానుభం లేకపోవడం ప్రధాన కారణంగా చూడాలి. ఇలాంటి సమయంలో ఈ మధ్య ఎపి సిఎం చంద్రబాబు పిల్లలను కనండి.. డబ్బులు పడేస్తాను అంటూ ప్రచారంతో ఊదరగొడుతున్నారు. తను ఒక్క కొడుకునే కన్నాడు. తన కొడుకు లోకేశ్ కూడా ఒక్క పిల్లాడిని కని మిన్నకున్నారు. చంద్రబాబు పిలుపు ఇంటికి పనికిరాదా అన్నది చెప్పాలి. కనీస మౌళిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు పనిచేస్తున్నారా అన్నది చెప్పాలి. ఇవేవీ కల్పించ కుండా పిల్లలను కని పడేసతే వారికి తిండి,బట్ట, చదువుసంధ్యా, వైద్యం ఎవరు అందిస్తారో చెప్పాలి. ఇందుకు గ్యారెంటీ ఇవ్వగలరా అన్నది చెప్పాలి. ఇప్పుడున్న పిల్లలకు ఈ రకమైన వసతులు కల్పించడానికి ఏం చేస్తున్నారో చంద్రబాబుతో సహా పాలకులంతా ప్రకటించాలి. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకుని వెళ్లే బదులు ఇలా తిరోగమనం వైపు తీసుకుని వెళ్లే యత్నంలో రాజకీయ కోణం తప్ప మరోటి లేదు. జనాభా నియంత్రణ లేకపోవడంతో దేశంపై ఎంతగా భారం పడుఉతందో చెప్పడం లేదు. ప్రజలు త్యాగాలు చేస్తుంటే... నాయకులు భోగాలు అనుభవిస్తున్నారు. కేవలం సీట్లు పెంచుకోవడం అన్న ధ్యాస తప్ప మరోటి లేదు. జనాభా పెరిగితే రేపటి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో కోత ఉండదన్న దురుద్దేశం ఇందులో దాగి ఉందనడంలో సందేహం లేదు. దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గిన కారణంగా నియోజక వర్గాల పునర్విభజన జరిగితే, నష్టపోతాం కనుక జనాభాను పెంచాల్సి ఉందని,అందుకు మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు నాయుడు సెలవిచ్చారు. ఎక్కడకు వెళ్లినా , కార్యక్రమం ఏదైనా జనాభా పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చబుతున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ మంది పిల్లలను కనే మహిళలకు, పిల్లలకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించారు. మూడవ సంతానానికి రూ.30 వేలు, నాల్గవ సంతానానికి రూ.40 వేలు నగదు సహాయం చేస్తామని, ఆర్థికాభివృద్ధి బాగుంటే మరింత ఎక్కువ ఇవ్వడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అసలు ఈ పిల్లలను కనడానికి కనీసం ఆస్పత్రి సౌకర్యాలు లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయి. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా రావడం లేదు. ఎవరి ప్రయోజనాల కోసం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలో చెప్పాలి. పిల్లను కనడం వల్ల వచ్చే సౌలభ్యం ఏమిటో చెప్పాలి. ఈ ప్రోత్సాహకాలు ప్రకటించడం ద్వారా గ్రామీణ మహిళల కుటుంబాల్లో డబ్బు కోసం ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయం చంద్రబాబు గ్రహించినట్లు లేదు.ప్రోత్సాహకాలు మాత్రమే మహిళలు ఆరోగ్యంగా, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి, పిల్లలు సురక్షితమైన వాతావరణంలో పెరగడానికి అవకాశాలు కల్పిస్తాయని భరోసా ఇవ్వగలరా అన్నది చెప్పాలి. కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రామికులను సరఫరా చేయడానికి, మహిళలను ఇంటికి పరిమితం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగ పడుతుంది. దేశ జనాభా ఇప్పటికే విపరీతంగా పెరిగింది. బాల్యం అంతా వెట్టిలో సాగుతోంది. జనాభా పెరుగుదల దేశంలో అసమానతలను పెంచింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అభద్రత, హింస, అత్యాచారాలు, అశాంతి పెరిగినట్లుగా అన్ని గణాంకాలు, నివేదికలు తెలియచేస్తున్నాయి. మహిళల విద్య, ఉపాధి, పౌష్టికతకు సంబంధించిన అంశాలలో వెనకబడుతున్నాం. ఇటువంటి దుర్భర పరిస్థితులలో ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని సూచించడం ద్వారా గ్రామీణ కుటుంబాల్లో భారం మోపడం తప్ప మరోటి కాదు. పిల్లను కనడానికి సరైన ఆస్పత్రులు లేవు. పెంచడానికి సరైన భద్రత లేదు. పెంచిన తరవాత చదివించేం దుకు సరైన పాఠశాలలు లేవు. వారిని సమర్థులైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అనువైన వాతావరణం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే మహిళలు పిల్లల్ని కనే క్రమంలో శారీరక, మానసిక మార్పులు, ఒత్తిళ్లకు లోనుకావాల్సి ఉంటుంది. వాటిని అధిగమించడానికి అవసరమైన వైద్యం ఎక్కువ శాతం మహిళలకు అందుబాటులో లేదు. మరీ ముఖ్యంగా గ్రామీణ, గిరిజన మహిళలకు ఇలాంటి సమస్య ఎక్కువ. డోలీ లేకుండా గర్భిణిని తరలించే సౌకర్యం కల్పించని పాలకులు ఇఇ గుర్తుకు రావడం లేదు. సమాజంలో మార్పులు వస్తున్నా, ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగినా ఇంకా మహిళలలు అణచివేతకు గురవుతున్నారు. 21 ఏళు నిండినప్పటి నుంచి మహిళల మీదపెళ్లి ఒత్తడి పెరుగుతంది. పెళ్లి అయితే పిల్లలను కనమని ఒత్తిడి కుటుంబ సభ్యుల నుంచి ఉంటుంది. ఇక ప్రోత్సాహకాలు ఇస్తున్నారంటే ఆ ఒత్తిడి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే చాలా మంది మహిళలు కెరీర్, కుటుంబం రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడంలో అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారు. వెనకటికి లాగా ఉమ్మడి కుటుంబాలు లేవు. నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు అందరికీ అందుబాటులో ప్రభుత్వ అజమాయిషీలో తీసుకుని రావడంపై ముందుగా పాలకలు దృష్టి సారించాలి. ఇస్తామన్న ప్రోత్సాహక డబ్బు ఇందుకోసం వెచ్చించాలి. అందరూ ఉపాధిని హక్కుగా పొందగలిగేలా పరిస్తితిని సృష్టించాలి. స్కూళ్లతో పాటు ఆటస్థలాలు, పార్కులు, సాంస్కృతిక వికాసం కోసం లైబ్రరీలు, పాటలు, డాన్సులు నేర్పే సంస్థలను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. అప్పుడు జనాభా నియంత్రణను ఎవ్వరు కూడా పాటించరు.

# బంగారానికి తగ్గుతున్న డిమాండ్


## మరోమారు స్వల్పంగా తగ్గిన ధరలు

**ముంబయి,మే31(ఆర్ఎన్ఎ):** దేశంలో బంగారానికి డిమాండ్ భారీగా పడిపోయింది. పసిడి విక్రయాలు 70 శాతం తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,640 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,44,500 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,18,230 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. శనివారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ. 600.. 22 క్యారెట్ల బంగారంపై రూ. 550 .. 18 క్యారెట్ల బంగారంపై రూ. 450 తగ్గింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,040 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,43,950 రూపాయల వద్ద.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,17,780 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# తెలుగు రాష్ట్రాల్లో తగ్గని ఎండల తీవ్రత

## ఎల్‌నినోతో ఆలస్యం కానున్న రుతుపవనాలు

హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో ఎండలకు తోడు, వడగాలులు కూడా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాదడపా కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నా, మొత్తంగా ఎండలు మాత్రం శాంతించడం లేదు. రుతుపవానలు కూడా ఆలస్యం అవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతోజూన్ 1 నుంచి అక్టోబర్ వరకు నైరుతి సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో భిన్నవాతావరణం కొనసాగుతున్నది. తెల్లవారుజామున, రాత్రివేళలో వర్షం కురుస్తుండగా.. మిగతా సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. 17 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం కొద్దిగా ఆశించినస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. వాతావరణంలో



నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొంటూ, పంటల ప్రణాళికలను రూపొందించుకోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించిన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు మధ్య తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలవనరుల పునరుద్ధరణకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించింది. సంవత్సరం వానకాలం ఎల్‌నినో ప్రభావంతో 2018 మాదిరిగానే ఉంటుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. 2025 సంవత్సరం మాదిరి వర్షాలను ఆశించవద్దని తెలంగాణ వెదర్‌మ్యాన్ సూచించారు. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు ఉంటాయని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. అయినప్పటికీ.. 2014-15లా సాధారణ వర్షపాతం 905.4 మి.మీ. కురువాల్సి ఉండగా కేవలం 562.1 మి.మీ. కురిసినంత తీవ్రంగా ఉండకపోవచ్చని తెలిపారు. గత 5-6 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రుతుపవన వర్షాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల లోటు తీవ్రంగా ఉంటుందని, మధ్య తెలంగాణలో మంచి వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ ఏడాది రెండో వారంలో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ఆరంభం ఉంటుందని చెప్పారు.

# ఐపిఎల్‌లో అరుదైన ఘనత

## వరుసగా రెండుసార్లు హిట్ వికెట్‌గా సాయిసుదర్శన్




**చండీఘడ్,మే31(ఆర్ఎన్ఎ):** ఐపీఎల్-2026 సీజన్‌లో రెండుసార్లు సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. వరుస రెండు మ్యాచుల్లో ఇది జరిగింది. బెంగుళూరు, గుజరాత్‌లతో జరిగిన మ్యచ్‌లలో సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. ఇకపోతే క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ మరోసారి సత్తాచాటింది. రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని 3 వికెట్లు కోల్పోయి ఛేదించి, బెంగళూరుతో తుదిపోరుకు అర్హత సాధించింది. అయితే.. ఈ మ్యాచ్‌లో జీటీ ఓపెనర్ సాయి సుదర్శన్ ఔటైన తీరే చర్చనీయాంశమవుతోంది. బ్రిజేష్ శర్మ బౌలింగ్‌లో థర్డ్‌మ్యాన్ వైపు బౌండరీ కొట్టిన అనంతరం అతడి చేతిలోని బ్యాట్ జారి నేరుగా వికెట్లను తాకడంతో హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు క్వాలిఫయర్-1లో జరిగిన మ్యాచ్‌లోనూ ఆర్సీబీపై ఇదే తరహాలో ఔటయ్యాడు. దీంతో ఐపీఎల్‌లో వరుసగా 2 ఇన్నింగ్స్‌ల్లో హిట్ వికెట్‌గా వెనుదిరిగిన తొలి బ్యాటర్‌గా కోరుకుని రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు సాయి సుదర్శన్. మ్యాచ్ అనంతరం తాను ఔటైన తీరుపై సాయి సుదర్శన్‌కు ఓ ప్రశ్నకు అతడు సరదాగా స్పందించాడు. 'ఇకపై బ్యాట్ చేతికి అతుక్కుని ఉండేలా గ్రిప్ టెక్నిక్‌లు ఏవైనా ఉన్నాయేమో ప్రయత్నించాలి' అని నవ్వుతూ సమాధానమిచ్చాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన సాయి సుదర్శన్.. తొలి వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్ చరిత్రలో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధికం. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మైక్ హస్సీ, మురళీ విజయ్ 159 పరుగులు జోడించగా.. ఆ రికార్డును వీరు అధిగమించారు. అంతేకాకుండా గిల్-సుదర్శన్ జోడీ మరో ఘనతనూ సొంతం చేసుకుంది. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధికంగా 100కు పైగా భాగస్వామ్యాలు నెలకొల్పిన జోడీగా అవతరించింది. వీరిరువురూ 11 సెంచరీ భాగస్వామ్యాలతో.. క్రిస్ గేల్-కోహ్లీ, బాబర్ ఆజమ్-మహ్మద్ రిజ్వాన్, డివిలియర్స్-కోహ్లీ జోడీలను వెనక్కి నెట్టారు. క మ్యాచ్ విషయానికొస్తే.. 215 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గిల్(53 బంతుల్లో 104) అద్భుత శతకంతో మెరిశాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులతో చెలరేగాడు. వీరి దూకుడుకు రాజస్థాన్ బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు. జీటీ చరిత్రలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం విశేషం. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్ఆర్ 20 ఓవర్లలో 214/6 పరుగులు చేసింది. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 47 బంతుల్లో 96 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆకట్టుకోగా.. రవీంద్ర జడేజా 45 పరుగులతో రాణించాడు.

# కాళేశ్వరంను పడావు పెట్టడం సరికాదు

## . ప్రాజెక్టుకు మరమ్మత్తులపై ఎందుకీ తాత్సారం...ప్రభుత్వం తీరుపై బండరు దత్తాత్రేయ విమర్శలు

**పెద్దపల్లి,మే31(ఆర్ఎన్ఎ):** లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు, ప్రజలకు పనికి రాకుండా పోయిందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ విమర్శించారు. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే స్పష్టమైన నివేదిక ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దత్తాత్రేయ తెలిపారు.

# సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

## కేసు పెట్టి అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ):** బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్‌ను నాంపల్లి కోర్టుకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు. క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. దానినే ప్రశ్నించా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు. బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆనంద్ అనే వ్యక్తి బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 'సింగరేణిని తగలపెట్టండి. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. ఆఫీస్‌లను తగలబెడదాం. నెల రోజులు జైలుకు పోయి వస్తాము' అని బాల్క సుమన్ కామెంట్లు చేసినట్లు ఆనంద్ తెలిపాడు.

# బాల్క సుమన్ వ్యాఖ్యలు దుర్మార్గం

## అందుదే అరెస్ట్ చేసిన పోలీసులు

## బల్క వెనక కెసిఆర్ కుట్ర దాగివుంది

## మీడియాతో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

**హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ):** బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి కారణం ఆయన మాటలేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గాంధీభవన్ లో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతూ... బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి ఆయన మాటలే కారణం. సుమన్ వ్యాఖ్యల వెనక కేసీఆర్ కుట్ర ఉంది. మీకు కోపం ఉంటే మాపై దాడి చేయండి. సామాన్య ప్రజలు తిరిగే రైళ్లపై మీకు ఎందుకు అంత అక్కసు. రైళ్లలో తిరిగేది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలే. మీకు ఓట్లేయలేదని పెదలపై కోపమా?. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేనూ నిరసన కార్యక్రమాలు చేశాను. మేం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేశాము' అని వెంకట్ అన్నారు.బీఆర్ఎస్ పార్టీ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. ఆయన మాటలకు కౌంటర్ గా ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ స్పందించారు. కేసీఆర్ ఒకయానికి డ్రగ్ శాఖ ఇచ్చాడు. మరొకరికి పిచ్చోడిలా వాగే శాఖ ఇచ్చాడు. సుమన్‌కి రైలు పట్టాలు కోసే శాఖ ఇచ్చాడు. బీఆర్ఎస్ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలని కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. సుమన్ లాంటి వ్యక్తులపై పీడీ యాక్ట్ పెట్టాలి' అంటూ బల్మూరి వెంకట్ ÷ర్ అయ్యారు.

# ఆందోళనకరంగా నకిలీ నోట్ల చలామణి

## ఆర్‌బిఐ నివేదికలో పలు అంశాలు వెల్లడి

**ముంబయి,మే31(ఆర్ఎన్ఎ):** దేశంలో నకిలీ నోట్ల అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దర్యాప్తు అధికారుల సోదాల్లో పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ పట్టుబడుతుండటమే ఇందుకు నిదర్శనం. బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు 2025-26లో 5.7 శాతం పెరిగిందని భారత రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. దీనికి ఆన్‌లైన లేదా కరెన్సీ రహిత ప్రవాహం పెరగాలని సూచిస్తున్నారు. నోట్ల రద్దు చేసినా నకిలీ నోట్ల ముద్రణ ఆగడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ముఖ విలువ రూ.200, రూ.500 ఉన్న నోట్లే ఇందులో ఎక్కువగా వుంటున్నాయని తెలిపింది. 2025-26లో మొత్తంగా నకిలీ నోట్ల సంఖ్య 2,29,746కి పెరిగిందని, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 2,17,396గా వుందని ఆర్ బి ఐ తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2024-25లో నకిలీ రూ.500 నోట్లు 20.5 శాతం పెరిగాయి. అంతకుముందు 1,17,722 గుర్తించగా, తర్వాత ఆ సంఖ్య 1,41,907కి చేరింది. అలాగే రూ.20 ముఖ విలువ ఉండే నోట్లు నకిలీ చలామణి కూడా బాగా పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. ఏడాది క్రితం




253 నోట్లు బయటపడగా అవి 47.4శాతం పెరిగి 373కి చేరాయి. ÷ఔ.200 నకిలీ నోట్ల సంఖ్య తగ్గింది. 2024-25లో 32,600 వుండగా, 2025-26లో 30,591కి పడిపోయింది. అలాగే వంద నోట్ల నకిలీ కూడా తగ్గింది. 51,069 నుండి 45,621కి పడిపోయింది. రూ.50నోట్లు నకిలీ కూడా 12,015 నుండి 10,274కి తగ్గింది. ÷ఔ.2 వేల నోట్లు చలామణి నుండి ఉపసంహరించడంతో వాటి నకిలీ దాదాపు పడిపోయిందని చెప్పవచ్చు. అంతకుముందు ఏడాదిలో 3508 బయటపడగా, 2025-26లో ఈ సంఖ్య 824కి తగ్గిపోయింది. ఆర్ బి ఐలో 2.4శాతం అంటే 5,412 నకిలీ నోట్లు కనుగొనగా ఇతర బ్యాంకుల్లో మొత్తంగా 97.6శాతం అంటే 2,24,334 నోట్లు కనుగొన్నారని నివేదిక పేర్కొంది. ఇంకా పోలీసులు, ఇతర ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నవి ఇందులో కలపలేదని తెలిపింది. పాడైపోయిన నోట్లను తీసివేయడం బాగా తగ్గిందని నివేదిక పేర్కొంది. 2025-26లో ఈ సంఖ్య 1.72లక్షల నోట్లుగా వుండగా అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 2.38 లక్షలుగా వుంది.

# మజ్జిగని భగవంతుడు సృష్టించాడట!





వేసవి కాలాన్ని మనం మజ్జిగతోనే ఎక్కువగా గడిపేందుకు ప్రయత్నించాలి. తోడుపెట్టినందు వలన పాలలో ఉండే పోషక విలువలన్నీ మజ్జిగలోనూ పదిలంగా ఉండటంతో పాటు, అదనంగా "లాక్టో బాసిల్లై" అనే "మంచి బాక్టీరియా" కూడా దొరుకుతుంది. పాలలో ఈ ఉపయోగకారక బాక్టీరియా ఉండదు. అందుకని, వయసు పెరుగుతున్నకొద్దీ మజ్జిగ అవసరం పెరుగుతుంది. ఫ్రిజ్జులో పెడితే మజ్జిగలోని ఈ బాక్టీరియా నిర్వీర్యం అవుతుంది. అందుకని అతి చల్లని మజ్జిగ తాగకూడదు. చిలికినందువలన మజ్జిగకు తేలికగా అరిగే గుణం వస్తుంది. అందుకని పెరుగుకన్నా మజ్జిగ మంచిది.

**వేసవి కోసం ప్రత్యేకం "కూర్చిక పానీయం":**
ఒక గ్లాసు పాలు తీసుకొని, కాచి చల్లార్చి అందులో రెండుగ్లాసుల పుల్లని మజ్జిగ కలపండి. ఈ పానీయాన్ని 'కూర్చిక' అంటారు. ఇందులో "పంచదార" గానీ, "ఉప్పు" గానీ కలపకుండానే తాగవచ్చు. "ధనియాలు", "జీలకర్ర", "శొంఠి" ఈ మూడింటినీ 100 గ్రాముల చొప్పున దేనికదే మెత్తగా దంచి, మూడింటినీ కలిపి తగినంత "ఉప్పు" కూడా చేర్చి, దాన్ని ఒక సీసాలో భద్రపరచుకోండి. "కూర్చిక"ను తాగవలసినప్పుడల్లా, అందులో దీన్ని ఒక చెంచా మోతాదులో కలిపి తాగండి. వడదెబ్బ కొట్టదు. పేగులకు బలాన్నిస్తుంది. జీర్ణకోశ వ్యాధులన్నింటికీ ఇది మేలు చేస్తుంది. వేసవిలో కలిగే జలుబుని నివారిస్తుంది.

**వడదెబ్బ కొట్టని పానీయం "రసాల":**
పెరుగు మీద తేరుకున్న నీళ్ళు, పాలు కలగలిపి ఆరోగ్యకరమైన "రసాల" అనే పానీయాన్ని "భీముడు" తయారు చేశాడని "భావప్రకాశ" వైద్య గ్రంథంలో ఉంది. అరణ్యవాసంలో ఉన్నప్పుడు, పాండవుల దగ్గరకు శ్రీ కృష్ణుడు వస్తే, భీముడు స్వయంగా దీన్ని తయారు చేసి వడ్డించాడట! ఇది దప్పికని పోగొట్టి వడదెబ్బ తగలకుండా చేస్తుంది కాబట్టి, ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వారికి ఇది పానీయం. తన ఆశ్రమాన్ని సందర్శించటానికి శ్రీరాముడు వచ్చినప్పుడు భరద్వాజ మహర్షి రాముని గౌరవార్థం ఇచ్చిన విందులో రసాల కూడా ఉంది. భావ ప్రకాశ వైద్య గ్రంథంలో దీన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరంగా ఇచ్చారు:

1. బాగా కడిగిన ఒక చిన్న కుండ లేదా ముంత తీసుకోండి. దాని మూతిని మూస్తూ ఒక పలుచని వస్త్రాన్ని రెండుమూడు పొరల మీద వాసెన (ఆవిరిపోక యేసటికుండ మూతిమూసి కట్టిన గుడ్డ) కట్టండి. ఒక కప్పు పలుచని పెరుగులో అరకప్పు "పంచదార" కలిపి, ఈ మిశ్రమాన్ని "చల్లకవ్వం"తో బాగా చిలికి ఆ వాసెన మీద పోసి వడకట్టండి.
2. పెరుగులో పంచదార కరిగి నీరై ఆ వస్త్రంలోంచి క్రింది ముంతలోకి దిగిపోతాయి. వాసెనమీద పొడిగా పెరుగు ముద్ద మిగిలి ఉంటుంది. దాన్ని అన్నంలో పెరుగు లాగా అవాడుకోండి. ఈ రసాల కు దానితో పని లేదు. ముంతలో మిగిలిన తియ్యని పెరుగు నీటిని 'ద్రప్యం' అంటారు. ఈ 'ద్రప్యం' నిండా లాక్టోబాసిల్లస్ అనే ఉపకారక సూక్ష్మజీవులు ఉంటాయి. అవి పేగుల్ని సంరక్షించి జీర్ణాశయాన్ని బలసంపన్నం చేస్తాయి. ఆ నీటితోనే రసాలను తయారు చేస్తారు 3. ఇప్పుడు, కాచి చల్లార్చిన పాలు ఈ ద్రప్యానికి రెట్టింపు కొలతలో తీసుకొని ముంతలోని పెరుగు నీళ్ళతో కలపండి. చల్లకవ్వంతో ఈ మిశ్రమాన్ని చక్కగా చిలికి, అందులో "ఏలకుల" పొడి, "లవంగాల" పొడి, కొద్దిగా "పచ్చకర్పూరం", "మిరియాల" పొడి కలపండి. ఈ కమ్మని పానీయమే రసాల! చదివిన అప్పటికప్పుడు తాగేలాగా తయారు చేసుకోవాలి.
4. ఈ వడకట్టే ప్రక్రియకు బదులుగా, పెరుగు లేదా మజ్జిగ మీద తేరుకున్న తేటని తీసుకొని, సమానంగా పాలు కలిపి చిలికి తయారు చేసుకోవచ్చు కూడా! "శొంఠి", "మిరియాలు", "ధనియాలు", "జీలకర్ర", "లవంగాలు", చాలా స్వల్పంగా "పచ్చకర్పూరం" వీటన్నింటిని మెత్తగా దంచిన పొడిని కొద్దిగా ఈ "రసాల"లో కలుపుకొని త్రాగితే ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది.
5. మజ్జిగ మీద తేటలో కేవలం ఉపయోగకారక సూక్ష్మజీవులు లాక్టోబాసిల్లై మాత్రమే ఉంటాయి. ఈ సూక్ష్మజీవుల కారణంగానే పాలకన్నా పెరుగు, పెరుగు కన్నా చిలికిన మజ్జిగ ఎక్కువ ఆరోగ్య దాయకమైనవిగా ఉంటాయి. మజ్జిగలోని లాక్టోబాసిల్లై ని తెచ్చి పాలలో కలిపి, చిలికి ఈ రసాల ప్రయోగాన్ని మన పూర్వీకులు చేశారన్నమాట.

ఇది "అమీబియాసిస్" వ్యాధి, "పేగుపూత", "రక్త విరేచనాలు", "కలరా" వ్యాధులు ఉన్నవారిక్కూడా ఇవ్వదగిన పానీయం. వేసవి కాలానికి అనుకూలంగా ఉంటుంది. వడ దెబ్బ తగలనీయదు. శరీరంలో వేడిని తగ్గిస్తుంది. తక్షణం శక్తినిస్తుంది. "కామెర్ల" వ్యాధిలో ఎక్కువ మేలు చేస్తుంది. పెరుగు మీద తేట, వైద్యపరంగా, చెవులు బలసంపన్నం చేస్తుందని "ఆయుర్వేద శాస్త్రం" చెప్తోంది. "చెవిలో హోరు(టినిటస్)", చెవులలో తేడాల వలన కలిగే తలతిరుగుడు "వెర్టిగో" లాంటి వ్యాధులకు ఇది గొప్ప ఔషధం గా పని చేస్తుందన్నమాట.

**వేసవి కోసం "తేమనం" అనే పానీయం:**
తేమనం అనేది శ్రీనాథుడి కాలం వరకూ ప్రసిద్ధి చెందిన వంటకమే! దీన్ని "తీపి"గానూ, "కారం"గానూ రెండు రకాలుగా తయారు చేసుకొంటారు. "మజ్జిగ"లో "పాలు", "బెల్లం" తగినంత చేర్చి, ఒక పొంగు వచ్చే వరకూ కాస్తే "తేమనం" అనే తెలుగు పానీయం తయారౌతుంది. ఇది వేసవి పానీయాలలో మేలయిన పానీయం. వడదెబ్బ వలన కలిగే శోషని నివారిస్తుంది. శరీరానికి తక్షణ శక్తినిస్తుంది. చల్లారిన తరువాత త్రాగటం మంచిది. దీన్ని "తీపి మజ్జిగ పులుసు" అనవచ్చు. ఇంక "కారం" మజ్జిగపులుసు గురించి మనకు తెలిసినదే! పులవని "చిక్కని మజ్జిగ" తీసుకోండి. వెన్న తీసిన మజ్జిగ అయితే మరింత రుచికరంగా ఉంటాయి. ఈ మజ్జిగలో "అల్లం", "మిర్చి", "కొత్తిమీర", ఇతర సంబారాలు (ఆహారపదార్థములలో అవసరము నుబట్టి రుచిని, పరిమళమును, ఆహారయోగ్యతను ఎక్కువ చేయుటకు చేర్చబడుచుండు వస్తువులు [Spices and condiments] వేసి కాచిన మజ్జిగ పులుసు బాగా చలవ చేస్తుంది. మజ్జిగ పులుసు వేసవి కోసం తరచూ వండుకొవాల్సిన వంటకం అని గుర్తించండి!

ఉత్తర రామ చరితంలో "గారెలు బూరెలు చారులు మోరెలు" అనే ప్రయోగాన్ని బట్టి, ఈ మజ్జిగ పులుసుని 'మోరు' అని పిలిచేవారని తెలుస్తోంది. "బియ్యప్పిండి", "అల్లం" తదితర సంబారాలు చేర్చి ఉండలు కట్టి మజ్జిగ పులుసులో వేసి వండుతారు. ఈ ఉండల్ని 'మోరుండలు' అంటారు. వీటిని ఆవడ(పెరుగువడ)లాగా తినవచ్చు. పర్షియన్లు ఇష్టంగా వండుకొనే Cacik అనే మజ్జిగ పులుసులో వెల్లుల్లి మషాలా బాగా కలిపి, రొట్టెల్లో నంజుకొంటారు కూడా!

**మెంతి మజ్జిగ :** మెంతులు తేలికగా నూరి చిక్కని పులవని మజ్జిగలో కలిపి, తాలింపు పెడితే, దాన్ని "మెంతి మజ్జిగ" అంటారు. "మజ్జిగ చారు" అని కూడ పిలుస్తారు. తెలుగిళ్ళలో ఇది ప్రసిద్ధ వంటకం. దీన్ని అన్నంలో ఆధరవుగానూ తినవచ్చు లేదా విడిగా తాగావచ్చు కూడా! మామూలు మజ్జిగకన్నా అనునిత్యం మజ్జిగచారునే వాడుకోవటం ఎప్పటికీ మంచిది. చముఖ్యంగా షుగర్ వ్యాధి ఉన్నవారికీ, వచ్చే అవకాశం ఉన్నవారికి ఇది మంచి చేస్తుంది.

**తీపి లస్సీ :** మజ్జిగలో "పంచదార" లేదా "తేనె" కలిపిన పానీయమే లస్సీ! హిందీ లేదా పంజాబి పదం కావచ్చు. వేసవికాలంలో "నిమ్మరస"ం, "జీలకర్ర" పొడి, "ఉప్పు", "పంచదార" కలిపి "పుదీనా ఆకులు" వేసిన లస్సీ చవడ దెబ్బ తగలకుండా కాపాడుతుందిచ. తెలుగులో దీన్ని 'సిగరి' అంటారు. శిఖరిణి అనే సంస్కృత పదానికి ఇది తెలుగు రూపం కావచ్చు. చిక్కని మజ్జిగ అయితే "లస్సీ" అనీ, వెన్న తీసేసి, నీళ్ళు ఎక్కువ కలిపితే ""చాస్"" అనీ పిలుస్తారు. టర్కీలో Ayran, ఆర్మీనియాలో Than, పర్షియాలో Doogh, ఆల్బేనియాలో Dhalle అనే పానీయాలు ఇలాంటివే! గుర్రం పాలతో kumiss అనే పానీయాన్ని మధ్య ఆసియా స్టెప్పీలు ఇష్టంగా తాగుతారట! పర్షియన్ Cacik అనేది మన మజ్జిగ పులుసు లాంటిదే!

**మజ్జిగమీద తేట :** మజ్జిగమీద తేటకు మజ్జిగతో సమానమైన గుణాలున్నాయి. చిలికిన మజ్జిగని ఒక గిన్నెలో సగానికి పోసి మూడొంతుల వరకూ నీళ్ళు కలిపి రెండు గంటలు కదల్చకుండా ఉంచండి. మజ్జిగమీద ఆ నీరు తేరుకొంటుంది. మజ్జిగ తేటను వంచుకొని మళ్ళీ నీళ్ళు పోయండి. ఇలా ప్రతి రెండు మూడు గంటలకొకసారి మజ్జిగనీళ్ళు వంచుకొని వేసవి కాలం అంతా మంచి నీళ్ళకు బదులుగా ఈ మజ్జిగ నీళ్ళు తాగుతూ ఉండండి వడదెబ్బ కొట్టదుగాక కొట్టదు. మజ్జిగ వాడకం మనకున్నంతగా ఉత్తరాది వారికి లేదు. మధురానగరిలో తెలుగు కృష్ణుడు చల్లలమ్మబోయే అమ్మాయిల దారికి అడ్డం పడ్డాడు గానీ, పెరుగులమ్మబోయే వారికి కాదు గదా!

# మీ మెడ, వెన్నునొప్పి మిమ్మల్ని చంపేస్తున్నాయా?

## ఈ వ్యాయామాలను ప్రయత్నించండి



ఇంటి నుండి పనిచేసేటప్పుడు ఆఫీసులో ఉన్నంత కంఫర్ట్ గా ఉండదు. మీ మెడలో మరియు వెన్నెముక వెనుక భాగంలో అక్షరాలా నొప్పిగా ఉంటుందని నిరూపించబడినది, ఎందుకంటే మీ కోసం అనువైన కార్యస్థలాన్ని కనుగొనలేకపోవచ్చు. మెడ మరియు వెనుక భాగంలో నొప్పిని తగ్గించడానికి ఈ వ్యాయా మాలను ప్రయత్నించండి.

మీ ల్యాప్‌టాప్ ముందు హంచ్ చేసిన ఈ కథనాన్ని చదువుతున్న వారిలో మీరు ఒకరు అయితే, మీ భంగిమను నిటారుగా ఉంచడానికి ఇక్కడ సున్నితమైన రిమైండర్ ఉంది. కొంతమందికి ఇంటి స్థలం నుండి ఎర్గోనామిక్ పని ఉండగా, మరికొందరు అందుబాటులో ఉన్న స్థలాన్ని ఉపయోగించుకుంటారు – పడకగది నుండి డైనింగ్ టేబుల్స్, మంచాలు మరియు కాఫీ టేబుల్స్ వరకు ఇలా అన్నింటిని ఆఫీస్ పనికోసం వాడేసుకుంటున్నారు. ఇంటి నుండి పని చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ – కొన్ని సందర్భాల్లో సౌకర్యవంతమైన గంటలు, అన్ని సందర్భాల్లో ట్రాఫిక్ ఉండదు, ప్రతిరోజూ పని కోసం దుస్తులు ధరించడం గురించి చింతించకండి మరియు వాటిలో సౌకర్యం చాలా ముఖ్యమైనది. కానీ ఇప్పుడు సౌకర్యం మీ మెడలో మరియు వెన్ను భాగంలో అక్షరాలా నొప్పిగా నిరూపించబడుతుంది, ఎందుకంటే మీరు ఖచ్చితమైన కుర్చీని కనుగొనలేకపోవచ్చు లేదా మీ కోసం అంకితమైన కార్యస్థలం కలిగి ఉండరు. స్ట్రెచ్చింగ్ వ్యాయామాలు ప్రతి ఒక్కరికీ సహేతుకంగా సురక్షితం అయినప్పటికీ అవి భారీ బరువులు లేదా ఓర్పు వ్యాయామాలను కలిగి ఉండవు. అయినప్పటికీ, మీ పరిమితులను తెలుసుకోవడం మంచిది మరియు స్ట్రెచ్చింగ్ తో సహా ఎలాంటి వ్యాయామం చేయకూడదని గుర్తుంచుకోండి. మెడ మీద గట్టిగా ఉబ్బడం, గొంతు వెనుక లేదా మణికట్టు నొప్పి నివారించడానికి, ఈ సాధారణ వ్యాయామాలను ప్రయత్నించండి:

**నెక్ రోల్**

మీ కంప్యూటర్ / ల్యాప్‌టాప్ సరిగా ఉంచకపోతే, అది మెడలో అక్షరాలా నొప్పిగా కలిగిస్తుంది. ఇది దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తుంది మరియు మెడ మాత్రమే కాదు– తలనొప్పి కూడా. పిసి సరైన స్థితిలో ఉంచబడిందని నిర్ధారించుకోవడమే కాకుండా, మీ మెడను ప్రతిసారీ కదిలించి, అది సరళంగా ఉండేలా చూసుకోవాలి.

మీ తలను మీకు సాధ్యమైనంతవరకు ముందుకు సాగండి (హాయిగా) మరియు మీ తల కొనతో ప్రారంభ స్థానానికి తిరిగి వచ్చే ముందు పూర్తి వృత్తం చేయండి. ప్రతిసారీ 3–5 సర్కిల్‌లు చేయండి. మీరు మీ మంచం మీద లేదా మీ బెడ్ మీద పనిచేస్తుంటే, మీరు మందగించే అవకాశం ఉంది, ఇది తీవ్రమైన వెన్నునొప్పికి దారితీస్తుంది. మీరు కూర్చున్న విధానం గురించి జాగ్రత్తగా ఉండటం వల్ల ఎగువ వెన్నునొప్పిని త్వరగా తగ్గించవచ్చు. మీ భుజాలను పైకి ఎత్తండి – మీరు ఎవరికైనా హగ్ ఇస్తున్నట్లు. ఇప్పుడు, నెమ్మదిగా మీ భుజాలను వెనుకకు మరియు చుట్టూ తిప్పండి, వాటిని ప్రతి దిశలో గరిష్ట స్థానానికి నెట్టండి. 3–5 సర్కిల్‌లు చేయండి, ఆపై దిశను మార్చండి మరియు 3–5 సార్లు భుజాలను ముందుకు తిప్పండి.

# పట్టణ పేదలకు పెద్దన్నరేవంత్ రెడ్డి కానుక

**తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం**
**ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక**
**పేదవాని గుమ్మం వద్దకు ప్రజా ప్రభుత్వ పథకాలు**
**ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన**
**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ):** పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. శనివారం నాడు బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 30–40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ – గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ అనీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# హైబ్రిడ్ విధానంలో మహానాడు విజయవంతం

**కృషి చేసిన నేతలను అభినందించిన చంద్రబాబు**

**అమరావతి,మే31(ఆర్ఎన్ఎ):** తొలిసారిగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు ఘనవిజయం సాధించిందని టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. మహానాడును సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయంపై టీడీపీ జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడు కార్యక్రమం నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే.. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు. టీడీపీ పుట్టిందే తెలంగాణ గడ్డపై, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33శాతం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని అన్నారు.

# గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులకు ఊరట

**నిబంధనలపై అమెరికా యూటర్న్**

**వాషింగ్టన్,మే31(ఆర్ఎన్ఎ):** శాశ్వత నివాస హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా తమ స్వదేశాలకు తిరిగి వెళ్లాలని ఇటీవల ప్రకటించిన అమెరికా ప్రభుత్వం తాజాగా వెనక్కి తగ్గింది. ఆ నిబంధన అందరికీ వర్తించదని, దరఖాస్తును బట్టి ఇమిగ్రేషన్ అధికారులు నిర్ణయం తీసుకుంటారని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తాజాగా ప్రకటించింది. తాత్కాలిక వీసాలపై ఉన్నవారు గ్రీన్ కార్డ్ పొందాలంటే తమ స్వదేశంలోనే దరఖాస్తు చేసుకోవాలని గత వారం అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ప్రకటనతో హెచ్1బీ వీసాదారులు, విదేశీ విద్యార్థులు, తాత్కాలిక ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనిపై తాజాగా డీహెచ్ఎస్ వివరణ ఇచ్చింది. ఈ నిబంధన ఎప్పట్నుంచో ఉందని, ఇమిగ్రేషన్ అధికారులకు తమ విచక్షణాధికారాన్ని గుర్తు చేయడానికే గత వారం తాము మార్గదర్శకాలు విడుదల చేశామని తెలిపింది. రఖాస్తుదారుడి పరిస్థితులు, ఆర్థిక ప్రయోజనాలు,

# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

**జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం... కేశవరావు కమిటీ తొలి భేటీ**




**హైదరాబాద్,మే31(ఆర్ఎన్ఎ):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జివో .679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ ఛైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరపున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు సమావేశం




**ఆదిలాబాద్ మే 31 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన'కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు,బిఎల్ ఏ -2 ల సమావేశానికి'ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెద్దపల్లి ఎంపీ, అదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి గడ్డం వంశీ కృష్ణ కి ఖానాపూర్ ఎమ్మెల్యే ,నిర్మల్ డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ తో కలిసి,ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి శాలువాతో ఘన స్వాగతం పలికారు.అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్యకర్తలకు దిశనిర్దేశం చేసారు.అనంతరం బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్,టీపిసిసి ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు ని సన్మానించడం జరిగింది.ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య ,మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ ,ఆదిలాబాద్,బోథ్ నియోజకవర్ గఇంచార్జ్ లు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్,మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్,మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్ర సుజాత,మాజీ ఎంపీ సోయం బాపురావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి,మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి,మార్కెట్ చైర్మన్ లు,ఇతర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కౌన్సిలర్ లు, మండల అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్, పార్కింగ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి..




**కొమురం ఆసిఫాబాద్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి) ::** సోమవారం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ పరిసర ప్రాంతంలో ట్రాఫిక్ మరియు పార్కింగ్ ప్రాంతాల నిబంధనలు ప్రజలు తప్పకుండా పాటించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల నుండి వచ్చేవారు ఇందిరానగర్ దాటిన తర్వాత ఎడమవైపున (పబ్లిక్ మీటింగ్ కి ముందు ) పార్కింగ్ స్థలం ఉంటుంది ఆసిఫాబాద్ నుండి వచ్చేవారికి కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద సర్వీస్ రోడ్డుకు ఎడమ వైపున (కాగజ్ నగర్ కాటన్ మిల్లుకు ముందు భాగం లో ) వాహనాల పార్కింగ్ స్థలం ఉంటుంది. కాగజ్నగర్ నుండి వచ్చే వారికి ఎడమవైపున ఉన్న కన్యకా కాటన్ మిల్లుకు ముందు భాగంలో పార్కింగ్ స్థలం ఉంటుంది. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి "కాగజనగర్ x రోడ్" వద్ద సర్వీస్ రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ అమలులో ఉంటుంది. సర్వీస్ రోడ్డుపైన భారీ వాహనాలకు అనుమతించబడదు. కాగజ్నగర్ వైపు నుండి ఎక్స్ రోడ్ వైపు వచ్చే వాహనాలకు, కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ నుండి కాగజ్నగర్ వైపు వెళ్లే భారీ వాహనాలకు ముఖ్యమంత్రి మీటింగ్ ముగిసే వరకు అనుమతి లేదు.అన్ని ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఎవరికి కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లో వారు వాహనాలను నిలపాలి. పశువులను రోడ్లపైకి అనుమతించవద్దు. సీఎం పర్యటన ముగిసేంతవరకు రోడ్లపై ఎటువంటి వాహనాలు నిలపరాదు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి కెరమెరి నుండి ఆసిఫాబాద్ వైపు, అలాగే ఆసిఫాబాద్ నుండి కెరమెరి వైపు భారీ వాహనాలను అనుమతించబడవు. ప్రజలందరూ పోలీస్ వారికి సహకరించి ట్రాఫిక్ ఆంక్షలు మరియు భద్రత సూచనలను పాటించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు..


# కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీ,ఎమ్మెల్యే



**ఆదిలాబాద్ మే 31 (నేటి మన దేశంమ్ ప్రతినిధి.** కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ-2 సమావేశానికి ఆదివారం ఆదిలాబాద్ పట్టణానికి విచ్చేసిన ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు.కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి ఘన స్వాగతం పలికారు..వారిని శాలువాలతో సత్కరించారు.అనంతరం తన కార్యాలయం అంతా తిప్పి చూపించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య ,బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్,ఆదిలాబాద్,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్లు బోరంచు శ్రీకాంత్ రెడ్డి,అల్లూరి అశోక్ రెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మసంతోష్ రావు,మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజీద్ ఖాన్,అడ్డి భోజారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# అహల్యాబాయి హోల్కర్ 301వ జయంతి ఉత్సవాలు కామారెడ్డిలో ఘనంగా నిర్వహణ

**మహిళా సాధికారత, సమరసతకు అహల్యాబాయి హోల్కర్ ఆదర్శం**
**ఆలయాల పునరుద్ధరణలో విశేష సేవలు**
**సమరసతా పాలనకు నిదర్శనం**
**హిందూ ఐక్యతకు కృషి చేసిన నాయకురాలు**
**సంస్కృతి పరిరక్షణలో తల్లుల పాత్ర కీలకం**



**కామారెడ్డి,మే 31.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** సామాజిక సమరసత వేదిక, కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో అహల్యాబాయి హోల్కర్ 301వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్పీఆర్లో నిర్వహించిన కార్యక్రమంలో అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.మహిళల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు

ఈ సందర్భంగా సామాజిక సమరసత వేదిక జిల్లా సహ సంయోజక్ సంగన్నగారి బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ, అహల్యాబాయి హోల్కర్ 301 సంవత్సరాల క్రితమే మహిళా సాధికారత కోసం ఆలోచించి, సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. తన పాలనలో సమాజంలో చెడు ఆచారాలకు స్థానం లేకుండా చట్టాలు అమలు చేశారని పేర్కొన్నారు.ఆలయాల పునరుద్ధరణలో విశేష సేవలు దేశంలోని కాశీ, అయోధ్య, సోమనాథ్ వంటి విదేశీ దురాక్రమణదారుల దాడులతో ధ్వంసమైన అనేక ఆలయాలను పునర్నిర్మించి, పునరుద్ధరించడంలో అహల్యాబాయి హోల్కర్ విశేష కృషి చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అనేక పుణ్యక్షేత్రాల్లో ఆమె నిర్మించిన ధర్మశాలలు నేటికీ దర్శనమిస్తున్నాయని అన్నారు.

**సమరసతా పాలనకు నిదర్శనం** కుటుంబంలో ఎన్నో వ్యక్తిగత విషాదాలు ఎదురైనా ఆత్మస్థైర్యం కోల్పోకుండా రాజ్యాన్ని సమర్థవంతంగా పాలించి ప్రజల మన్ననలు పొందారని బాలరాజ్ గౌడ్ పేర్కొన్నారు. ఆమె పాలనలో అన్ని వర్గాల ప్రజలు సమానత్వంతో, శాంతి సామరస్యాలతో జీవించారని, సమరసత భావనను స్థాపించిన గొప్ప నాయకురాలని కొనియాడారు.

**హిందూ ఐక్యతకు కృషి చేసిన నాయకురాలు** జిల్లా కార్యదర్శి జంగం ప్రశాంత్ మాట్లాడుతూ, రైతులు, చేనేత కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందిన పాలకురాలిగా అహల్యాబాయి హోల్కర్ నిలిచారని అన్నారు. కులాలకు అతీతంగా హిందూ ఐక్యతను బలోపేతం చేయాలనే సంకల్పంతో పనిచేశారని పేర్కొన్నారు. ఆమె చరిత్రను సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరవేయడానికి సామాజిక సమరసత వేదిక వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.


**సంస్కృతి పరిరక్షణలో తల్లుల పాత్ర కీలకం** సామాజిక సమరసత వేదిక మహిళా కో-కన్వీనర్ వజీర్ సుష్మ మాట్లాడుతూ, ఎలాంటి పరిస్థితుల్లోనూ మన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో చదివించినప్పటికీ, మాతృభాష, సంప్రదాయాలు, సంస్కృతిని మరువకూడదని సూచించారు. పిల్లలకు మంచి విలువలు నేర్పించడంలో తల్లుల పాత్ర అత్యంత ముఖ్యమని, తల్లియే పిల్లలకు మొదటి గురువని అన్నారు.ప్రముఖుల పాల్గొనడంఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు అమృత రాజేందర్, విభాగ్ సహ సంయోజక్ బాలరాజ్ గౌడ్, మహిళా కో-కన్వీనర్ వజీర్ సుష్మ, కృష్ణమూర్తి, సంగి రాజేందర్, వజీర్ మారుతీరావు పాల్గొన్నారు.

# 29వ ద్వైవార్షిక మహాసభలను విజయవంతం చేయాలి..



**పెద్దపల్లి మే 31 (నేటి మనదేశమ్):** సంస్థ అభ్యున్నతికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ నెల 6న భూపాలపల్లిలో జరుగు 29వ ద్వైవార్షిక మహాసభలను విజయవంతం చేయాలని ఏబీకేఎంఎస్ బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు మంద రమాకాంత్ కోరారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ రామగుండం ఏరియా-×, జనరల్ బాడీ సమావేశం కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య నూతన కమిటీని సభ్యుల సమక్షంలో 2026-28 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించారు. రామగుండం ఏరియా వన్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి పరిశ్రమ పరిరక్షణ,కార్మిక హక్కుల సంరక్షణ కొరకు అహర్నిశలు కృషి చేయాలని, సింగరేణి కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా అలవెన్సులుపై ఆదాయ పన్ను రియంబర్స్ మెంటు చెల్లించాలని డిమాండ్ చేసినారు. సింగరేణి పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన విద్యుత్తు బొగ్గు బకాయిలు సుమారు రూ.51,149 వేల కోట్లు సింగరేణి సంస్థకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 12వ వేజ్ బోర్డు కొరకు ప్రత్యేకమైన కృషి బిఎంఎస్ చేస్తుందని తేది 30.06.2026 కాల పరిమితి ముగుస్తున్న నేపథ్యంలో తేది 01.07.2026 నుండి 12వ వేజ్ బోర్డు ప్రారంభం అవుతున్నందున కోల్ ఇండియా యాజమాన్యం కమిటీ నిర్మాణానికి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం నివారణకు నిర్మూలనకు కార్యాచరణ మహాసభలలో చేస్తామని తెలిపారు, సింగరేణి సంస్థలో నూతన బొగ్గు గనుల ప్రారంభ దిశకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సింగరేణి సంస్థలో గతంలో నడిచిన కార్పొరేట్ మెడికల్ బోర్డును యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏరియా ఉపాధ్యక్షులుగా:- కర్రావుల మహేష్, మోటార్ వెహికల్ డ్రైవర్, ఏరియా వర్క్ షాప్, ఏరియా కార్యదర్శిగా మేడ రామ్మూర్తి, మోటార్ వెహికల్ డ్రైవర్, ఎంటీసీపీ 5, జాయింట్ సెక్రటరిలుగా సంగాని సాంబయ్య, సపోర్ట్ మెన్, జీడికే 2ఏ, పెంచాల వెంకటస్వామి, అసిస్టెంట్ చైన్ మెన్, జీడికే 2 ఇంక్లైన్, ఆకుల కోటేష్, జనరల్ అసిస్టెంట్ 2 ఇంక్లైన్. అడ్ల వెంకట్ రెడ్డి, ఈ.పి ఫిట్టర్, ఎంటీసీపీ 5, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎల్లావుల కోటయ్య కోల్ కట్టర్, 2 ఇంక్లైన్. జనగామ తిరుపతి, జనరల్ అసిస్టెంట్, జీడికే 11 ఇంక్లైన్, బొజ్జ నాగరాజు జనరల్ అసిస్టెంట్, 11 ఇంక్లైన్. చెల్పూరి రాజశేఖర్, కోశాధికారిగా ఎలక్ట్రీషియన్, జి.డి.కే.1 ఇంక్లైన్ గంగిశెట్టి నరసింహులు, ఆఫీస్ సెక్రటరీగా (కార్యాలయ ప్రముఖ), సీనియర్ మైనింగ్ సర్దార్, జి.డి.కే.నెం.11 ఇంక్లైన్ మేడ అజయ్ కుమార్ నియమించారు.యతిపతి సారంగపాణి ప్రధాన కార్యదర్శి నిర్వహించిన, కర్రావుల మహేష్ ఏరియా ఉపాధ్యక్షులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆకుల హరిణ్, సెంట్రల్ ట్రెజరర్, సాయవేణి సతీష్, వడ్డేపల్లి కుమారస్వామి, పిట్ కార్యదర్శులు పల్లె శ్రీనివాస్ తాట్ల లక్ష్మయ్య, చెన్న సతీష్, వేల్పుల లక్ష్మణ్, తుమ్మ గట్టయ్య, నాగ అనిల్ సాగర్, పుప్పాల నాగేంద్రప్రసాద్, బోడకుంట రాజేశం, పల్లె రవి, ఆరెపల్లి వెంకటరాజం, జనగామ రాయలింగు, చిగురు లక్ష్మణ్, గౌడుగు సమ్మయ్య, వేల్పుల సతీష్, రామినేని సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి పాత్రికేయులు




**జగిత్యాల, మే 31(నేటి మన దేశమ్ ప్రతినిధి):**:ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి పాత్రికేయులని,నేటి సోషల్ మీడియా యుగంలో పాత్రికేయులు విలువలతో కూడిన జర్నలిజం చేయాలని,తప్పుడు ప్రచారం అరికట్టాలనిపాత్రికేయ మిత్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.ఆదివారంజగిత్యాల పట్టణంలోని స్థానిక విరూపాక్షి గార్డెన్లో నిర్వహించిన జగిత్యాల పట్టణ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్,బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బోగ శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రెస్ మిత్రుల కోసం ప్రెస్ క్లబ్ కార్యాలయం స్థలం,నిధులు మంజూరు చేసి ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.జగిత్యాల ప్రజలు ఒక కుటుంబం గా భావించి పనులు చేస్తున్నానని,పాత్రికేయులకు ఇళ్ల పట్టాల పంపిణీకి కృషి చేస్తానని....గత ప్రభుత్వంలో సైతం ఇళ్ల పట్టాలు,డబల్ బెడ్ రూం ఇండ్ల మంజూరు కు కృషి చేశానని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలలో పాత్రికేయులకు ప్రాధాన్యం ఇచ్చానని,విద్య ,ఆరోగ్య పరంగా నేను జగిత్యాల నియోజకవర్గ పరిధిలో పాత్రికేయులకు సహాయం చేయటానికి సిద్ధం ఉన్నానని హామీ ఇచ్చారు.ప్రెస్ క్లబ్ భవనానికి అదనపు అంతస్తుకు నిధులు మంజూరు చేస్తానని,గురుకులాల్లో పాత్రికేయుల పిల్లలకు ప్రాధాన్యం కల్పించే విదంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.ఆనంతరం భోగి శ్రావణీ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే మీడియా ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక వంటిదని అన్నారు. సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. ప్రజలకు నిష్పాక్షిక సమాచారాన్ని అందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా వేదికగా నిలుస్తోందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా.....

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత...

**ప్రకృతి తోనే పదిలం కాదంటే పతనం....**
**క్లీన్, గ్రీన్, ఎనర్జిటిక్ ఎన్విరాన్మెంట్ తోనే సుస్థిర ఆర్థిక అభివృద్ధి సాధ్యం....**
**పర్యావరణ పరిరక్షణ పై అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం జూన్ 5న "ప్రపంచ పర్యావరణ దినోత్సవం" నిర్వహించడం జరుగుతుంది.**


మిట్టపల్లి శ్రీనివాసరావు సీనియర్ జర్నలిస్ట్

**మే 31 (నేటి మనదేశమ్): నేపథ్యం - ఉద్దేశాలు :**1972లో సీడంలో జరిగిన స్టాక్ హోమ్ కాన్ఫరెన్స్ ఆన్ హ్యూమన్ ఎన్విరాన్మెంట్ చర్చ సమయంలో ఐక్యరాజ్యసమితి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం గా ప్రకటించింది. పర్యావరణం పై అవగాహన పెంచడం పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ హితం సుస్థిర అభివృద్ధి, యువతలో ప్రకృతి సంరక్షణ పట్ల బాధ్యత పెంచడం లాంటి ప్రధాన ఉద్దేశాలతో మొదటిసారిగా 1973లో "ఓన్లీ వన్ ఎర్త్ " అనే థీమ్ తో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించడం జరిగింది. 2026 సంవత్సరం "వాతావరణ చర్య " (క్లైమేట్ యాక్షన్) ప్రకృతితో మన సంబంధాన్ని బలపరుచుకోవడానికి, వాతావరణ మార్పులు ఎదుర్కొనే విధంగా "ప్రకృతి రక్షణకు అనుకూలంగా జీవన శైలిని ,వ్యవస్థలను మార్చాలనే" ఇతివృత్తంతో నిర్వహించడం జరుగుతుంది.

**పర్యావరణం- మానవ మనుగడ :**మన చుట్టూ ఉన్న పరిసరాలు అన్నింటిని కలిపి పర్యావరణం అంటాము. మనిషి పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం మరియు నివాసంతో పాటు ,సమస్త జీవకోటి మొక్కలు జంతువులు పక్షులు, క్రిములు కీటకాలు , సంరక్షణకు మనుగడకు, అభివృద్ధికి అవసరమైన జీవ, నిర్జీవ వనరులు, వాతావరణం సమస్తము పర్యావరణంలో అంతర్భాగాలు. జీవ వైవిధ్య జీవనాధారము, మనుగడకు, అభివృద్ధికి పర్యావరణ సమతుల్యం కీలకం. పర్యావరణం దెబ్బతింటే, మానవ మనుగడ ప్రమాదం లో ఉన్నట్టే.

**పర్యావరణం సవాళ్లు - ప్రభావం :**పర్యావరణం లోని అంశాలు అసమతౌల్య స్థితికి చేరడం పెద్ద సవాలు. ఆధునిక కాలంలో పెరుగుతున్న జనాభా, పారిశ్రామికీకరణ, యాంత్రీకృత జీవన విధానం, రసాయనక పదార్థాల వాడకం, వ్యర్థాలు పెరిగిపోవడం, అడవుల నరికివేత, చెట్లను నరికి వేసి, అవసరానికి మించి వెంచర్లు ఏర్పాటు చేయడం, వ్యసనంగా సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ వాడటం, 80% పైగా శిలాజ ఇంధన వినియోగంపై ఆధారపడటం, కాంక్రీట్ వినియోగం విపరీతంగా పెరిగిపోవడం తదితర కారణాల ప్రభావం వలన, ఫలితంగా.... గా లి, నీరు, భూసారం , వాతావరణం కలుషితమవుతున్నా యి. పక్కృతి వనరుల కాలుష్యం వినాశనం వలన అసమతౌల్య పరిస్థితులు ఏర్పడి, భూమి ఉష్ణోగ్రత వేడి పెరుగుతున్నది, వాతావరణం మార్పులు, ప్రకృతి విపత్తులు, ఆమ్ల వర్షాలు, అనావృష్టి అతివృష్టి కరువు, వరదలు, జీవ వైవిధ్యం తో పాటు ఆర్థిక నష్టం , గ్లోబల్ వార్మింగ్ , అనేక ఆరోగ్య సమస్యలు శ్వాసకోశ, దీర్ఘకాలిక, చర్మవ్యాధులు, కలరా, టైఫాయిడ్ ,డయేరియా, క్యాన్సర్ రోగాలు పెరుగుతున్నాయి. ప్రకృతి సౌందర్యం దెబ్బతినడంతో శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు పెరిగి మనుషులతో పాటు జీవకోటి మనుగడకే పెను ప్రమాదం, సవాలు గా మారుతున్నది.

**పర్యావరణ పరిరక్షణ - మనందరి బాధ్యత:**ప్రకృతితో కలిసి జీవిస్తే పదిలంగా ఉంటాము ,లేదంటే పతనం తప్పదు. భావితరాలకు "క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జిటిక్ ఎన్విరాన్మెంట " ను అందించాలంటే తక్షణమే జీవనశైలిని పర్యావరణహితంగా మార్చుకోవాలి.సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తి వినియోగాన్ని నిషేధించాలి. శుభకార్యాల సందర్భంలో ప్లాస్టిక్ కవర్లు ప్లేట్లు గ్లాసులు కప్పులు బాటిళ్లు వాడకుండా ప్రత్యామ్నాయలుగా కాగితం వస్త్రం యూత్ " ఆగ్రో బేస్డ్ ఉత్పత్తులు" వినియోగాన్ని ప్రోత్సహించాలి. పచ్చదనం పెంపుదలపై దృష్టి పెట్టి "ఇల్లు, గుడి, బడి , సంస్థ" ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాలలో నేటి విద్యార్థులు, యువతతో మొక్కలు నాటించడం, పెంచడం, సంరక్షణ బాధ్యతలను వ్యక్తిగతంగా సామాజికంగా ప్రభుత్వ సంస్థల స్థాయిలో జరగాలి. అడవుల నరికే వేయడం ఆపాలి. ఖాళీ ప్రదేశాలలో చెట్లను పెంచి "అటవీ కరణ " జరగాలి. పెట్రోలు డీజిల్ సహజవాయువు ప్రత్యామ్నాయాలుగా శిలాజితర పునరుత్పాదక ఇంధనం "హరిత నందనం " సౌర శక్తి, పవనశక్తి జల విద్యుత్, బయోమాస్ ఉత్పత్తి వినియోగాన్ని ప్రోత్సహించాలి. ఇందన వనరు లను పొదుపుగా వాడాలి. విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలి ఎల్ఈడి బల్బులు, ఎనర్జీ సేవింగ్ పరికరాలు వినియోగం పెరగాలి. పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ వినియోగం పెంచాలి. నడక ,సైకిలు వాడాలి. ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించాలి. "రెడ్యూస్, రియూస్ ,రీసైకిల్" పద్ధతిలో వ్యర్థాలను సమర్థంగా "వేస్ట్ టు వెల్త్ " నిర్వహణ చేయాలి. అనవసర అత్యధిక వినియోగాన్ని తగ్గించే విధంగా జీవనశైలి ఉండాలి. విద్యాసంస్థలలో బాల్యం నుండే పిల్లలకు పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, పుట్టినరోజు వేడుకల సందర్భంగా " ఈచ్ వన్ ప్లాంట్ వన్ " విధానం అలవర్చుకోవడం తో పాటు వనరులను పొదుపుగా వాడటం పట్ల అవగాహన పెంచాలి. వ్యక్తిగతంగా సమాజంగా ప్రభుత్వాల స్థాయిలలో మన పర్యావరణం పట్ల పరిరక్షణ మన బాధ్యతగా జీవనశైలిగా మార్చుకొని జీవించినప్పుడే భావితరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యమైన హరిత పర్యావరణం తో కూడిన సుస్థిరమైన అభివృద్ధిని అందించగలము.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ప్రజా ప్రతినిధులు...



**కొమురం ఆసిఫాబాద్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి)** :: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జిల్లాలో పర్యటన నేపథ్యంలో కాగజ్నగర్ ఎక్స్రోడ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణాన్ని ఆదివారం రోజునమంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్సీ దండే విట్టల్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జి శ్యాంనాయక్, గ్రంధాలయం చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వ ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి సభా వేదిక,,ప్రజలు కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను పరిశిలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కొఠారి గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్ ఏర్పాట్లను, ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయనున్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## ఇవి క్లిక్ అయితే... నారా హీరో ఫుల్ బిజీనే



ఏమాత్రం సినీ నేపథ్యం లేని నారా కుటుంబం నుంచి ఫిలిం ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు రోహిత్. నారా అంటే పక్కా పొలిటికల్ ఫ్యామిలీ అనే గుర్తింపు ఉండగా.. రోహిత్ మాత్రం సినీ రంగాన్ని ఎంచుకున్నాడు. తొలి చిత్రం 'బాణం'తోనే తన ప్రతిభను చాటుకున్న అతను.. ఆ తర్వాత వైవిధ్యమైన సినిమాలతో మంచి గుర్తింపే సంపాదించాడు. కానీ కొన్నేళ్లు ఫుల్ బిజీగా ఉన్న అతను.. సడెన్‌గా ఇండస్ట్రీ నుంచి మాయం అయిపోయాడు. తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల్లో అధికారం కోల్పోయాక అతను కనిపించకుండా పోవడంతో పొలిటికల్ బ్యాకప్‌తోనే అతను సినిమాలు చేయగలుగుతున్నాడనే అభిప్రాయాలు వినిపించాయి. అందుకు తగ్గట్లే 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోహిత్ సినిమాల్లో యాక్టివ్ అయ్యాడు. గత ఏడాది 'సుందరకాండ' అనే చిత్రంతో పలకరించిన రోహిత్‌కు ఆశించిన ఫలితం దక్కలేదు. ఇటీవలే చినిమల్లి మణికుమార్ అనే కొత్త దర్శకుడితో ఒక సినిమాను మొదలుపెట్టాడు రోహిత్. ఐతే హీరోగా ముందుముందు ఎన్ని సినిమాలు చేస్తాడో కానీ.. రోహిత్ క్యారెక్టర్ ఆర్టిస్టుగా బిజీ అయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆల్రెడీ త్రివిక్రమ్ దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో రోహిత్ ఒక కీలక పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. అది పాజిటివ్ క్యారెక్టరా.. నెగెటివా అన్నది వెల్లడి కాలేదు. ఇంతలోనే ఇప్పుడు మరో సీనియర్ హీరో సినిమాలో స్పెషల్ రోల్‌కు రోహిత్ రెడీ అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

మెగాస్టార్ చిరంజీవి హీరోగా బాబీ కొల్లి రూపొందించబోతున్న చిత్రంలో రోహిత్ కోసం ఒక ప్రత్యేక పాత్రను డిజైన్ చేశారట. చిరు సినిమాలో నారా రోహిత్ నటించడం ప్రేక్షకులకు కచ్చితంగా ఒక సర్ప్రైజే. రోహిత్ గతంలోనూ 'సారొచ్చారు' లాంటి చిత్రాల్లో క్యామియో రోల్స్ చేశాడు కానీ.. వెంకీ, చిరు లాంటి పెద్ద హీరోల సినిమాల్లో ప్రత్యేక పాత్రలు చేయడం తన కెరీర్‌లో కచ్చితంగా ఒక మలుపే. ఈ పాత్రలు క్లిక్ అయితే క్యారెక్టర్, విలన్ పాత్రలతో అతను బిజీ అయిపోయే అవకాశముంది.

## మంగాపురం వైపు దృష్టి మళ్లుతోంది



ఘట్టమేనేని ఫ్యామిలీ నుంచి మూడో తరం వారసుడిగా ఇండస్ట్రీలో అడుగు పెడుతున్న జయకృష్ణ మొదటి సినిమా శ్రీనివాస మంగాపురం షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు రెడీ అవుతోంది. ఇప్పటికే టీజర్, ఒక పాట వచ్చేయగా సూపర్ స్టార్ స్వర్గీయ కృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఒక యాక్షన్ కట్ రిలీజ్ చేశారు. నిన్న జరిగిన ఈవెంట్ లో అశ్వినీదత్, రాఘవేంద్రరావు, కిరణ్, తమ్మారెడ్డి భరద్వాజ లాంటి సీనియర్ల హాజరులో కుర్రాడిని ఘనంగా ప్రేక్షకులకు పరిచయం చేశారు. బాబాయ్ మహేష్ బాబు అభిమానుల అండ ఎంత అవసరమో జయకృష్ణ బృందానికి తెలియంది కాదు. తండ్రి రమేష్ బాబు కూడా ఒకప్పుడు హీరోనే అయినప్పటికీ కెరీర్ ఎక్కువ కాలం కొనసాగలేదు. ఆయన చనిపోయిన తర్వాత కొడుకు రూపంలో తీరని కలను ఇలా నెరవేరుస్తాడని కుటుంబం బోలెడు ఆశలు పెట్టుకుంది. దానికి తగ్గట్టే జయకృష్ణ లుక్స్ లో మంచి అందంగా కనిపించడమే కాదు నటన పరంగా శిక్షణ తీసుకున్న వైనం విజువల్స్ లో కనిపిస్తోంది. శ్రీనివాస మంగాపురం దర్శకుడు అజయ్ భూపతి. ఆరెక్స్ 100 తర్వాత మహా సముద్రం నిరాశపరిచిన మంగళవారంతో తిరిగి తన ఉనికిని కొంత మేర చాటుకోగలిగాడు. ఇప్పుడు కీలకమైన జయకృష్ణ డెబ్యూని తన చేతుల్లో పెట్టారు. సీనియర్ హీరోయిన్ రవీనాటాండన్ కూతురు రషా తదాని ఈ మూవీతో టాలీవుడ్ కు పరిచయమవుతోంది. తన తల్లి తెలుగులో బంగారు బుల్లోడు, రథసారధి, ఆకాశవీధిలో లాంటి చెప్పుకోదగ్గ సినిమాలు కొన్ని చేసింది. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఇందులో ఒక కీలక పాత్ర పోషించడం మరో విశేషం. జివి ప్రకాష్ కుమార్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. జయకృష్ణ కనక మొదటి సినిమాతో సక్సెస్ అందుకుంటే అవకాశాలు క్యూ కడతాయి. సుధీర్ బాబు విషయంలో జరిగిన పొరపాట్లు రిపీట్ కాకుండా కథల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే చాలు. ఎలాగూ బాబాయ్ గైడెన్స్ ఉంటుంది కాబట్టి కెరీర్ ని సరైన దిశగా ప్లాన్ చేసుకుంటే చాలు వరసగా సినిమాలు చేసుకోవచ్చు




## టాలీవుడ్ అంటే రెహ్మాన్ కు ఇంత ప్రేమ ఉందా



ఇండియా గర్వించదగ్గ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్. తమిళ సినిమా ప్రయాణం మొదలుపెట్టి రెండు ఆస్కార్ అవార్డులు గెలిచే స్థాయికి ఎదిగిన గ్లోబల్ మ్యూజిక్ డైరెక్టర్ ఆయన. దేశ సినీ సంగీత చరిత్రలోనే నంబర్ వన్ స్థానానికి ఆయన గట్టి పోటీదారు. అలాంటి లెజెండరీ సంగీత దర్శకుడు.. టాలీవుడ్ హీరో రామ్ చరణ్ గురించి, తెలుగు సినీ పరిశ్రమ గురించి చెన్నైలో జరిగిన పెద్ది ప్రమోషనల్ ప్రెస్ మీట్లో చాలా గొప్పగా మాట్లాడాడు. చిరంజీవి ఒక పెద్ద లెజెండ్ అని, ఎంతో సాధించిన అలాంటి వ్యక్తి కొడుగ్గా ఇండస్ట్రీలోకి వచ్చి తనకంటూ సొంత పేరు సంపాదించుకోవడం అంత తేలికైన విషయం కాదని, అది రామ్ చరణ్ సాధించాడని, తండ్రిని మించిన తనయుడు అనిపించుకున్నాడని రెహమాన్ కొనియాడాడు. తనకూ ఒక కొడుకు ఉన్నాడని, అతను రామ్ చరణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తనను మించి ఎదగాలని కోరుకుంటున్నానని రెహమాన్ వ్యాఖ్యానించాడు. ఇక తెలుగు సినీ పరిశ్రమ గురించి కూడా రెహమాన్ చాలా గొప్పగా మాట్లాడాడు. ఈ మధ్య తెలుగు సినిమా ఎంతో ఎదిగిందని.. ఆర్టిస్టులు, టెక్నీషియన్లు కలిసి అద్భుతాలు చేస్తున్నారని.. ఇలాంటి ఇండస్ట్రీలో తాను కూడా భాగం కావడం ఎంతో గొప్పగా అనిపిస్తోందని రెహమాన్ వ్యాఖ్యానించాడు. ఇక్కడ ఇంతకుముందే సినిమాలు చేసినప్పటికీ.. పెద్ది తనకు తొలి తెలుగు సినిమాలా అనిపిస్తోందని రెహమాన్ వ్యాఖ్యానించాడు. టాలీవుడ్ సంగీత దర్శకులు తనను ఇన్స్పిరేషన్‌గా చెబుతుంటారని.. కానీ తాను కీరవాణి, దేవిశ్రీ ప్రసాద్, తమన్ లాంటి వాళ్ల నుంచి స్ఫూర్తి పొందుతున్నానని రెహమాన్ వినమ్రంగా వ్యాఖ్యానించడం విశేషం. తాను వరుసగా కొంచెం భిన్నమైన, ప్రయోగాత్మక చిత్రలే చేస్తున్న సమయంలో.. సుకుమార్ సిఫారసు ద్వారా బుచ్చిబాబు వచ్చి తనను కలిశాడని, అతను చెప్పిన కథ నచ్చి మనమూ ఒక కమర్షియల్ సినిమా చేద్దాం అనిపించి పెద్ది సినిమాకు పని చేశానని రెహమాన్ తెలిపాడు. బుచ్చిబాబు గొప్ప దర్శకుడని, తనకెంతో నచ్చిన వ్యక్తి అని ఈ సందర్భంగా రెహమాన్ కొనియాడాడు.

## రామ్ చరణ్ చేతిలో 7 చీలికలు



తన సినిమాల్లో పాత్రల కోసం శారీరకంగా ఎంత కష్టానికైనా వెనుకాడని కథానాయకుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. ధృవ, ఆర్ఆర్ఆర్ లాంటి సినిమాల కోసం అతనెంత శ్రమించాడో, ఎంత అద్భుతంగా లుక్‌ను మార్చుకున్నాడో తెలిసిందే. ఇప్పుడు తన నుంచి రాబోయే 'పెద్ది' కోసం కూడా ఎంత కష్టపడ్డాడో ప్రోమోల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందులో కుస్తీ యోధుడి పాత్ర కోసం చరణ్ ఒళ్లు హూనం చేసుకునేలా కష్టపడ్డాడని, గాయాల పాలు కూడా అయ్యాడని టీం అంతా చెబుతోంది. కుస్తీ పోటీల సన్నివేశాల్లో భాగంగానే చేతిని దెబ్బ తీసుకుని రిస్ట్ బేస్‌తో కనిపిస్తున్నాడు. దాంతోనే ప్రమోషన్లలో కనిపిస్తున్నాడు. 'పెద్ది' షూటింగ్‌లో భాగంగా చెయ్యి బాగా దెబ్బ తిందని, దానికి సర్జరీ కూడా అవసరమని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. దీని గురించి ఒక ఇంటర్వ్యూలో సమాచారాన్ని పంచుకున్నాడు చరణ్. 'పెద్ది'లో కుస్తీ పోటీలకు సంబంధించిన సన్నివేశాలను 30 రోజుల పాటు చిత్రీకరించామని, ఆ సమయంలో మొదట్లోనే కొంచెం నొప్పి అనిపించిందని.. కానీ చేతికి ఏమైందో తెలుసుకోవడం కోసం ఎంఆర్ఐ స్కాన్ తీసి చూసుకునేందుకు తనకు భయం వేసిందని.. ఒక వేళ చీలిక (టియర్) ఉంటే షూట్ కొనసాగించలేం కదా అనిపించిందని చరణ్ చెప్పాడు. ఐతే మొదట్లో ఒక చిన్న చీలిక వచ్చి ఉంటుందని అనుకుంటే.. షూటింగ్ అంతా అయ్యాక స్కాన్ చూసుకుంటే ఏకంగా 7 చోట్ల చీలికలు ఉన్నట్లు తెలిసిందని చరణ్ తెలిపాడు. చేతికి సర్జరీ అవసరం అయిందని, కానీ ఇప్పుడు శస్త్రచికిత్స చేసుకుంటే ప్రమోషన్లకు దూరం కావాల్సి ఉంటుందని, అందుకే బ్రేస్ వేసుకుని మేనేజ్ చేస్తున్నానని.. సినిమా విడుదల తర్వాత సర్జరీ చేయించుకుంటానని చరణ్ తెలిపాడు. కుస్తీ పోటీల్లో రెజ్లర్లు చేతులు పట్టుకునే ఒకరినొకరు నెట్టుకుంటారన్న సంగతి తెలిసిందే. ప్రొఫెషనల్ రెజ్లర్లతో కలిసి సాధన చేయడం, చిత్రీకరణలో పాల్గొనడంతో చరణ్ చేతికి బాగానే గాయాలైనట్లు కనిపిస్తోంది.



# బిజినెస్ న్యూస్



## ఫిన్‌టెక్ రంగంలోకి ఎల్ఐసీ: సీఈఓ దొరైస్వామి




ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఫిన్‌టెక్ రంగంలోకి ప్రవేశించాలనుకుంటోంది. డిజిటల్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యూహాత్మక పెట్టుబడులు లేదా ఆర్గానిక్ మార్గంలో ఫిన్‌టెక్ విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కంపెనీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి తెలిపారు. ఆధునిక అవసరాలను తీర్చడానికి, నూతన ఆవిష్కరణల కోసం అటు ఫిన్‌టెక్, ఇటు ఇన్సురెన్స్‌టెక్ కంపెనీలతో పనిచేస్తున్నా మని పేర్కొన్నారు. ఈ మేరకు పీఐటీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశలపై మాట్లాడారు. కేవలం బీమా వ్యాపారమే కాకుండా దేశంలోనే అతిపెద్ద ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ ఉందని, అనేక పెద్ద పెద్ద కంపెనీల్లో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిందన్నారు. పాలసీదారులకు మెరుగైన ప్రతిఫలం అందించేం దుకు ప్రత్యేకమైన సంస్థల్లో వ్యూహాత్మక పెట్టుబడులకూ ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ టెక్నాలజీని ఎల్ఐసీ వేగంగా అందిపుచ్చుకుం టోందని చెప్పారు. తమ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా సొంతంగానే తమ బిజినెస్ అప్లికేషన్లను తయారు చేసుకుం టున్నామని వెల్లడించారు. అదే సమయంలో కొత్త కొత్త ప్లాట్‌ఫామ్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఇతర ఐటీ సర్వీస్ ప్రొవైడర్లతోనూ కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఫిన్‌టెక్ రంగంలో పోటీలో నిలదొక్కుకోవాలంటే ఐటీ అప్లికేషన్‌లను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఐసీలో తదుపరి వాటాల విక్రయంపై ప్రశ్నించగా.. పబ్లిక్ షేర్‌హోల్డింగ్ పరిమితిని పెంచేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

## పసిడి కొనుగోలుదార్లలో మారుతున్న ధోరణి



పసిడి ధర అధిక స్థాయుల్లో కొనసాగుతుండటంతో కొత్త ఆభరణాలు కొనేందుకు పూర్తి మొత్తాన్ని వెచ్చించడానికి బదులు.. పాత వాటినే మార్చేసి, ఆ వచ్చిన డబ్బులకు మరికొంత కలిపి కొత్తవి తీసుకుందామనే ధోరణి ఇటీవల కొనుగోలుదార్లలో పెరుగుతోంది. పాత ఆభరణాలను మార్చి కొత్తవి తీసుకోవాలనే ఆలోచన ఇప్పటిదేమీ కాదు. అయితే ప్రజల్లో నెలకొన్న కొన్ని సందేహాలు, భయాల కారణంగా పసిడి ఆభరణాల మార్పిడి విషయంలో వాళ్లు వెనకడుగు వేస్తుంటారు. పసిడి స్వచ్ఛతను సరిగ్గా నిర్ధారిస్తారా? వేరొక నగల వ్యాపారి వద్ద కొన్న ఆభరణాలకు సరైన ధర ఇస్తారా? ఏవేవో రుసుముల పేరుతో ఛార్జీలు వేసి తుది విలువను తగ్గిస్తారా? అనే విషయాలపై ప్రజలు ఆందోళన చెందుతుంటారు. పాత ఆభరణాలను మార్చుకునే కుటుంబం అది నెక్లెస్ కావచ్చు లేదా ఏళ్ల పాటు దాచిపెట్టిన చిన్న, విరిగిన ముక్క కావచ్చు.. అందులోని ప్రతి గ్రాముకూ సహేతుక విలువను పొందాలనే కోరుకుంటుంది.

ఈ ఆలోచన సరైనదేనా? పసిడి ధర అధిక స్థాయుల్లో కొనసాగుతున్నప్పుడు.. పాత ఆభరణాలను మార్చి కొత్తవి తీసుకోవడం మంచి ఆలోచనేనా? అంటే అవుననే అభిప్రాయం వినిపిస్తోంది. ప్రస్తుత అధిక ధరల వద్ద కొత్త డిజైన్లతో కూడిన ఆభరణాల కొనుగోలు కోసం.. పాత ఆభరణాల విలువను ఉపయోగించుకోవడానికి బంగారం మార్పిడి ప్రజలకు వీలు కల్పిస్తుంది. ఇది కొనుగోలు ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఇప్పటికే ఉన్న పుత్తడి ఆస్తులను మరింత ఉపయోగకరంగా మారుస్తుంది. ఇది దేశానికి కూడా విస్తృత ప్రయోజనం చేకూరుస్తుంది. దేశం ప్రతి సంవత్సరం భారీ పరిమాణంలో బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్నందున, పాత ఆభరణాలను రీసైక్లింగ్ చేయడం, మార్పిడి చేసుకోవడం ద్వారా కొత్త దిగుమతులపై ఆధారపడటం తగ్గి, విదేశీ మారక నిల్వల వాడకాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల పాత ఆభరణాల మార్పిడి అనేది కొనుగోలుదార్లకు భారాన్ని తగ్గించే ఆర్థికపరమైన నిర్ణయమే కాకుండా.. భారతదేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో పాలుపంచుకోవడానికి మరింత సమర్థమైన, సుస్థిరమైన మార్గంగా కూడా మారుతోంది.

## గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా!



డిజిటల్ ప్రకటనల రంగంలో ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ఒక కేసులో ఢిల్లీ హైకోర్టు, గూగుల్‌పై కీలకమైన తీర్పును వెల్లడించింది. ప్రముఖ బాత్‌రూమ్ ఫిట్టింగ్స్ అండ్ శానిటరీ వేర్ తయారీ సంస్థ 'హిండ్‌వేర్' ట్రేడ్‌మార్క్ హక్కులను ఉల్లంఘించిందని గుర్తించిన కోర్టు, గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా విధించింది. హిండ్‌వేర్ అనేది భారతదేశంలో ప్రసిద్ధి చెందిన శానిటరీ వేర్ బ్రాండ్. వినియోగదారులు గూగుల్‌లో అని వెతికినప్పుడు, హిండ్‌వేర్ వెబ్‌సైట్‌కు బదులుగా ప్రత్యర్థి కంపెనీల ప్రకటనలు ముందుగా కనిపిస్తున్నాయని సంస్థ గుర్తించింది. దీనికి కారణం.. ఆ కంపెనీలు హిండ్‌వేర్ అనే పదాన్ని తమ ప్రకటనల కోసం కీవర్డ్‌గా కొనుగోలు చేయడమే. గూగుల్ యొక్క ూాంఔశీతీం (ప్రస్తుతం గూగుల్ యాడ్స్) వ్యవస్థలో కంపెనీలు తమకు కావలసిన కీవర్డ్లపై బిడ్ వేస్తాయి. వినియోగదారులు ఆ పదాలను సెర్చ్ చేసినప్పుడు, ఎక్కువ బిడ్ వేసిన కంపెనీల ప్రకటనలు పైభాగంలో కనిపిస్తాయి. ఈ విధంగా హిండ్‌వేర్ పేరును ప్రత్యర్థులు ఉపయోగించుకోవడం వల్ల వినియోగదారులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని కంపెనీ వాదించింది.

### 163 పేజీల తీర్పు

ఈ కేసును విచారించిన న్యాయమూర్తి.. గూగుల్ కేవలం ఒక మధ్యవర్తి కాదని స్పష్టం చేశారు. గూగుల్ స్వయంగా కీవర్డ్లను సూచించడం, వాటి వేలాన్ని నిర్వహించడం, ప్రకటనల ప్రదర్శనను తన అల్గోరిథమ్‌ల ద్వారా నియంత్రించడం వంటి చర్యలు చేపడుతోంది. కాబట్టి ట్రేడ్‌మార్క్‌ను వ్యాపార ప్రయోజనాల కోసం ప్రదర్శించాల్సిన బాధ్యత గూగుల్‌పైనా ఉంటుందని కోర్టు తన 163 పేజీల తీర్పులో పేర్కొంది. కోర్టు అభిప్రాయం ప్రకారం.. హిండ్‌వేర్ అనే ట్రేడ్‌మార్క్‌పై గూగుల్‌కు ఎటువంటి యాజమాన్య హక్కు లేదు. అయినప్పటికీ.. ఆ పేరును ప్రత్యర్థి సంస్థలకు అమ్మి లాభం పొందడం ద్వారా గూగుల్ ఆ కంపెనీ ప్రతిష్ఠను వాణిజ్యపరంగా వినియోగించుకుంది. దీనిని కోర్టు ఫ్రీ రైడింగ్ (ఇతరుల కృషి వల్ల ఏర్పడిన పేరును ఉపయోగించి లాభపడటం) అని వెల్లడించింది.

### గూగుల్ వాదన

గూగుల్ తనను తాను కేవలం ప్రకటనల వేదికగా మాత్రమే పేర్కొంటూ.. హిండ్‌వేర్ సమస్యకు తాము బాధ్యులు కాదని వాదించింది. కీవర్డ్స్ అనేవి వినియోగదారుడు సెర్చ్ చేసినప్పుడు.. ప్రకటనలు చూపించ డానికి బ్యాక్ ఎండ్‌లో పనిచేసే కొన్ని సాధనాలు మాత్రమే అని వెల్లడించింది. అంతేకాకుండా.. సమాచార సాంకేతిక చట్టం, 2000లోని సెక్షన్ 79 ప్రకారం తమకు సేఫ్ హార్బర్ రక్షణ వర్తిస్తుందని తెలిపింది. అయితే కోర్టు ఈ వాదనను తిరస్కరించింది.

ఎందుకంటే.. గూగుల్ కేవలం ప్రకటనలను ప్రదర్శించడం మాత్రమే కాకుండా, ట్రేడ్‌మార్క్‌లను కీవర్డ్లుగా అమ్మి ఆదాయం పొందుతోందని గుర్తించింది. అందువల్ల గూగుల్ ఒక క్రియాశీల పాత్ర పోషిస్తోందని, సేఫ్ హార్బర్ రక్షణకు అర్హత లేదని తీర్పు చెప్పింది.

### ప్రత్యర్థి సంస్థలు

ఈ కేసులో ప్రత్యర్థి సంస్థలుగా గ్రోహే ఇండియా, ఓంకార ఇన్ఫోవెబ్, సెరా శానిటరీవేర్ కూడా ఉన్నారు. వీరు హిండ్‌వేర్ పేరును లేదా హిండ్‌వేర్ శానిటరీవేర్ వంటి పదాలను కీవర్డ్లుగా కొనుగోలు చేసి తమ ప్రకటనలను ప్రదర్శించారు. అయితే విచారణ సమయంలో ఈ సంస్థలు హిండ్వేర్‌తో రాజీ చేసుకోవడంతో, చివరకు గూగుల్ మాత్రమే ఈ కేసులో మిగిలింది.

ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు భారతదేశంలోని డిజిటల్ మార్కెటింగ్ రంగానికి ఒక మైలురాయిగా నిలిచింది. ఇప్పటి వరకు అనేక కంపెనీలు ప్రత్యర్థి బ్రాండ్ల పేర్లను కీవర్డ్లుగా కొనుగోలు చేసి తమ వ్యాపారాలను ప్రోత్సహించేవి. ఇకపై అలాంటి చర్యలు ట్రేడ్‌మార్క్ ఉల్లంఘనగా పరిగణించబడే అవకాశం ఉంది. నితిన్ కామత్ కూడా ఈ తీర్పును స్వాగతిస్తూ, తమ సంస్థకు ఇలాంటి సమస్యలు సంవత్సరాలుగా ఎదురవుతున్నా యని, ఇప్పుడు చట్టపరమైన పరిష్కారం పొందేందుకు మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు.

## వాహన లీజింగ్‌లోకి ఇసుజు మోటర్స్!

వాణిజ్య వాహనాల తయారీ సంస్థ ఇసుజు మోటర్స్ ఇండియా తమ డీ--మ్యాక్స్ ఎస్--క్యాబ్‌కి సంబంధించి దేశీయంగా లీజింగ్ విధానాన్ని ప్రకటించింది. ఈ విధానంలో నాలుగేళ్ల ఫిక్స్డ్ కాలవ్యవధికి, నెలవారీ అద్దె రూ. 38,999 నుంచి ప్రారంభమవుతుందని సంస్థ తెలిపింది. సంప్రదాయ ఫైనాన్స్ మోడల్‌తో పోలిస్తే కస్టమర్లకు రూ. 1.81 లక్షల మేర ఆదా అవుతుందని వివరించింది. ఫ్లీట్ ఆపరేటర్లతో పాటు వివిధ వ్యాపార వర్గాల కోసం ఈ సొల్యూషన్‌ని రూపొందించినట్లు కంపెనీ ఎండీ రాజేష్ మిట్టల్ తెలిపారు. ఇసుజు డీ-మ్యాక్స్ ఎస్-క్యాబ్ 2.5-లీటర్ ఎ+ు ఇంటర్‌కూల్డ్ డీజిల్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 5-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ పొందుతుంది. ఇందులో పెద్ద కార్గో బెడ్‌తో పాటు హెవీ-డ్యూటీ సస్పెన్షన్ సెటప్ కూడా ఉంది, ఇది అధిక డిమాండ్ ఉన్న వాణిజ్య అవసరాలకు అనుకూలంగా ఉంటుంది. క్యాబిన్ లోపల, డి-మాక్స్ ఎస్-క్యాబ్ ఆరు విధాలుగా సర్దుబాటు చేయగల డ్రైవర్ సీటు, ఎయిర్ కండిషనింగ్, అనేక స్టోరేజ్ స్థలాలు, మల్టీ-ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వంటి ఆచరణాత్మక ఫీచర్లు ఉంటాయి.

# రైతు డిస్కంపై టీఆర్ఎస్ ఆందోళన..

**- రైతాంగానికి అన్యాయం చేస్తే ఉద్యమాలు తప్పవన్న మజీద్**



**రాజన్న సిరిసిల్ల, మే 31: నేటి మన దేశమ్ ప్రతినిధి** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం టీఆర్ఎస్ జెండా పండుగ గద్దె నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నాయకులు వరద సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మజీద్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జిలు బుస వేణు, గుంటుక సంపత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రభుత్వం చేపట్టిన రైతు డిస్కం ఏర్పాటు రైతాంగాన్ని నట్టేట ముంచే చర్యగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు అడగకుండానే తీసుకొస్తున్న ఈ విధానం రైతుల పాలిట శాపంగా మారుతుందని పేర్కొన్నారు. టీఆర్ఎస్ అధినేత కవిత రైతుల పక్షాన నిలబడి రైతు డిస్కం ప్రతిపాదనను ఖండించారని, రైతన్నలకు అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారని తెలిపారు.జిల్లా ఇన్‌చార్జ్ మజీద్ మాట్లాడుతూ, రైతు డిస్కం అంశంపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నిర్వహించిన పబ్లిక్ హియరింగ్‌లో కవిత రైతుల తరఫున గళం విప్పారని చెప్పారు. రైతులకు మేలు చేసే ఆలోచన ఉంటే ప్రభుత్వం ఈ అంశాన్ని ఆరు నెలలుగా ఎందుకు గోప్యంగా ఉంచిందో వెల్లడించాలని డిమాండ్ చేశారన్నారు. తెలంగాణ రైతాంగానికి నష్టం చేసే నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోవాలని, లేకపోతే తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్‌లు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలని కవిత విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. విద్యుత్ సంస్కరణల పేరిట రైతులకు అన్యాయం జరిగితే టీఆర్ఎస్ రైతాంగంతో కలిసి ఉద్యమాలు చేపడుతుందని స్పష్టం చేశారు.రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్, లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవసరమైన విద్యుత్ ఖర్చును ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో కొత్త డిస్కం ఎలా లాభాల్లో నడుస్తుందో ప్రభుత్వం వివరించాలని ప్రశ్నించారు. తెలంగాణలో సుమారు 29 లక్షల బోర్లు ఉన్నాయని, కొత్త డిస్కం వల్ల వాటి భవిష్యత్తు అనిశ్చితిలో పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిధంగా, టీఆర్ఎస్ అధినేత కవిత ప్రకటించిన పంచజన్య పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని నాయకులు తెలిపారు. ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగాలు, రైతే రాజు, సామాజిక న్యాయం లక్ష్యాలుగా పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మహిళలు, యువతకు ప్రాధాన్యం కల్పిస్తున్నందున పెద్ద సంఖ్యలో ప్రజలు టీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు.

# బీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పప్పుల సురేష్ నియామకం



**రాజన్న సిరిసిల్ల, మే 31: నేటి మన దేశమ్ ప్రతినిధి** భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ సంస్థ భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ (బీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడిగా బీఎంఎస్ నాయకుడు పప్పుల సురేష్ నియమితులయ్యారు. కార్మిక ఉద్యమంలో ఆయనకున్న అనుభవం, అంకితభావాన్ని గుర్తించి సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పప్పుల సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మెడికల్ రిప్రజెంటేటివ్‌లు, సేల్స్ రిప్రజెంటేటివ్‌లు, ఫార్మా రంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానన్నారు. పెరుగుతున్న పనిభారం, ఉద్యోగ భద్రత లోపం, లక్ష్యాల ఒత్తిడి, కార్మిక చట్టాల అమలులో ఉన్న సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను నిర్మించి ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు."ఉద్యోగుల హక్కుల పరిరక్షణే నా ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలోని ప్రతి మెడికల్, సేల్స్ ఉద్యోగికి బీఎంఎస్ఆర్‌యూ అండగా నిలుస్తుంది. సంఘటిత శక్తితో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన హక్కులను సాధించేందుకు నిరంతరం పోరాడుతాం" అని ఆయన తెలిపారు.పప్పుల సురేష్ నియామకంపై రాష్ట్రవ్యాప్తంగా బీఎంఎస్ నాయకులు, కార్మిక సంఘ ప్రతినిధులు, మెడికల్ మరియు సేల్స్ రంగ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో బీఎంఎస్ఆర్‌యూ మరింత బలోపేతమై ఉద్యోగుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ నియామకానికి సహకరించిన బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర నాయకత్వానికి పప్పుల సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష...





**కొమురం ఆసిఫాబాద్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో జూన్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ముఖ్యమంత్రి భద్రత అధికారులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి భద్రత అధికారులు శ్రీనివాస్ రావు, ప్రభాకర్ రావు, జిల్లా కలెక్టర్ కె. హరిత, జిల్లా ఎస్.పి. నితికా పంత్, ఆదిలాబాద్ ఎస్.పి. అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి భద్రత అధికారులు సమీక్షిస్తూ కెరమెరి మండలం కొలామ్, కొఠారి లలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా వస్తున్నందున తెలిపారు వద్ద అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కాగజ్ నగర్ ఎక్స్ రోడ్డు సమీపంలో బహిరంగ సభ స్థలం వద్ద 2 అగ్నిమాపక చకటాలు అందుబాటులో ఉంచాలని, ముఖ్యమంత్రి పర్యటనలో విద్యుత్ అంతరాయం లేకుండా ఏర్పాటు చేయాలని, వైద్యాధికారులు అంబులెన్స్ లను అందుబాటులో ఉంచి నిపుణులైన వైద్యులను, సిబ్బందిని నియమించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలో ప్రారంభిస్తాం...

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల డిమాండ్ పెరిగింది
- ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు
- ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పెద్దపల్లి బస్ డిపో స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర మంత్రులు



**పెద్దపల్లి మే 31 (నేటి మనదేశమ్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఆర్టీసీ బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రతిపాదిత బస్ డిపో స్థలాన్ని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయ రమణారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ విజయ రమణారావు, సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి పెద్దపల్లికి ఆర్టీసీ బస్ డిపోను మంజూరు చేశారని తెలిపారు.బస్ డిపో పనులు కొంత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు కనెక్టివిటీని మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియ కూడా కొనసాగుతోందని, ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికులకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఐదుగురు మంత్రులు, సీనియర్ అధికారులు, 40 మంది ఆర్టీసీ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నామని, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో ఆర్టీసీ విలీన ప్రక్రియను చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. విలీన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అడ్డంకులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, కార్మికులు అనవసర ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా ఆటో యూనియన్ నూతన పాలకవర్గం ప్రకటింపు



**రాజన్న సిరిసిల్ల, మే 31: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాజన్న సిరిసిల్ల జిల్లా ఆటో యూనియన్ నూతన పాలకవర్గాన్ని ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు, యూనియన్ బలోపేతం లక్ష్యంగా నూతన కమిటీ బాధ్యతలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు.నూతన పాలకవర్గంలో జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బొల్లి రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడిగా అల్లే శ్రీనివాస్ ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పులి నాగరాజు, సయ్యద్ ఉమర్, ఎండి ఖాన్, కొండ దేవయ్య నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గొడుగు సంజీవ్, కోశాధికారిగా ఎండి కరీం ఖాన్ బాధ్యతలు స్వీకరించనున్నారు.ప్రచార కార్యదర్శులుగా మారా చంద్రయ్య, అందె శ్రీనివాస్, ఇమ్రాన్, వంగల్ల శ్రీనివాస్, ఎరుకల రమేష్, గొట్ట శ్రీహరి ఎంపికయ్యారు. ముఖ్య సలహాదారులుగా సుంకుపాక దేవయ్య, దోనపాటి లక్ష్మారెడ్డి, తోట శేఖర్, చింతల్తాన లక్ష్మీరాజు, చింతల దిలీప్, గడ్డం శ్రీనివాస్, లింగంపల్లి బాలరాజు నియమితులయ్యారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉపాధి భద్రత కోసం సంఘటితంగా పనిచేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీకి ఆటో కార్మికులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చదువు పట్ల యువత శ్రద్ధ చూపించాలి




**కోదాడ మే 31 (నేటి మనదేశమ్):** స్థానిక నయా నగర్ బాప్టిస్ట్ చర్చిలో యూత్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. జూన్ ఫస్ట్ తారీకు నూతనంగా స్కూలు కళాశాలలో చేరుతున్న విద్యార్థులకు సామాజిక విషయాలపై చదువు పట్ల శ్రద్ధ పై అవగాహన కలిగించుటకు కోదాడ బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ వి యేసయ్య సోమవారం సాయంత్రం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అందుకు సంబంధించిన ఆహ్వాన చేతి పత్రికలు రిలీజ్ చేశారు.. ఈ పత్రిక అందిన ప్రతి ఒక్కరు అటెండ్ అయ్యి సమాజంలో యువత చెడు ప్రబోలాలకు లోన్ కాకుండా చదువు పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని అవగాహన కలిగి ఉండాలని తల్లిదండ్రుల ఆశ నెరవేర్చాలని చేసే ప్రయత్నంలో ఈ యూత్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది కావున ప్రతి ఒక్కరూ హాజరై యువత పెడదారిన పడుతున్న దినాల్లో చదువు పట్ల శ్రద్ధ చూపించాటానికి ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ స్త్రీలు యవ్వనస్థులు పెద్దలు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా స్థాయి సమావేశం




**అదిలాబాద్ మే 31 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు.దీనికి ముఖ్యఅతిథిగా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు టిసి రాథోడ్,రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ సింగ్,బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదోలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా రాథోడ్ భీమ్రావు,ప్రధాన కార్యదర్శి జాదవ్ పవన్ నాయక్,ఉపాధ్యక్షుడిగా ఆడే గోవర్ధన్,చేయూత కార్యదర్శిగా హీరాలల్ రాథోడ్ ఎన్నుకోక వారిని సత్కరించారు.ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు టిసి రాథోడ్ మాట్లాడుతూ.నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గం బంజారాల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు.విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం ద్వారా అందించే కుల ధ్రువీకరణ,ఇతర సంక్షేమ పథకాల లబ్ధి కోసం కృషి చేయాలన్నారు.జాతీయ రాష్ట్రస్థాయిలో సంఘం సైతం ఈ సమస్యలపై పోరాటాలు చేస్తుందని తెలిపారు.

# వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మే 31, నేటి మనదేశమ్:** రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని చెన్నూర్ మండలం ఒతుకులపల్లి, ఆస్నాద్, సోమనపల్లి లలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, చెన్నూర్ మండల కేంద్రంలోని గోదామును మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు సమావేశం

**ఆదిలాబాద్ మే 31 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన'కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు,బిఎల్ ఏ -2 ల సమావేశానికి'ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెద్దపల్లి ఎంపీ, అదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి గడ్డం వంశీ కృష్ణ కి ఖానాపూర్ ఎమ్మెల్యే ,నిర్మల్ డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ తో కలిసి,ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి శాలువాతో ఘన స్వాగతం పలికారు.అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్యకర్తలకు దిశనిర్దేశం చేసారు.అనంతరం బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్,టీపిసిసి ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు ని సన్మానించడం జరిగింది.ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య ,మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ ,ఆదిలాబాద్,బోథ్ నియోజకవర్ గఇంచార్జ్ లు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్,మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్,మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్ర సుజాత,మాజీ ఎంపీ సోయం బాపురావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి,మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి,మార్కెట్ చైర్మన్ లు,ఇతర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కౌన్సిలర్ లు, మండల అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూన్ 2 ఉద్యమకారుల ర్యాలీని విజయవంతం చేయాలి...

**హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ పిలుపు.**

**హుస్నాబాద్ మే 31 నేటి మనదేశమ్ :** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేయడాన్ని హుస్నాబాద్ నియోజకవర్గ ఉద్యమకారులు స్వాగతించినప్పటికీ, ఆ కమిటీ సమగ్రంగా లేదని జేఏసీ నాయకులు అభిప్రాయపడ్డారు. కమిటీలో ఉద్యమ సంస్థల ప్రతినిధులు, మేధావులు, రిటైర్డ్ న్యాయమూర్తులు, మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సభ్యులుగా చేర్చి విస్తరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఉద్యమకారులు, ఉద్యమ సంస్థలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, విద్యార్థి, యువజన, రైతు, కార్మిక, జర్నలిస్టు, వివిధ వృత్తి సంఘాల ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్‌తో స్వచ్ఛ విశాఖను నిర్మిద్దాం

## - నగర పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి.
## - దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్.




**విశాఖపట్నం, మే 31 (నేటి మనదేశమ్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ద్వారా స్వచ్ఛమైన విశాఖ నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం లో భాగంగా రెండవ వారం అనగా మే 29 నుండి జూన్ 4 వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన దక్షిణ నియోజకవర్గంలోని 38వ వార్డు బుక్కా వీధిలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.నాగలక్ష్మి లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ల మంచి ఆలోచనతో ఆంధ్ర ప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని ఒక రాష్ట్రం- ఒక పరిశుభ్రత లక్ష్యంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా దక్షిణ నియోజకవర్గంలోని మురికివాడ ప్రాంతమైన 38వ వార్డు బుక్కా వీధిలో స్టార్మ్ వాటర్ డ్రైన్లు, నాలాలు, బ్యాక్‌లేన్ల పరిశుభ్రత పనులను రెండో వారంలో చేపట్టినట్లు పేర్కొన్నారు. కేవలం మున్సిపల్ సిబ్బంది కృషితోనే ఈ కార్యక్రమం విజయవంతం కాదని, ప్రజల సహకారం అత్యంత అవసరమని శాసనసభ్యులు స్పష్టం చేశారు. విశాఖపట్నం రాష్ట్రానికి తలమానికమైన నగరమని, స్వచ్ఛ సర్వేక్షణలో విశాఖ మొదటి ర్యాంకు సాధించేలా ప్రతి పౌరుడు బాధ్యతతో కృషి చేయాలన్నారు. నిత్యం ఇంటిలో వ్యర్థాలను నాలుగు రంగుల డస్ట్ బిన్లలో విభజించి జీవీఎంసీ సిబ్బందికి అందించాలన్నారు. వారానికి ఒక రోజు పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా నగరాన్ని మరింత అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దవచ్చన్నారు. కాలువలు, నాళాలు శుభ్రపరచడం ద్వారా రానున్న వర్షాకాలంలో డ్రైన్లు పొంగిపొర్లకుండా, వర్షపు నీరుతో పాటు మురుగునీరు సాఫీగా ప్రవహించే అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా దోమలు వృద్ధిని అరికడుతూ పరిశుభ్రతను మెరుగు పరుచు కోవచ్చునన్నారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విశాఖ నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని నెల రోజుల పాటు ప్రతి వార్డులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచడం, వర్షాకాలంలో నీటి నిల్వలు, డ్రైనేజీ అడ్డంకులు ,దోమల వ్యాప్తిని నివారించడం లక్ష్యంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా రెండవ వారానికి సంబంధించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. మే 30 నుండి జూన్ 4, 2026 వరకు వార్డు స్థాయిలో వర్షపు నీటి కాలువలు (స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు), నాలాలు మరియు వెనుక సందుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం, సహకారం అత్యంత అవసరమని అదనపు కమిషనర్ అన్నారు. అనంతరం అందరూ కలిసి.... 38వ వార్డులో ప్రజల అవగాహన కోసం ఏర్పాటు చేసిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, దోమల నివారణ, నాలుగు బిన్‌ల వినియోగ విధానం తదితర అంశాలపై ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్స్‌ను సందర్శించి, ఆ ప్రాంతంలో కాలువలను శుభ్రపరిచి అందరికీ స్ఫూర్తిని కలిగించారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ శానిటేషన్, హెల్త్ సెక్రటరీలు, ఇతర అధికారులు, మాజీ కార్పొరేటర్ బి.ఉమామహేశ్వరరావు, గోడే నరసింహాచారి. సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# దేవస్థానంలోకి.. సెల్‌ఫోన్లు తేవొద్దు



**విశాఖపట్నం, మే 31 (నేటి మనదేశమ్) :** ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోకి సెల్‌ఫోన్లతో భక్తులు దర్శనాలకు రావొద్దని ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ విజ్ఞప్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో సెల్‌ఫోన్ల విచ్చలవిడి వినియోగంతో.. భద్రతకు ప్రమాదం పొంచి ఉండటమేకాక.. ఆధ్యాత్మిక శోభకు భంగం వాటిల్లుతోందని 'ఈనాడు'లో శనివారం ప్రచురించిన కథనానికి అధికారులు, పాలకమండలి స్పందించింది. శనివారం జరిగిన పాలక మండలి సమావేశంలోనూ సెల్‌ఫోన్ల విచ్చలవిడి వినియోగాన్ని అరికట్టాలని నిర్ణయించారు. వి దేవాలయ ఉద్యోగులతో పాటు, సెక్యూరిటీ, హోమ్ గార్డులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఎవరూ ఆదివారం నుంచి కొండపైకి మొబైల్‌ఫోన్లను తీసుకొచ్చి వినియోగించ కూడదని ఈవో ఆదేశాలు జారీ చేశారు. వి దేవస్థానం లోపల విధులు నిర్వహించే సమయంలో ఫోన్లు కలిగి ఉన్నా, విని యోగించినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వి ప్రధానంగా పెద్ద, చిన్న రాజ గోపురాలు, స్కానింగ్ పాయింట్లు, దేవాలయం లోపల, బయట ప్రాంగణాల్లోకి మొబైల్‌ఫోన్లు అనుమతించమని వెల్లడించారు. వి కేవలం అత్యవసర సమాచారం ఇచ్చేందుకు అనుమతి స్తామని తెలిపారు. వి ఈ ఆదేశాలను అందరూ పాటించాలని పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ తెలిపారు. సూపరింటెండెంట్‌లు, గుమస్తాలు, కౌంటర్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు ఎవరూ మొబైల్‌ఫోన్లను తేకూడదని సూచించారు. వి సెక్యూరిటీ, శానిటేషన్ సూపర్‌వైజర్లకు అవసరమైన సందర్భాలలో మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

**విస్తృతంగా తనిఖీలు.. :** టికెట్ స్కానింగ్ పాయింట్ల వద్ద ఆలయ ఈవో, అధికారులు తనిఖీలు నిర్వహించి.. సెల్‌ఫోన్లతో దర్శ నాలకు వెళుతున్న భక్తులను.. వెనక్కి పంపించేశారు. ఆలయ భద్రత నేపథ్యంలో..

ఫోన్లకు అనుమతి లేదని భక్తులకు వివరించారు. క్యూలైన్లు, రాజగోపురం, అమ్మవారి ఉత్సవ మూర్తులను ఉంచిన ప్రదేశాలతో పాటు చివరికి గర్భా లయంలోకి సైతం చాలామంది ఫోన్లను తీసుకెళ్లి.. ఫొటోలు తీస్తున్నారు. రీల్స్ కూడా చేస్తున్నారు. ఇటీవల కొందరు భక్తులు అమ్మవారి మూలవిరాట్టు చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పెట్టడం వివాదంగా మారింది.

# ఉదయం డెలివరీ బాయ్.. రాత్రిళ్లు దొంగతనాలు

## యువకుడి అరెస్టు.. 20 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం : ఎస్పీ దామోదర్



**విజయనగరం, మే 31 (నేటి మనదేశమ్) :** బొబ్బిలి, బాడంగి, సీతానగరం, ఎస్.కోట, జామి, భోగాపురం పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. వారి నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. రామభద్రపురం మండలం రొంపిల్లి గ్రామానికి చెందిన పువ్వల మణికంఠ(22) శనివారం మెట్టవలస బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా బొబ్బిలి సీఐ కె.నారాయణ రావు, సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించారు. ఓ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ.. క్యాంపులకు వెళ్లే వారి ఇళ్లను గుర్తించి రాత్రిళ్లు దొంగతనాలు చేస్తున్నట్లు గుర్తించారు. చోరీచేసిన బంగారు ఆభరణాలను మణికంఠ సాలూరులోని ఓ బంగారం దుకాణంలో విక్రయిస్తూ.. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నాడు. ఇప్పటి వరకూ బొబ్బిలి మండలంలో నాలుగు, సీతానగరంలో రెండు దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలడంతో అతనితోపాటు వస్తువులు కొన్న వ్యక్తిని అరెస్టు చేసి, వారి నుంచి సుమారు 20 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు. విజయనగరం నుంచి అనకాపల్లికి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న అనకాపల్లికి చెందిన బుద్ధ గాయత్రి బ్యాగులో రెండు తులాల బంగారు ఆభరణాలను దొంగిలించిన కొత్తవలస 202 కాలనీకి చెందిన రావుల పార్వతీ (30)పై కేసు నమోదు చేసి, నగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

డీఎస్పీలు ఎస్.రాఘవులు, ఆర్.గోవిందరావు, సీఐలు నారాయణరావు, నారాయణమూర్తి, ఎస్బీ సీఐ లీలారావు పాల్గొన్నారు.

# జూన్ పెన్షన్లకు రూ.2,728 కోట్లు

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి, మే 31 (నేటి మనదేశమ్) : :** రాష్ట్ర వ్యాప్తంగా జూన్‌లో 62,34,445 మంది పెన్షన్‌దారులకు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పెన్షన్ల నిమిత్తం కూటమి ప్రభుత్వం రూ.2,728.67 కోట్లు విడుదల చేసిందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా 5606 స్పౌజ్ (భార్య, భర్త) పెన్షన్లు మంజూ రయ్యాయని, ఈ లబ్ధి దారులకు రూ.2.24 కోట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా విడుదల చేసినట్లు వెల్లడించారు.

సోమవారం ఉదయం నుంచే లబ్ధిదారులకు నేరుగా పంపిణీ చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెలతో కలుపుకుని ఇప్పటి వరకు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో రూ.65,886.57 కోట్లను ఖర్చు చేసిందని వివరించారు.

# నగుళ్ళు మెట్ట సమీపంలో ఏనుగులు తిష్ట



**మక్కువ (మన్యం) మే 31 (నేటి మనదేశమ్) :** మండలంలోని నగుళ్ళు దబ్బగడ్డ నీలాటి రేవు సమీపంలోని మెట్ట వద్ద ఏనుగులు తిష్ట వేశాయి. శుక్రవారం రాత్రి దబ్బగడ్డ గ్రామం పొలాలు మీదుగా అడారు గడ్డలోనికి ప్రవేశించిన ఏనుగులు శనివారం సాయంత్రం వరకు ఆ పరిసరాల్లోనే సంచరించాయి. ఆడారు గడ్డకు అనుకొని ఉన్న ఓ రైతు పామాయిల్ తోటలో ఉన్న వాటర్ ట్యాంకును ఏనుగులు ధ్వంసం చేశాయి. అలాగే సమీపంలో ఉన్న గిరిజనుల జొన్న పంటను కూడా నాశనం చేశాయి. ఆ డారు గడ్డ సమీపంలో నీటి సదుపాయంతో పాటు మేత కూడా ఏనుగులకు అనుకూలంగా మారడంతో ఈ ప్రాంతంలోనే శనివారం సాయంత్రం వరకు తిష్ట వేసి ఉన్నట్లు అటవీశాఖ బీట్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఎలిఫెంట్ ట్రాకర్స్ ఆధ్వర్యంలో ఏనుగుల సంచారం గమనిస్తూనే ఉన్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ పరిసరాల్లో ఉండే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఘనంగా సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవం

**విజయవాడ (బీసెంట్ రోడ్డు) (నేటి మనదేశమ్) :** విజయవాడ హాకర్స్, తోపుడబండ్లు యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడ బీసెంట్ రోడ్డులో శనివారం రామాలయం సెంటర్ లో సిఐటియు జెండాను ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి. హెచ్. శ్రీనివాస్ ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. సి. హెచ్. శ్రీనివాస్, విజయవాడ సెంట్రల్ సిటి ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు మాట్లాడుతూ .... ప్రతి సంవత్సరం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నప్పటికీ మన ముందు ఉన్న కర్తవ్యం కార్మిక సంఘం ఐక్యతకు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సిఐటియు 1970లో ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు.

# బిందెడు నీటికి తప్పని ఇక్కట్లు



**పెదబయలు, మే 31 (నేటి మనదేశమ్) :** మన్యంలో తాగునీటి కష్టాలు అన్నీఇన్నీ కావు. ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో మారు మూల గ్రామాల్లో ఊటలు సైతం ఎండి పోతున్నాయి. పెద బయలు మండలం మారు మూల బొంగరం పంచాయతీ తీముల వార గ్రామంలో కుళాయిలు పాడ వడంతో గ్రామస్థులకు ఊటనీరే దిక్కవుతోంది. ఇంకి పోతున్న ఊట వద్ద బిందెడు నీరు పట్టడానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఉపయోగం లేకపోయిందని, ఇప్పటికైనా స్పందించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు బూడిద మాధవరావు, బాబూజీ, కిషోర్, గ్రామస్థులు కోరారు.

# పద్మనాభస్వామి ఆలయంలో వస్తువుల మాయంపై విచారణ

## కేరళ దేవాదాయశాఖ మంత్రి వెల్లడి



**తిరువనంతపురం, మే 31 (నేటి మనదేశమ్) : :** కేరళలోని పద్మనాభస్వామి ఆలయంలో విలువైన వస్తువులు అదృశ్యం కావడం, భద్రతా లోపాలపై విచారణ జరిపిస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కె.మురళీధరన్ శనివారం వెల్లడించారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, ఆలయ ఆస్తుల విషయంలో ఎవరి జోక్యాన్ని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఆలయ పరిపాలన కమిటీ నుంచి తాము కోరిన నివేదిక అందిందని, హోం మంత్రిత్వ శాఖతో చర్చించిన అనంతరం విచారణ గురించి అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. శబరిమల ఆలయంలో బంగారం అవకతవకలపై సిట్ జరుపుతున్న విచారణ తమ ప్రభుత్వానికి సంతృప్తికరంగా లేదని మురళీధరన్ చెప్పారు. స్వయానా హైకోర్టు సిట్ నియామకం జరిపినందున దానిని మార్చే అధికారం ప్రభుత్వానికి ఉండదని పేర్కొన్నారు.

**ఆరోపణలను ఖండించిన ఆలయ కమిటీ, రాజ కుటుంబం**

పద్మనాభస్వామి ఆలయంలో వజ్రాల నగతోసహా విలువైన వస్తువులన్నీ నిక్షే పంగా ఉన్నాయని, నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా ఆడిటింగ్ జరిపి స్తున్నట్లు ఆలయ కమిటీ చెబుతోంది. వస్తువుల అదృశ్యంపై పోలీసుల ఆరోపణలను ఖండించింది. తమ పరిధిలోని ఆలయాల్లో గల ఖరీదైన వస్తువులు, ఆస్తులు, ఇతర లావాదేవీల విలువను ఖరారు చేసి ఆ వివరాలను డిజిటల్‌గా భద్రపరుస్తామని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె.జయకుమార్ శనివారం వెల్లడించారు. ట్రావెన్‌కోర్ రాజ కుటుంబం సైతం పద్మనాభస్వామి ఆలయంలో విలువైన వస్తువుల అదృశ్యం ఆరోపణలను తిరస్కరించింది. ఈ కుటుంబ సభ్యుడు ఆదిత్య వర్మ పోలీసు నివేదికను ఏకపక్షంగా పేర్కొంటూ, దాని విశ్వసనీయతను ప్రశ్నించారు. తాము వ్యక్తిగత తనిఖీ నిర్వహిం చామని, పోయాయని చెబుతున్న వస్తువులు గర్భగుడి వద్ద భద్రంగా ఉన్నాయని తెలిపారు.

# ఉరుములు, మెరుపుల బీభత్సం..

## నేలకూలిన పురాతన వృక్షం



**మహానంది, మే 31 (నేటి మనదేశమ్) :** మహానంది మండలం గాజులపల్లి గ్రామంలోని పెద్ద మౌలాలి స్వామి పీర్లచావిడి పక్కన ఉన్న దస్తగిరి స్వామి దర్గా వద్ద సుమారు 200 ఏళ్ల నాటి వేపవృక్షం శనివారం తెల్లవారు జామున నేల కూలింది. ఈ ఘటనలో టీ బంకు, విద్యుత్ స్తంభం ధ్వంసమయ్యాయి. దారిన వెళ్లే కొందరికి చెట్టు కొమ్మలు తగిలి స్వల్ప గాయా లయ్యాయి. సమాచారం అందుకున్న మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రభా కర్ రెడ్డి వారి సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు.

## కరాటే గ్రేడింగ్‌లో వేములవాడ విద్యార్థుల ఘనత

**- 10 మందికి బ్లాక్ బెల్ట్!**
**- 3 బ్రౌన్ బెల్టులు కైవసం**
**- సిపి గౌస్ ఆలం ప్రత్యేక అభినందనలు**



**కరీంనగర్, మే 31: నేటి మన దేశం ప్రతినిధి** ఉమ్మడి జిల్లా స్థాయి బ్లాక్ బెల్ట్ కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో వేములవాడ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటారు. కరీంనగర్ పట్టణంలోని వివేకానంద స్కూల్లో శనివారం సాయంత్రం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు.వేములవాడ ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ అబ్దుల్ మన్నన్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ పరీక్షల్లో అద్భుత ప్రదర్శన చేశారు. మొత్తం 10 మంది విద్యార్థులు ప్రతిష్ఠాత్మక 'బ్లాక్ బెల్ట్' సాధించగా, మరో ముగ్గురు విద్యార్థులు 'బ్రౌన్ బెల్ట్' కైవసం చేసుకున్నట్లు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ కే. వసంత్ కుమార్ వెల్లడించారు.పోలీస్ కమిషనర్ కరాటే గ్రేడింగ్‌లో ఘన విజయం సాధించిన వేములవాడ విద్యార్థులను కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ విద్యలు ఎంతో అవసరమన్నారు. కరాటే నేర్చుకోవడం ద్వారా యువతలో క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం, ఆత్మస్థైర్యం పెంపొందుతాయని ఆయన కొనియాడారు. విద్యార్థులు ఇలాగే రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.బ్లాక్ బెల్ట్ సాధించిన వారిలో మొహమ్మద్ అబ్దుల్ ఫర్హాన్ అబ్బాసి, పి. భాస్కర్, కే. సాయి మణిరూప్, కె. సాయి మణి హర్షిత్, ఎస్. కె. షఫీక్, ఎస్. కె. తన్ హాజ్, సి.హెచ్. సూర్య సుశీల్, వి. శివహిత్, వి. షిరిహాస్, మరియు జి. వివేకా శ్రీ.బ్రౌన్ బెల్ట్ సాధించిన వారు: పి. జానవి, పి. వర్షిత్ కుమార్, సిద్ధు ఉన్నారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు, శిక్షకులు పుల్గారి శ్రీనివాస్, మద్దిపల్లి శ్రీనివాస్, కనికరపు రాజశేఖర్, కే. రాజశేఖర్ తదితరులు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్టులను అందజేసి అభినందనలు తెలిపారు.

## పాలమూరు-రంగారెడ్డి సహా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

**అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**మహబూబ్‌నగర్,జిల్లా మే 31 (నేటి మనదేశమ్):** ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు అన్ని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి చరిత్రలో నిలిచిపోయేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.శనివారం దేవరకద్ర మండలంలోని అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రూ.32.05 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా అజిలాపూర్, గద్దెగూడెం, వెంకటాయపల్లి గ్రామాలకు చెందిన 1,400 ఎకరాల ఆయకట్టుకు కోయిల్‌సాగర్ నుంచి సాగునీరు అందనున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని మంత్రి విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తైందన్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని, ఇప్పటివరకు ఒక్క ఎకరానికీ నీరు అందలేదన్నారు.జూన్ 4, 5 తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, నార్లాపూర్, ఉద్దండాపూర్ రిజర్వాయర్లను సందర్శించి పెండింగ్ పనులను సమీక్షిస్తామని తెలిపారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్, బిల్లుల చెల్లింపులకు అవసరమైన నిధులు విడుదల చేసి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు.వచ్చే రెండున్నరేళ్లలో కొడంగల్, నారాయణపేట, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ జానకి తదితరులు పాల్గొన్నారు

## .ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ దేశానికే ఆదర్శం

**రైతుల చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: మంత్రి వాకిటి శ్రీహరి**




**మహబూబ్‌నగర్,జిల్లా మే 31 (నేటి మనదేశమ్):** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, ఇందుకోసం 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధాన్యం రవాణాకు 13 వేల లారీలను వినియోగించామని, రెండు లక్షల మంది సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొన్నారని చెప్పారు.గత రెండేళ్లలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.98,600 కోట్లను చెల్లించినట్లు వెల్లడించారు. రైతుల ఖాతాల్లో కొనుగోలు చేసిన 48 గంటల్లోనే నగదు జమ చేసినట్లు పేర్కొన్నారు. రైతు పక్షపాత ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరిన మంత్రి, గ్రామాల్లో పోస్టర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.కేంద్ర ప్రభుత్వం కేవలం 38 శాతం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తుండగా, మిగిలిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని, దీనివల్ల రాష్ట్రంపై రూ.16,479 కోట్ల అదనపు భారం పడిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పాలమూరు ప్రాంతం ప్రస్తుతం అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## మహిళా సాధికారత, ఆర్థిక క్రమశిక్షణ మరియు కుటుంబాల ఎదుగుదల గురించి మాట్లాడిన మునిసిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్




**కామారెడ్డ్,మే 31.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** మునిసిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాటలదుతూ మహిళా సాధికారత -- ఒక గొప్ప మార్పు, నాడు - నేడు: ఒకప్పుడు మహిళలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు వెనుకాడే పరిస్థితి ఉండేది. కానీ నేడు పురుషులు తమ భార్యల పేర్లు చెప్పి, వారు ఏ సంఘంలో ఉన్నారో తెలియజేస్తూ లోన్ల కోసం అడిగే స్థాయికి మార్పు వచ్చింది. ఇది మహిళా సాధికారతకు ఒక నిదర్శనం.రు 535.30 కోట్ల పంపిణీ: బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు ఇంత భారీ మొత్తంలో రుణాలు అందించడం చాలా గర్వకారణం. కాంగ్రెస్ ప్రభుత్వ చేయూత: గౌరవ మంత్రి సీతక్క ప్రతి చిన్న సంఘానికి 10 లక్షల రూపాయల వడ్డీ లేని రుణం అందించడం విశేషం.1. రుణాల సద్వినియోగం మరియు ఆర్థిక ప్రణాళికతీసుకున్న రుణాన్ని అప్పుల పాలు కాకుండా, కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎలా వాడాలో చైర్మన్ స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చారు: 50 శాతం వ్యాపార అవసరాలకు యాక్టివిటీ బేసిడ్: లోన్ మొత్తంలో సగం డబ్బును ఖచ్చితంగా ఏదైనా వ్యాపారం లేదా ఉపాధి మార్గాల కోసం పెట్టుబడిగా పెట్టాలి. మిగతా 50 శాతం కుటుంబ అవసరాలకు: మిగిలిన సగాన్ని పిల్లల చదువులు, వైద్యం మరియు నిత్యవసరాల వంటి ముఖ్యమైన వాటికి ఉపయోగించాలి.వాయిదాల చెల్లింపు : లక్ష రూపాయల రుణానికి నెలకు దాదాపు రు 4,000 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. ఈ వాయిదా కట్టడానికి మళ్లీ కొత్త అప్పులు చేయకూడదు. వ్యాపారం ద్వారా వచ్చే లాభాల నుంచే క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించాలి.1. పిల్లల చదువు మరియు తల్లే మొదటి గురువు పిల్లలను ఉన్నత చదువులు చదివించి, రాబోయే తరానికి ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దే బాధ్యత తల్లులపైనే ఉంది. ఒక కుటుంబం బాగుండాలి అంటే అది మొదట తల్లితోనే ప్రారంభం అవుతుంది అని మహిళలు నిరూపించాలి. మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు అధికారులు కేవలం రుణాలు ఇవ్వడంతోనే తమ బాధ్యత ముగిసిందని అనుకోకూడదు.

మహిళలు చేసుకున్న - మైక్రో క్రెడిట్ ప్లాన్ అనగా రుణ ప్రణాళికఆధారంగానే గ్రౌండ్ అయ్యేలా చూడాలి. లోన్ తీసుకున్న వారు దానిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో నిరంతరం గమనిస్తూ, వారు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా సిబ్బంది మార్గదర్శకత్వం వహించాలి."డబ్బు ఎంత తీసు కొన్నామన్నది కాదు, దాన్ని ఎంత క్రమశిక్షణతో వాడామన్నదే ముఖ్యం. మున్సిపాలిటీలోని ప్రతి కుటుంబం ఆర్థిక అక్షరాస్యత సాధించి ఒక మహావృక్షంలా మారినప్పుడే దేశంలో పేదరికం అంతమై అభివృద్ధి సాధ్యమవుతుంది." ప్రభుత్వ పథకాలు ప్రతి 18 సంవత్సరాలు నిండిన మహిళకు ఉచిత శిరల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది .అదేవిధంగా సమాఖ్యల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి వారికి నెలకు 69 వేల పైబడి ఏడు సంవత్సరాల వరకు ప్రతినెల వడ్డీ చెల్లించడం జరుగుతుంది. ఆ విధంగా సమాఖ్యలను మెరుగుపరుస్తుంది కాంగ్రెస్ గవర్నమెంట్ . పెట్రోల్ బంకులు సమాఖ్య లకు ఇచ్చి ఆదాయాన్ని తెచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది ముఖ్యంగా సామాజిక కార్యక్రమాల్లో ముందు మన తల్లి పై మనం ఎంత ప్రేమ చూపిస్తాము ఆలోచించి మీ అత్తమామలను కూడా అదే విధంగా చూస్తూ వారి వృద్ధాప్య జీవితానికి చేదోడు వాదోడుగా ఉండాలి అనాధ శరణాలకు షణార్థి చెప్పి మన ఇంట్లోనే మనతోనే ఉంచుకొని వారితో కాసేపు మాట్లాడినట్లయితే వాళ్ళ ఆయుష్షును పెంచిన వాళ్ళము వారి ఆనందాలకు అవకాశం ఇచ్చిన వారిమవుతాము ఇలాంటి కార్యక్రమాలు మహిళలతో స్టార్ట్ అవుతే మహిళల పేరు మరి ఎక్కువగా మారుమోగుతాయి కావున ఇలాంటి వాటిని కూడా మనం అదుపులోకి తీసుకోవాలని తమరికి తెలియ పరుస్తున్నానుప్రభుత్వం ఇచ్చే ప్రతిఫలాన్ని అందుకొని మీ కుటుంబాలు ఆనందముగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ గీరి,స్థానిక కౌన్సిలర్ గ్యార అఖిల,మెప్మా పిడి శ్రీధర్ రెడ్డి,టి యం సి రవి శేంకర్, జూ సి ఓ అనసూయ, రిసోర్స్ పర్సన్స్, పట్టణ సమాఖ్య కార్యవర్గ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 'రహదారి వీరుల' పథకంపై కలెక్టర్ సమీక్ష

**ప్రమాద బాధితులను కాపాడితే రూ. 25,000 బహుమతి**



**కామారెడ్డ్,మే 31.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**రహదారి ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడేందుకు ఉద్దేశించిన 'రహదారి వీరుల' (రహవిర్) పథకాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ పథకం అమలు తీరు పై ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా ప్రజలు తక్షణమే స్పందించి బాధితులకు సాయం చేయాలని, ప్రతి ఒక్కరూ 'రహదారి వీరులు'గా మారాలని పిలుపునిచ్చారు.ప్రమాదంలో ఉన్నవారిని సకాలంలో కాపాడిన వారికి ప్రభుత్వం తరపున రూ. 25,000 నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటుఈ పథకాన్ని పారదర్శకంగా పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో 'డిస్ట్రిక్ట్ అప్రిసియేషన్ కమిటీ' ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా, సభ్యులుగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ , జిల్లా రవాణా అధికారి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తారని ఆయన వెల్లడించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు, బాధితులకు తక్షణ వైద్యం అందేలా చూసేందుకు ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## రాష్ట్ర వాషర్‌మెన్ కార్పొరేషన్ నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం




**మహబూబ్‌నగర్ మే 31 (నేటి మనదేశమ్):** జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర వాషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్ కుమార్, వైస్ చైర్మన్ బంగారు బాబులను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రజకుల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం నూతన నాయకత్వం సమర్థవంతంగా పనిచేసి సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధు, రజక సంఘం నాయకుడు భరత్ కుమార్‌తో పాటు రజక సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్ అజయ్ కుమార్, వైస్ చైర్మన్ బంగారు బాబులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలు రజక సమాజ అభివృద్ధికి దోహదపడాలని నాయకులు ఆకాంక్షించారు.

## సిసి రోడ్ ప్రారంభించారు



**కామారెడ్డ్,మే 31.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో 7వ వార్డు లో నూతన సిసి రోడ్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ మరియు వైస్ చైర్మన్ శ్రీమతి మాత్తమల భాగ్యవతి మరియు కౌన్సిలర్లు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## కన్కల్ తాడ్వాయి కృష్ణాజివాడి లో గ్రామ దేవతలకు బోనాలు



**కామారెడ్డ్,మే 31.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం లోని కన్కల్ తాడ్వాయి కృష్ణాజివాడి పలు గ్రామాలలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు గ్రామస్తులు మాట్లాడుతూ నాలో పండుగను గ్రామదేవతలు ప్రతి ఏటా ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు ఆషాడ మాసంలో గ్రామస్తులు ఏకమై అమ్మవారి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. బోనాలు సమర్పణ మహిళలు కొత్త కుండలతో అన్నం పాలు బెల్లంతో బోనాలన్నీ వండి పసుపు కుంకుమ వేప ఆకులతో అలంకరించి తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు ప్రత్యేక పూజలు అమ్మవారికి బోనాలతో పాటు పట్టు వస్త్రాలు గాజులు సమర్పించి గ్రామ సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తారు. డప్పు వాయిద్యాలు పోతరాజు విన్యాసాల శివ సొత్తుల నత్యాలతో ఈ వేడుకలు ప్రత్యేక ఆకాశగా నిలుస్తాయి అంతేకాకుండా గ్రామంలో కోరిన కోరికలు తీర్చే దేవతలుగా నల్ల పోచమ్మ నాయకమ్మ ముత్యాలమ్మ బంగారు మైసమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు పాడిపంట గుడ్డు గోదా. పిల్ల పాపలు సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు మంచిగా కురవాలని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా లో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు- జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర




**కామారెడ్డ్,మే 31.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (జూన్ 1వ తేది నుండి 30 వరకు) జిల్లా వ్యాప్తం గా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపినారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపినారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపినారు.అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఉద్యోగుల మే నెల వేతనం నుండి ఈ హెచ్ ఎస్ కోసం 1.5 శాతం వేతనాన్ని బలవంతంగా మినహాయింపు చేయడాన్ని టిపిటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తుంది


**జిల్లా అధ్యక్షులు చింతల లింగం**



**కామారెడ్డ్,మే 31.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతల లింగం,జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూకామారెడ్డి జిల్లా కేంద్రంలోని విధివిధానాలు రూపొందించకుండా మినహాయించిన వేతనాన్ని ఉద్యోగుల ఎకౌంటుకు జమ చేయాలి.ప్రభుత్వం ఎంప్లాయిస్ ఆరోగ్య పథకం కోసం ఉద్యోగుల మే నెల వేతనం నుండి ఒకటి పాయింట్ ఐదు శాతం మినహాయిస్తూ పేస్లిప్స్ జనరేట్ చేశారు. ఆరోగ్య పథకానికి సంబంధించి విధివిధానాలు రూపొందించకుండా, కనీసం డ్రాయింగ్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం దొడ్డిదారిన ఉద్యోగుల వేతనం నుండి 1.5 శాతం మినహాయింపు చేయడాన్ని టిపిటిఎఫ్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాము.రాష్ట్రంలోని ఏ హాస్పిటల్స్ లో ఈ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తున్నారనే స్పష్టత లేదు. భార్యాభర్తలు ఉద్యోగులైన సందర్భాలలో, తల్లిదండ్రులు ఉద్యోగులైన సందర్భాల్లో, వేతన మినహాయింపులు ఏ విధంగా చేస్తారనే నిబంధనలు రూపొందించకుండానే ప్రతి ఉద్యోగం నుండి మినహాయింపు చేశారు. ఇది అక్రమమైన చర్యగా భావిస్తున్నాము.హెల్త్ కార్డులు జారీ చేయకుండా, టీచర్ల సమ్మతి తీసుకోకుండా మినహాయించిన 1.5 శాతం వేతనాన్నీ ఉద్యోగుల ఎకౌంటుకు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేస్తున్నాము.లేనట్లయితే ప్రభుత్వ అసంబద్ధ విధానాల పైన టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని. టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతల లింగం,జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# ఎటూ తేల్చని ట్రంప్

## ఇరాన్‌తో ఒప్పందంపై తొలగని ప్రతిష్టంభన



వాషింగ్టన్: ఇరాన్‌తో యుద్ధ విరమణను మరో 60 రోజులు పొడిగించేందుకు, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. శ్వేతసౌధంలోని సిచ్యుయేషన్ రూమ్‌లో శుక్రవారం తన సలహాదారులతో సమావేశమైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒప్పందంపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు. రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఇరాన్ అణుశుద్ధి కార్యక్రమంపైనే ఎక్కువ చర్చ జరిగింది. ఈ అణు కార్యక్రమాన్ని ఆపితేనే తుది ఒప్పందం కుదురుతుందని అమెరికా అధికార వర్గాలు చెబుతున్నాయి. అణుబాంబు తయారు చేయనన్న హామీ ఇరాన్ ఇవ్వాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. టెహ్రాన్ మాత్రం ఇందుకు ససమేమిరా అంటోంది. "మేం యుద్ధం ముగించే అంశంపైనే దృష్టి పెట్టాం. ప్రస్తుతం అణు ప్రణాళికపై చర్చించడం లేదు" అని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. ఏ ఒప్పందం కుదిరినా.. అందులో ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య సంధి కూడా ఉండాలని ఇరాన్ పట్టుబడుతోంది. మరోవైపు దక్షిణ లెబనాన్‌లోకి ఇజ్రాయెలీ సైన్యం చొచ్చుకు పోతోంది. నబాటియా నగరం దిశగా ఆ దేశ సైనికులు కదులుతున్నారు. నబాటియా.. లెబనాన్‌లో ఐదో అతి పెద్ద నగరం. అంతేకాదు.. హెజ్‌బొల్లా గట్టి మద్దతు దారులు ఉన్న ప్రాంతం కూడా. ఇజ్రాయెల్ దాడుల్లో దక్షిణ లెబనాన్‌లో ముగ్గురు చనిపోయారు. ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాలపై శనివారం కూడా హెజ్‌బొల్లా రాకెట్ల దాడులు కొనసాగాయి. హర్మూజ్‌పై తాము కొనసాగిస్తున్న దిగ్బంధనాన్ని ఉల్లంఘించడానికి ప్రయత్నించిన ఓ వాణిజ్య నౌకను అడ్డుకున్నామని అమెరికా సైన్యం శనివారం తెలిపింది.

## జన్యుపరీక్షల సంస్థ


# '23అండ్ మీ' పై దావా




లాస్ ఏంజెల్స్ : కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బోంటా ప్రముఖ జన్యు పరీక్షల సంస్థ '23అండ్ మీ' పై గురువారం దావా వేశారు. 2023లో దేశవ్యాప్తంగా దాదాపు 70 లక్షల మంది వినియోగదారుల సున్నితమైన జన్యు, ఆరోగ్య డేటా ఉల్లంఘనకు గురవడానికి కంపెనీ నిర్లక్ష్యమే కారణమని, వినియోగదారుల సమాచారాన్ని రక్షించడంలో సంస్థ పూర్తిగా విఫలమైందని ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ఉల్లంఘనకు గానూ కంపెనీపై భారీ సివిల్ జరిమానాలు విధించాలని, అలాగే భవిష్యత్తులో కాలిఫోర్నియా గోప్యతా పరిరక్షణ చట్టాలను ఉల్లంఘించకుండా ఆదేశాలు జారీ చేయాలని అటార్నీ జనరల్ కోర్టును కోరారు. తమ వినియోగదారులకు వారి పూర్వీకుల వివరాలు, జన్యుపరమైన ఆరోగ్య సమస్యల సమాచారాన్ని అందించే ఈ సంస్థ, గత మార్చిలో దివాలా తీసిన తర్వాత తన పేరును క్రోమ్ హోల్డింగ్ కో.గా మార్చుకుంది. 2023లో జరిగిన ఈ సైబర్ దాడిలో హ్యాకర్లు "క్రెడెన్షియల్ స్టఫింగ్" విధానాన్ని ఉపయోగించారు. వినియోగదారులు బలహీనమైన పాస్‌వర్డ్‌లను వాడటం లేదా బహుళ ఖాతాలకు ఒకే పాస్‌వర్డ్‌ను ఉపయోగించడాన్ని ఆసరాగా చేసుకుని ఈ దాడికి పాల్పడ్డారు. ముఖ్యంగా, అక్టోబర్ 2017లో 23అండ్ మీ మాజీ భాగస్వామి 'మైహెరిటేజ్' సంస్థలో జరిగిన భారీ డేటా ఉల్లంఘనకు సంబంధించిన దొంగిలించబడిన క్రెడెన్షియల్స్‌ను హ్యాకర్లు ఇక్కడ ఉపయోగించినట్లు తేలింది. ఆ ఉల్లంఘన జరిగినప్పటికీ, 23అండ్ మీ తన కస్టమర్ల పాస్‌వర్డ్‌లను రీసెట్ చేయమని అడగకపోవడం లేదా మల్టీఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేయకపోవడం వంటి ప్రాథమిక భద్రతా నియమాలను విస్మరించిందని బోంటా కార్యాలయం ఆగ్రహం వ్యక్తం చేసింది.డేటా లీక్ అయిన విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత కూడా 23అండ్ మీ యాజమాన్యం ఉల్లంఘన తీవ్రతను దాచిపెడుతూ వినియోగదారులను తప్పుదోవ పట్టించిందని దావాలో పేర్కొన్నారు. అక్టోబర్ 2023లోనే తమకు ఈ విషయం తెలిసిందని కంపెనీ చెబుతున్నప్పటికీ, అంతకు కొన్ని నెలల ముందే వచ్చిన హెచ్చరిక సంకేతాలను సంస్థ పట్టించుకోలేదని ప్రాసిక్యూటర్లు వాదించారు.

జూలైలో లాగిన్ ప్రయత్నాలలో అనుమానాస్పద పెరుగుదల కనిపించినా, ఆగస్టులో డేటా లీకేజీ గురించి రెడ్డిట్ పోస్ట్‌లో చర్చలు నడిచినా కంపెనీ స్పందించలేదని మండిపడ్డారు. జన్యు డేటాకు అత్యున్నత స్థాయి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాలిఫోర్నియా చట్టాల ప్రకారం కంపెనీలపై ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కంపెనీ చాప్టర్ 11 దివాలా ప్రక్రియలో ఉన్నందున, వినియోగదారుల జన్యు సమాచారాన్ని మూడవ పక్షాలకు అమ్మే ముందు కాలిఫోర్నియా జన్యు సమాచార గోప్యతా చట్టం ప్రకారం వారి సమ్మతి తప్పనిసరిగా తీసుకోవాలని అటార్నీ జనరల్ బోంటా పేర్కొన్నారు.

# మాజీ గూఢచారి అధికారి ఇంట్లో భారీ బంగారం..!



అమెరికా : అమెరికాకు చెందిన ప్రముఖ గూఢచర్య సంస్థలో పనిచేసిన మాజీ అధికారి డేవిడ్ రష్ వ్యవహారం సంచలనంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా నిఘా సమాచార సేకరణలో పేరొందిన ఈ సంస్థకు చెందిన మాజీ ఉద్యోగి ఇంట్లో భారీగా బంగారం, నగదు బయటపడటంతో అధికారులు విస్తుపోయారు. దర్యాప్తులో భాగంగా అతని నివాసంలో తనిఖీలు నిర్వహించిన ఎఫ్‌బిఐ అధికారులు ఒక్కొక్కటి కిలో బరువున్న 300 బంగారు బిస్కెట్లను గుర్తించారు. వీటితో పాటు 35 ఖరీదైన విలాసవంతమైన గడియారాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన అత్యంత ఖరీదైన నమూనాలు ఉన్నట్లు వెల్లడించారు. అదనంగా సుమారు 20 లక్షల డాలర్ల నగదును కూడా అధికారులు స్వాధీనం చేసు కున్నారు. ఈ వ్యవహారంలో డేవిడ్ రష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

**ప్రజా ధనం దుర్వినియోగం ...**

దర్యాప్తు సంస్థల వివరాల ప్రకారం .... డేవిడ్ రష్ గూఢచర్య సంస్థలో పనిచేసిన సమయంలో అధికారిక అవసరాల పేరుతో 2025-26 మధ్య ప్రభుత్వ వనరుల నుంచి భారీ మొత్తంలో బంగారం, నగదు పొందినట్లు గుర్తించారు. అయితే ఆ నిధులు, ఆస్తులు ఎక్కడ వినియోగించబడ్డాయన్న వివరాలు అధికారిక లెక్కల్లో కనిపించలేదని ఎఫ్‌బిఐ తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడనే ఆరోపణలపై అతనిపై కేసు నమోదు చేశారు. అధికారిక కార్యక్రమాల కోసం కేటాయించిన ఆస్తులను రహస్యంగా తన వ్యక్తిగత ఆధీనంలో ఉంచు కున్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు అధికారులు వెల్లడించారు.

**అమెరికా నౌకాదళంలో డేవిడ్ రష్** డేవిడ్ రష్ గతంలో అమెరికా నౌకాదళంలో కూడా సేవలందించాడు. తాను అక్కడ వైమానిక సిబ్బందిగా పని చేశానని చెప్పుకున్నప్పటికీ, అందుకు సంబంధించిన వివరాలు సరిపోలలేదని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. నౌకాదళంలో పనిచేసిన కాలానికి సంబంధించిన కొన్ని అక్రమాలపై కూడా పరిశీలన కొనసాగుతోంది.అలాగే గూఢచర్య సంస్థలో అతను నిర్వహించిన కచ్చితమైన బాధ్యతలపై కూడా అధికారులు స్పష్టత కోసం విచారణ జరుపుతున్నారు.

**అలెగ్జాండ్రియాలో విచారణ ...**

వర్జీనియా రాష్ట్రంలోని అలెగ్జాండ్రియా నగరంలో ఈ కేసుకు సంబంధించిన విచారణ కొనసాగనుంది. అతని ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం విలువ సుమారు 4 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.382 కోట్లకు సమానం. ఈ ఘటన వెలుగులోకి రావడంతో సంస్థలో నిధుల వినియోగం,వ్యయాల నిర్వహణపై సమగ్ర అంతర్గత సమీక్ష చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ అంశంపై సంస్థ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

# అమెరికాలో రసాయన లీకేజీ ప్రమాదం

## 11కి చేరిన మృతుల సంఖ్య



వాషింగ్టన్ : అమెరికాలోని కాగితపు కర్మాగారంలో రసాయనాల లీకేజీ జరిగింది. వాషింగ్టన్ రాష్ట్రంలోని లాంగ్‌వ్యూలో ఉన్న ప్లాంట్‌లోని పదివేల గ్యాలన్ల యాసిడ్ తరహా రసాయనంతో కూడిన భారీ ట్యాంక్ మంగళవారం పేలిపోయింది. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 11కి చేరినట్లు అధికారులు శనివారం తెలిపారు. గల్లంతైన తొమ్మిది మంది మృతదేహాలను వెలికి తీశారని అన్నారు.నిప్పాన్ డైనావేవ్ ప్యాకేజింగ్ కంపెనీలో తెల్లవారుజామున షిఫ్టులు మారే సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, ఆ సమయంలో 9,00,000 గ్యాలన్ల (3.4 మిలియన్ లీటర్ల) 'వైట్ లిక్కర్' నిల్వ ఉన్న భారీ ట్యాంకు ఒక్కసారిగా పేలిపోయిందని అన్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, తొమ్మిది మంది గల్లంతయ్యారని అన్నారు. ఈ ఘటనలో గల్లంతైన తొమ్మిదవ, చివరి ఉద్యోగిని తాము గుర్తించామని లాంగ్‌వ్యూ ఫైర్ డిపార్ట్‌మెంట్ ఫైర్ చీఫ్ బ్రాడ్ హానిగ్ ఒక విలేకరుల సమావేశంలో తెలిపారు. వైట్ లిక్కర్ అనేది సోడియం హైడ్రాక్సైడ్ మరియు సోడియం సల్ఫైడ్‌లను కలిగి ఉండే అత్యంత క్షార ద్రావణం. దీనిని చెక్కలను విచ్ఛిన్నం చేసి, కాగితం తయారీకి అవసరమైన గుజ్జును తయారు చేసుందకు వినియోగిస్తారు.

# హోర్ముజ్ జలసంధి దాటుతున్న అమెరికా నౌకలపై ఇరాన్ దాడి



టెహ్రాన్ : యుద్ధాన్ని ముగించడానికి అమెరికా -- ఇరాన్‌ల మధ్య ఒప్పందం కుదుర్చోవడానికి చర్చలు పురోగతిలో సాగుతున్నాయని మీడియాలో వార్తాలస్తున్నాయి. ఇదిలా ఉండగా.. అమెరికా ఒప్పందానికి రెడీ అని చెబుతూనే మరోవైపు ఇరాన్‌పై దాడులకు పాల్పడుతూ దాని ద్వంద్వ స్వభావాన్ని బయటకు వెల్లడిస్తోంది. బుధవారం దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని బందర్ అబ్బాస్ అంతర్జాతీయ విమానాశ్రయంపై అమెరికా సైన్యం వైమానిక దాడులు చేసింది. దీనికి ప్రతి దాడిగా.. ఇరాన్ గురువారం హోర్ముజ్ జలసంధిని దాటుతున్న నాలుగు అమెరికా నౌకలపై ఇరాన్ దళాలు కాల్పులు జరిపాయి. ఈ విషయాన్ని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) వెల్లడించింది. గురువారం ఉదయం తెల్లవారుజామున 4.50 గంటల సమయంలో అమెరికా నౌకలపై ఇరాన్ సైన్యం దాడికి పాల్పడినట్లు ప్రభుత్వ మీడియా ఐఆర్ఐబి కూడా నివేదించింది.


# కొలంబియా సమీపంలో పసిఫిక్‌లో నౌకపై అమెరికా దాడి : ముగ్గురు మృతి



వాషింగ్టన్ : నార్కో టెర్రరిజం ఆరోపణలతో కొలంబియా సమీపంలోని పసిఫిక్ మహా సముద్రంలోని నౌకపై సంయుక్త సైనిక దళం దాడి జరిపింది. ఈ దాడలో మగ్గురు మృతి చెందారు అని అమెరికా దక్షిణ కమాండ్ శుక్రవారం ప్రకటించింది. ఈ వారాంతంలోనే ఇది అమెరికా సైన్యం దాడి చేయడం మూడోసారి. నార్కో టెర్రరిజాన్ని అంతమొందించడానికి ఆపరేషన్ సదరన్ స్పియర్ పేరిట అమెరికా దాడులు చేస్తోంది. ఇప్పటి వరకు ఈ ఆపరేషన్ 190 మంది మీతి చెందారు. పది మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ఈ మంగళవారం జరిపిన దాడిలో ఇద్దరు ప్రాణాలతో బయట పడ్డారు.

# కాంగోలో ఎబోలా లక్షణాలతో 220 మంది మృతి

## డబ్ల్యూహెచ్‌ఓ




జెనీవా : ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరిస్తున్న ఎబోలా మహమ్మారి లక్షణాలతో డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్ సి)లో 220 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) చీఫ్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రేయెసస్ ప్రకటించారు. అలాగే కేసుల సంఖ్య 990కు చేరినట్లు తెలిపారు. ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని, ప్రపంచ దేశాలు ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కాంగో ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఇప్పటివరకు 101 నిర్ధారించిన కేసులు, 10 మరణాలు నమోదైనప్పటికీ, వాస్తవ పరిస్థితి ఇంతకంటే చాలా తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ మహమ్మారిని అదుపులోకి తీసుకు రావడానికి కాంగో ఆరోగ్య శాఖ అధి కారులు తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ నెల 17న ఎబోలా కారణంగా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని డబ్ల్యూహెచ్ ఓ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎబోలో వైరస్ ఉగాండాకు కూడా వ్యాపించింది. ఇప్పటి వరకూ ఉగాండాలో ఐదు కేసులు నమోదు కాగా ఒకరు చనిపోయారు. కాగా, బండిబుగ్యో ఎబోలా వైరస్ కు డబ్ల్యూహెచ్ ఓ ఆమోదించిన వ్యాక్సిన్‌లు, చికిత్సలు ఏవీ లేవు. ఈ రకం వైరస్ గతంలో కేవలం రెండుసార్లు మాత్రమే వ్యాప్తి చెందింది. 2007లో ఉగాండా లోనూ, 2012లో కాంగా లోనూ ఇది వ్యాప్తి చెందింది. ప్రస్తుతం ఎబోలా వ్యాప్తిని అరికట్టడానికి డబ్ల్యూహెచ్ ఓ కట్టుబడి ఉందని టెడ్రోస్ ఈ సందర్భంగా తెలిపారు.

# ఉగ్రవాదులకు సాయంగా

## భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు : పాక్ దుశ్చర్య



ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్ వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడు తోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా సెల్యూలర్ సంకేతాలను పంపి స్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగపడు తోందని అధికారులు వెల్లడించారు. ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అను మానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వత శ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి. ముఖ్యంగా కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి. పాకిస్థాన్ టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఉగ్రవాదులు వాడే వైఎస్ఎంఎస్‌కు ఉపయోగపడుతుంది. సీడీఎంఏ పలు సిగ్నల్స్‌ను ఏకకాలంలో అనుమతిస్తుంది. దీంతో భద్రతా ఏజెన్సీల ఎలక్ట్రానిక్ మానిటరింగ్ సమస్యాత్మకంగా మారుతుంది.


# అందరూ స్వదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు

## గ్రీన్‌కార్డు దరఖాస్తుపై అమెరికా వివరణ




వాషింగ్టన్: అగ్రరాజ్యంలో శాశ్వత నివాస హక్కు కల్పించే గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోగోరే వలసదారులందరూ స్వదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని అమెరికా స్పష్టం చేసింది. దరఖాస్తు ప్రక్రియ జరుగుతున్న సమయంలో అమెరికాలోనే ఉంటూ వేచిచూడొచ్చని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ తాజాగా వెల్లడించింది. దరఖాస్తుదారు గ్రీన్‌కార్డు ప్రక్రియను అమెరికాలో ఉండి పూర్తిచేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అన్నదానిని ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని తెలిపింది. ఇది ఎప్పటినుంచో అమల్లో ఉన్న నిబంధనే అని పేర్కొంది. ఇమిగ్రేషన్ అధికారులకు ఆ విచక్షణాధికారాన్ని గుర్తుచేయడమే ఇటీవల ఇచ్చిన మార్గదర్శకాల ఉద్దేశమని, పూర్తిస్థాయిలో విధాన మార్పు కాదని వివరించింది.

# కేదార్‌నాథ్ కాలినడక మార్గంలో 19 కి.మీ. ట్రాఫిక్ రద్దీ



ఉత్తరాఖండ్‌లో కొనసాగుతున్న చార్‌ధామ్ యాత్రకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ముఖ్యంగా బాబా కేదార్‌నాథ్ సందర్శనకు పోటెత్తుతున్నారు. దీంతో కేదార్‌నాథ్ ధామ్‌కు వెళ్లే 19 కిలోమీటర్ల పొడవైన కాలినడక (ట్రెక్కింగ్) మార్గంలో శనివారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ మార్గంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు తీర్థయాత్ర నిర్వహణ, భక్తుల భద్రతపై పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

# వేములవాడ మున్సిపల్ కార్మికులకు సామాజిక భద్రత

**- చారిత్రాత్మక నిర్ణయంపై హర్షం**

**- ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ కు కార్మికుల కృతజ్ఞతలు**



**వేములవాడ, మే 31 (నేటి మనదేశమ్):** వేములవాడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 203 మంది కార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించడంతో ఆదివారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కృతజ్ఞతా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం వారి జీవితాల్లో భద్రతా భావాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రత కోసం నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికుల సామాజిక భద్రతను గుర్తించి ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యాలపై తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. కార్మికుల సమస్యలను గుర్తించి ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజులకు కార్మిక లోకం రుణపడి ఉంటుందని అన్నారు. కార్మికులు మాట్లాడుతూ, ప్రతిరోజూ తెల్లవారుజామునే విధుల్లో చేరి వేములవాడ పట్టణంతో పాటు రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్నామని తెలిపారు. ప్రమాదాలు లేదా అనారోగ్య పరిస్థితుల్లో కుటుంబ భవిష్యత్తుపై ఉండే ఆందోళనను ఈ నిర్ణయం తొలగించిందన్నారు. రూ.5 లక్షల ప్రమాద బీమా తమ కుటుంబాలకు భరోసానిచ్చే రక్షణ కవచంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వేములవాడ పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు మరింత బాధ్యతతో పనిచేస్తామని కార్మికులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సరిపెల్లి నరేష్, నాయకులు ముంజ రమేష్, బొట్టు శ్రీనివాసు, సావనపల్లి శ్రీనివాసు, పందుల మల్లేశం, ముప్పిడి తిరుపతి, ఎడ్ల బాలు, బొడ్డు శ్రీనివాసు, చింతల అనిల్, మహిళా నాయకురాళ్లు గాజుల వజ్రమ్మ, పుప్పాల మమత, పెంట గట్టవ్వ, వావిలాల రాధ, తోట శంకరవ్వ, వావిలాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ప్రణాళికతో వేములవాడ పట్టణాభివృద్ధి


**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**- రోడ్డు వెడల్పు పనులు పరిశీలించిన విప్**



**రాజన్న సిరిసిల్ల, మే 31: నేటి మన దేశమ్ ప్రతినిధి** వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం వేములవాడ పట్టణంలో రాజన్న ఆలయం ముందు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా వేములవాడ పట్టణ అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రులు, దేవదాయ శాఖ జిల్లా మంత్రుల సహకారంతో పనులను వేగవంతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాజన్న ఆలయంలో సుమారు రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఆలయం ముందు నుంచి బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. నిర్వాసితులు, దుకాణదారులు, పట్టణ పెద్దలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ పనులు ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు. ఈ రోడ్డుకు సంబంధించి సుమారు రూ.6.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయనీ, కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు పూర్తి చేసి అప్పగిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరితగతిన తారు రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో బ్యూటిఫికేషన్ పనుల కోసం రూ.2.60 కోట్లతో చర్యలు తీసుకున్నామని, సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వనమహోత్సవం సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు చెప్పారు. అన్నదాన సత్రం పనులు రూ.35 కోట్లతో కొనసాగుతున్నాయని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బీమేశ్వర ఆలయాన్ని రూ.6 కోట్లతో ఆధునికరించినట్లు తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి పూర్తయ్యే వరకు భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద కూడా పనులు వేగంగా జరుగుతున్నాయని, అక్కడి నిర్వాసితులకు సెటర్లు ఏర్పాటు చేసే పనులు త్వరలో పూర్తవుతాయని తెలిపారు. వేములవాడను ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ సౌందర్యీకరణ, మౌలిక వసతుల పరంగా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు కొండా శేఖర్, అన్నారపు శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ , తోటరాజు, నాయకులు కూరగాయల కొమురయ్య, సాగరం వెంకటస్వామి, సిరిగిరి శ్రీకాంత్, నాగరాజు ,తోట లహరి, పులి రాంబాబు, అనిల్, నాగుల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు జిల్లా రమేష్‌కు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శ



**రాజన్న సిరిసిల్ల, మే 31: నేటి మన దేశమ్ ప్రతినిధి** వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ రిపోర్టర్, ఆర్యవైశ్య సత్రం కమిటీ సభ్యుడు, సామాజిక కార్యకర్త జిల్లా రమేష్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రమేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, వైద్యుల సూచనలను పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎమ్మెల్యేతో పాటు వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, చిలుక రమేష్, సాగరం వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కూడా జిల్లా రమేష్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా రమేష్ కుటుంబ సభ్యులు తమను పరామర్శించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను జూన్ 2 నుండి అమలుచేయాలి

**నోముల భానుచందర్ ప్రగతిశీల యువజన సంఘం పివై ఎల్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 31 (నేటి మనదేశమ్)**,అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను తక్షణమే అమలు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు హైకోర్టులో ప్రభుత్వం పై కేసు వేసిన సందర్భంగా తక్షణమే ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని హైకోర్టు తీర్పునివ్వడం జరిగింది. దీనికి సంబంధించి 8(ఎనిమిది) వారాల గడువు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఇవ్వడం జరిగింది. హైకోర్టు తీర్పులో ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు(ప్లాట్ ), పెన్షన్ తదితర ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆదేశించడం జరిగింది. కావునా హైకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజమైన ఉద్యమ కారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

# టేకులపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 31 (నేటి మనదేశమ్)**,టేకులపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధి మరియు బాలికల ప్రోత్సాహం లక్ష్యంగా పలు పాఠశాలల విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు నియోజవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు . విద్యార్థినులకు సైకిళ్లను అందజేసి, వారి విద్యాభ్యాసంలో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు పాఠశాలకు సులభంగా చేరుకోవడానికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. టేకులపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కేశ వేణుగోపాలరావు మాట్లాడుతూ, సమాజ సేవే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని, విద్య, ఆరోగ్యం మరియు సామాజిక సంక్షేమ రంగాల్లో క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. సేవే మా ధ్యేయం విద్యార్థుల అభివృద్ధియే మా లక్ష్యం అనే నినాదంతో లయన్స్ క్లబ్ ఆఫ్ టేకులపల్లి సమాజ సేవలో ముందంజలో నిలుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని సంకల్పించింది. అన్నారు . క్లబ్ కార్యదర్శి తోటకూర సందీప్ కుమార్ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించి, లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ట్రెజరర్ దుర్గారావు, వీరభద్రం మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బొడ్డుపల్లి బ్రహ్మాచారి కార్యక్రమం విజయవంతానికి విశేషంగా కృషి చేశరని అన్నారు. అలాగే క్లబ్ సభ్యులు బండ్ల శ్రీనివాస్, బండ్ల రజిని, అంబాల బాలయ్య, అంబాల మయూరి, ఆర్ ఎం నరసింహారావు, ఉపేందర్ రావు తదితరులు సేవాభావంతో కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విద్యార్థినులకు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగిలాల్, టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్, ఇస్లావత్ రెడ్డి నాయక్, సంజయ్, నర్సింగ్ , లక్ష్మయ్య తదితరులు పాల్గొని విద్యార్థినులను అభినందించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజల సమక్షంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.


# ఈత వనాల పరిరక్షణకు రూ..6 లక్షలు మంజూరు

**ఈత వనాల పరిరక్షణకు బోర్ వెల్స్ మంజూరు చేసిన కలెక్టర్‌కు ఎమ్మెల్యే డా సంజయ్ కృతజ్ఞతలు**

**కోరుట్ల,మే 31(నేటి మన దేశమ్ ప్రతినిధి):**:కోరుట్ల నియోజకవర్గంలోని మెట్ల చిట్టాపూర్, పెద్దాపూర్, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదాల వల్ల ఈత వనాలు భారీగా దగ్ధమైన విషయం తెలిసిందే...ఈ నేపథ్యంలో ఈత వనాల పునరుద్ధరణకు, భవిష్యత్తులో అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ని శనివారం కలిసి వినతిపత్రం అందించారు..కాగాఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ మెట్ల చిట్టాపూర్, పెద్దాపూర్, చిన్నమెట్‌పల్లి గ్రామాల ఈత వనాల్లో బోరువెల్ పంప్‌సెట్లు ఏర్పాటు చేసేందుకు రూ.6 లక్షల రూపాయలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే సంబంధిత గ్రామాల గౌడ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ సమస్యను వెంటనే గుర్తించి పరిష్కార మార్గం చూపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ నిర్ణయం వల్ల ఈత వనాల పరిరక్షణతో పాటు భవిష్యత్తులో అగ్నిప్రమాదాల సమయంలో తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

# పెన్షనర్లు ఆందోళన వద్దు

**-పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్**




**జగిత్యాల, మే 31(నేటి మన దేశమ్ ప్రతినిధి)**:రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య చికిత్స అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన డిజిటల్ హెల్త్ కార్డుల గురించి ఆందోళన వద్దని, ఒక ప్రత్యేకమైన ట్రస్ట్ ఏర్పాటు చేసి డిజిటల్ హెల్త్ కార్డులను అందించనున్నారని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని అసోసియేషన్ భవన్లో పదవీ విరమణ ఉద్యోగులను, అధికారులను హరి అశోక్ కుమార్ చేతుల మీదుగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రత్యేక ట్రస్ట్ ను ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ పేరిట ఏర్పాటు చేసి దీని ద్వారా డిజిటల్ కార్డులు అందించి నగదు రహిత వైద్య చికిత్సలు అందించనున్నారని అయన పేర్కొన్నారు. ఈ పథకంను జూన్ 2 న ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నదన్నారు. పెన్షనర్లు ఎలాంటి ప్రొఫార్మాలు నింపాల్సిన అవసరం లేదని, దీనికి ఎలాంటి కాలపరిమితి లేదని, పెన్షనర్లు ఎలాంటి ఆందోళన పడవద్దని, ఇటీవల రిటైర్డ్ అయినవారు తమ హెల్త్ కార్డులను ప్రస్తుత పద్ధతి లోనే పొందవచ్చని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, కోశాధికారి గౌరి శెట్టి విశ్వనాథం, సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్, ఉపాధ్యక్షులు వి. ప్రకాష్, ఎం.డి. యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కే. సత్యనారాయణ, బొబ్బటి కరుణ, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు కుందేళ్ల మురళి, జగిత్యాల యూనిట్ అధ్యక్షులు బి. రాజేశ్వర్, ధర్మపురి అధ్యక్షులు కండ్లె గంగాధర్, కార్యదర్శి దుబ్బే శం, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షునిగా నియామకం పొందిన కైలాస్ శ్రీనివాస్ రావు గుప్తాకు సన్మానం



**కామారెడ్డి,మే 31.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షునిగా నియామకం పొందిన కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావుని ఆర్యవైశ్య సంఘం వివేకానంద కాలనీ ప్రతినిధులు ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వలిపిశెట్టి లక్ష్మీరాజం,కంకణాల శేఖర్,కొడిపాక రమణయ్య, పార్షి శ్రీనివాస్,గజవాడ శ్రీనివాస్ పాల్గొని, కైలాస్ శ్రీనివాస్ రావు ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. కైలాస్ శ్రీనివాస్ రావు కి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

# హన్వాడ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ జానకి వార్షిక తనిఖీ



**మహబూబ్‌నగర్ మే 31 (నేటి మనదేశమ్):** జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ హన్వాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్‌లు, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసులు, అనుమానితులు మరియు రౌడీ షీట్లు, స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు, వారెంట్లు, సీసీటీవీ, సీటీఎన్ఎస్ లాగ్‌లు, ఆన్‌లైన్ అప్‌డేట్లను పరిశీలించారు. పెండింగ్ అంశాలపై నిర్దేశిత గడువుల్లో చర్యలు తీసుకుని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేసుల నమోదు, సీటీఎన్ఎస్ అప్‌డేట్లు సకాలంలో చేయడంతో పాటు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా దర్యాప్తు నిర్వహించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్ పరిశుభ్రతను కాపాడాలని, ద్విచక్ర వాహనాలపై విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ ఆదేశించారు. అలాగే సిబ్బంది సంక్షేమం కోసం ప్రతి వారం సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులకు చెల్లింపులు వేగవంతం చేయాలి.-కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ మే 30 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లాలో మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయని,రైతులకు చెల్లింపుల ప్రక్రియను అత్యంత వేగవంతం చేశామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు రూ.52.34 కోట్ల విలువైన 2.18 లక్షల క్వింటాళ్ళ మొక్కజొన్నను రైతుల నుండి విజయవంతంగా సేకరించినట్లు ఆయన వివరించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరపాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని మార్క్ ఫెడ్ ప్రధాన కార్యాలయం నుంచి జిల్లా కార్యాలయానికి మొదటి విడత నిధులుగా రూ.31.08 కోట్లు విడుదలయ్యాయని కలెక్టర్ పేర్కొన్నారు. దీనితో పాటు ప్రభుత్వం నుంచి త్వరలోనే విడుదల కావలసిన తుది విడత నిధులు రూ. 21.26 కోట్లు కూడా మార్క్ ఫెడ్ జిల్లా కార్యాలయానికి అందిన వెంటనే,ఏమాత్రం ఆలస్యం లేకుండా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. జిల్లాలోని రైతు సోదరులెవరూ చెల్లింపుల విషయమై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,ప్రతి ఒక్కరికీ మద్దతు ధర నిధులు నేరుగా వారి ఖాతాల్లోకే చేరుతాయని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి.

**: జిల్లా కలెక్టర్ అంకిత్.**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 31 (నేటి మనదే శమ్)**, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నివారించాలి

## జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్



**జగిత్యాల,మే 31(నేటి మన దేశమ్ ప్రతినిధి):**:జగిత్యాల జిల్లాలో వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో రైతులు పంట అవశేషాలను, ముఖ్యంగా వరి కొయ్యలను బహిరంగంగా కాల్చివేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ సూచించారు.పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూసారం తగ్గిపోతుందని, మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ కార్బన్, ఉపయోగకర సూక్ష్మజీవులు. వానపాములు నశించి భూమి సారవంతత క్షీణిస్తుందని పేర్కొన్నారు.పంట అవశేషాల దహనం కారణంగా మంటలు అదుపు తప్పి సమీపంలోని ఆయిల్ పామ్ తోటలు, మామిడి తోటలు మరియు ఇతర పంట పొలాలకు వ్యాపించే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. దీనివల్ల రైతులు గణనీయమైన ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో పొడి వాతావరణ పరిస్థితుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సమీప వ్యవసాయ భూములను దెబ్బతీసే అవకాశం ఉన్నందున రైతులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.అదేవిధంగా, పంట అవశేషాల దహనం వల్ల సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు. విద్యుత్ సరఫరా తీగలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రజలు, రైతులు మరియు విద్యుత్ సిబ్బందికి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజా ఆస్తుల రక్షణ దృష్ట్యా రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను. పంట అవశేషాలను తగలబెట్టడం నిషేధించబడిందని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం రూ.5,000 నుండి రూ.25,000 వరకు జరిమానా విధించడంతో పాటు అవసరమైతే ఇతర చట్టపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.రైతులు పంట అవశేషాలను పొలంలోనే కలియదున్ని, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్పీ) వంటి ఎరువులను వినియోగించడం ద్వారా వాటిని త్వరగా కుళ్లిపోయేలా చేసి సేంద్రియ ఎరువులుగా మార్చుకోవచ్చని సూచించారు. ఈ విధానం ద్వారా నేలలో పోషకాలు పెరిగి తదుపరి పంటలకు అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు.జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంట అవశేషాల శాస్త్రీయ నిర్వహణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పర్యావరణ పరిరక్షణ, భూసార పరిరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణతో పాటు సమీపంలోని ఆయిల్పామ్, మామిడి తోటలు, ఇతర పంటలు మరియు విద్యుత్ మౌలిక వసతులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు పంట అవశేషాల దహనానికి పూర్తిగా దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు - జిల్లా ఎస్పీ నితికా పంత్..




**కొమురం ఆసిఫాబాద్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి)** :కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు సభా స్థలం, పార్కింగ్ ప్రదేశాలు, వీఐపీ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, హెలిప్యాడ్ ప్రాంతం, ట్రాఫిక్ మార్గాలు తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యటన సందర్భంగా భద్రతా నిర్వహణ కోసం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బందోబస్తులో 2 మంది అదనపు ఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 44 మంది సీఐలు/ఆర్ఐలు, 157 మంది ఎస్ఐలు/ఆర్ఎస్ఐలు/డబ్ల్యూఎస్ఐలు, 200 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 829 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 43 మంది మహిళా పోలీసు సిబ్బంది, 328 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. అదనంగా 9 ప్రత్యేక పార్టీలు, 2 రోప్ పార్టీలు, 28 యాక్సెస్ కంట్రోల్ బృందాలు, 10 బాంబ్ డిస్పోజల్ మరియు డాగ్ స్క్వాడ్ బృందాలను మోహరించినట్లు తెలిపారు. మొత్తం 1,825 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో పాల్గొంటారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, ట్రాఫిక్ మరియు భద్రతా నియమాలను పాటించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ విజ్ఞప్తి చేశారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణిచ్చినప్పుడే ప్రగతి-కలెక్టర్ రాజర్షిషా



**అదిలాబాద్ మే 30 (నేటి మన దేశమ్ ప్రతినిధి.**మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం,రాష్ట్రం ప్రగతి సాధిస్తాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు.శనివారం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో గ్రామీణాభివృద్ధి - సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల "యువతుల మాక్ పార్లమెంట్" స్నేహ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం,రాష్ట్రం ప్రగతి సాధిస్తాయని,తెలంగాణ రైజింగ్ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే సంకల్పంలో మహిళల పాత్ర కీలకమైనదన్నారు.ఈ సందర్భంగా అమ్మకు అక్షర మాల సర్టిఫికెట్ లను కలెక్టర్ అందజేసి,విద్యాబోధన మెరుగుకు కృషి చేసినందుకు ఆదిలాబాదు గ్రామీణ మండలం మత్తడిగూడాకు చెందిన అంగన్వాడీ టీచర్ మయూరిని,పలువురు మహిళలను శాలువాతో సన్మానించి,అమ్మ మాట-అంగన్వాడీ బాట సెల్ఫీ పాయింట్ వద్ద అవానీతులతో కలిసి ఫోటోలు దిగారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్,మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి,జెడ్పీ సీఈఓ రవి,డీడబ్ల్యూఓ మిల్కా,డీఆర్డీఓ రవీందర్ రాథోడ్,డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి ,సెర్ప్ అధికారులు,అంగన్వాడీ టీచర్లు,స్నేహ గ్రూప్ ప్రతినిధులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# రజితోత్సవ ఆత్మీయ సమ్మేళనం



**కామారెడ్డి,మే 31.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**కామారెడ్డి పట్టణంలోని వాసవి పబ్లిక్ స్కూల్ యొక్క పదవతరగతి 2000 – 2001 విద్యార్థుల రజితోత్సవ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వరలక్ష్మి గార్డెన్లో బ్రహ్మాండంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారుగా 80 మంది విద్యార్థులు హాజరు కావడం జరిగింది. ఆ సమయంలో ఉన్న ఉపాధ్యాయులందరినీ ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. విద్యార్థులంతా పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ పాతికేళ్ల మధుర సుర్మృతులు సాక్షిగా నాటి స్నేహబంధాలను జ్ఞాపకం చేసుకుంటూ నెమరు వేసుకుంటూ నేటి రజితోత్సవ వేల ఆత్మీయులు కలయికతో తీపి గుర్తులు చేర్చుకుంటూ వారంతా ఈ కార్యక్రమాన్ని ఒక పండుగల జరుపుకున్నారు.

# కులవృత్తుల అభివృద్ధికి కేంద్రం అండగా నిలుస్తోంది

## బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి

## ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనతో మహిళలు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు




**జగిత్యాల, మే 31(నేటి మన దేశమ్ ప్రతినిధి):**: కులవృత్తులను ప్రోత్సహిస్తూ సంప్రదాయ వృత్తిదారులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి అన్నారు.ఆదివారంజగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన మేరు సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద అర్హులైన వారికి ఉచిత శిక్షణ అందించడంతో పాటు శిక్షణ పూర్తయిన అనంతరం అవసరమైన కుట్టు మిషన్లు వంటి పనిముట్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అలాగే శిక్షణ కాలంలో లబ్ధిదారులకు స్టైఫండ్ కూడా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధి కోసం షాపులు లేదా ఇతర వ్యాపారాలు ప్రారంభించాలనుకుంటే కేంద్ర ప్రభుత్వమే రుణ సదుపాయం కల్పించి వారికి ఉపాధి అవకాశాలు సృష్టిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ఎంతోమంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఈ పథకం ద్వారా అనేక కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందన్నారు.ముఖ్యంగా మహిళలు, యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలనే ఆసక్తి చూపుతున్నప్పటికీ ఈ పథకం గురించి ఇంకా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. అర్హులైన వారిని గుర్తించి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తన వంతు సహకారం కూడా అందిస్తానని తెలిపారు.ప్రజలకు ఉపాధి కల్పించడమే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన లక్ష్యమని, ఇప్పటికే ఎంతోమంది నిరుద్యోగులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరిందని శ్రావణి వివరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్,42వ వార్డ్ కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, ఆముదరాజు, కాశెట్టి తిరుపతి, సిరిపురం శ్రీనివాస్, రాగిళ్ళ సత్యనారాయణ, రాజుల నారాయణ, శ్రీనివాస్, బోగ నరేష్ మేరు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు, సంఘ నాయకులు, బీజేపీ నాయకులు, మహిళలు, యువత, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# మూడుచింతలపల్లిలో అర్ధరాత్రి మట్టి దందా కలకలం

## ప్రభుత్వ భూములే లక్ష్యమా?.. శాలవాని కుంట వద్ద భారీ యంత్రాలతో తవ్వకాల ఆరోపణలు

## గ్రామస్థుల సమాచారంతో రెవెన్యూ దాడులు.. 2 జేసీబీలు, 3 టిప్పర్లు స్వాధీనం






**శామీర్పేట, మే 31 (నేటి మనదేశమ్):** మూడుచింతలపల్లి గ్రామ పరిధిలోని శాలవాని కుంట సమీపంలో అర్ధరాత్రి వేళ జరిగినట్లు ఆరోపణలు వస్తున్న మట్టి తవ్వకాల వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు భారీ యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. స్థానికుల సమాచారంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి మూడు టిప్పర్లు, రెండు జేసీబీలను స్వాధీనం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.స్థానికుల కథనం ప్రకారం, శనివారం అర్ధరాత్రి సమయంలో శాలవాని కుంటకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో దాదాపు పది టిప్పర్లు, మూడు జేసీబీలతో మట్టి తవ్వకాలు కొనసాగుతున్నట్లు గుర్తించారు. భారీ వాహనాల రాకపోకలు, యంత్రాల శబ్దాలతో అప్రమత్తమైన గ్రామస్థులు అక్కడికి చేరుకుని తవ్వకాలపై ప్రశ్నించగా వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. తాము ఎవరినీ లెక్కచేయమన్న ధోరణిలో కొందరు వ్యవహరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**చెరువులు, ప్రభుత్వ భూములకు రక్షణ ఎక్కడ?**శాలవాని కుంటకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజల్లో ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యత కలిగిన శాఖలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**స్థానికుల సమాచ్రంతో రంగంలోకి అధికారులు** గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు పరిస్థితిని పరిశీలించారు. తనిఖీల సందర్భంగా మట్టి తరలింపునకు వినియోగిస్తున్నట్లు గుర్తించిన మూడు టిప్పర్లు, రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మిగిలిన వాహనాల వివరాలను సేకరించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిసింది.

**తవ్వకాల వెనుక ఉన్నవ్రెవరు?**ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాల కోసం అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటించారా? తవ్వకాల వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.మూడుచింతలపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనతో ప్రభుత్వ భూముల సంరక్షణ, అక్రమ తవ్వకాల నియంత్రణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజా ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారులు ఎంత మేరకు కఠినంగా వ్యవహరిస్తారన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న జనసేన కౌన్సిలర్ అభ్యర్థి!

## -లింగంపల్లి నర్సిములు



**ఆదిలాబాద్ మే 31 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లా పట్టణం కేంద్రంలో గత ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి మాజి మున్సిపల్ చైర్మన్ మనీషా పైన కౌన్సిలర్ గా పోటీ చేసిన జనసేన అభ్యర్థి లింగంపల్లి నర్సిములు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా ఆకర్షణ పథకాలు బీసీ లకు అందుతున్న అభివృద్ధి పథకాలకు నాయిబ్రామానులకు షాప్ లకు ఉచిత కరంట్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ఆకర్షితుడై డిపిసిసి మాజి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీ లో హ్వానిచ్చారు.

# లోటుపాట్లు లేకుండా సీఎం పర్యటన కు ఏర్పాట్లు...

## జిల్లా కలెక్టర్ కె.హరిత..



**కొమురం ఆసిఫాబాద్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి)** :జూన్ 1న జిల్లా పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన కు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఎం. డేవిడ్, యూవరాజ్ మామ్మట్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, డిఆర్ఓ దాసరి వేణు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ,సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కెరమెరి మండలం కొఠారి గ్రామ పంచాయతీ లోని కొత్తగుడ గ్రామంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గిరిజనులతో గ్రామ పటేల్ లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సీఎం పర్యటనకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు, ఓఆర్ఎస్ ప్యాకేట్లు , అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగజ్ నగర్ ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించే బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హెలిప్యాట్ వద్ద ,బహిరంగ సభ ఆర్ అండ్ బీ శాఖ అధికారులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సంబంధిత శాఖల సమన్వయంతో సీఎం పర్యటన ను విజయవంతం చేయాలని ఆదేశించారు..

# జిల్లాలో పోలీస్ యాక్ట్-30 అమలు

## - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ నితికా పంత్

## బాణాసంచా కాల్చడం, చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు..



**కొమురం ఆసిఫాబాద్, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి)** :రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ యాక్ట్-30 అమలులో ఉన్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, ప్రశాంతంగా జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చడం, ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు.పోలీస్ యాక్ట్-30 నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి శాంతియుత వాతావరణం నెలకొనేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె కోరారు

# కరాటేలో కృష్ణవేణి స్కూల్ విద్యార్థినికి బ్లాక్ బెల్ట్



**వేములవాడ, మే 31: నేటి మన దేశమ్ ప్రతినిధి** వేములవాడ పట్టణానికి చెందిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని గాజుల వివేక శ్రీ కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించి ప్రతిభ చాటింది. కరీంనగర్ పట్టణంలో శనివారం సాయంత్రం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా బ్లాక్ బెల్ట్ కరాటే గ్రేడింగ్ టెస్ట్లో ఆమె అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ ఘనతను అందుకుంది.ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్న వివేక శ్రీ చిన్న వయసులోనే బ్లాక్ బెల్ట్ సాధించడం విశేషమని పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థినికి శిక్షణ అందించిన కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే వివేక శ్రీ విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, వివేక శ్రీ సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com